

అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

గురువారం 10 -01-2019 సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 5 సంచిక : 13 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar, Mahaboobnagar, Warangal | www.navatelangana.com | 12 + 16 పేజీలు వెల : 6.50

మోడీ హటావో... మజ్దూర్ బచావో

కార్మిక నినాదాలతో దద్దరిల్లిన ఢిల్లీ

సార్వత్రిక సమ్మెతో మోడీ సర్కారుపై కార్మికలోకం కన్నెర్ర చేసింది. దేశవ్యాప్తంగా బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై నినదించింది. గల్లీ నుంచి ఢిల్లీ దాకా శ్రామిక జనం రోడ్లపైకి వచ్చారు. మోడీకి వ్యతిరేకంగా రెండు రోజులపాటు గళమెత్తారు. హక్కుల పోరాటంలో కదంతొక్కిన కార్మికలోకానికి సీఐటీయూ సెల్యూట్ చేసింది.

- ప్రజా వ్యతిరేక విధానాలపై ఐక్యపోరాటం
- కార్మిక ఆందోళనల్లో దేశ ప్రజానీకం : సీఐటీయూ ప్రధాన కార్యదర్శి తపన్ సేన్
- బృందా కరత్, హన్నన్ మొల్లా సంఘీభావం





మాట్లాడుతున్న తపన్‌సేన్



వివరాలు 9లో



ప్రదర్శనలో బృందాకరత్

మానవత్వం చూపటంలో విఫలం

ఎన్‌ఆర్‌సీ బాధితులకు, రోహింగ్యాలకు న్యాయం చేశామా? : అమర్త్యసేన్

వివరాలు 9లో

కేసీఆర్‌తో కలిసి 'హోదా' తెస్తా


25 జిల్లాలు ఏర్పాటు

- ఒక్కొక్క రైతు కుటుంబానికి ఏడాదికి 12 వేలు : పాదయాత్ర ముగింపు సభలో వైసీపీ అధినేత జగన్ 10లో

నిర్ణయానికి ముందే..

సీబీఐ డైరెక్టర్ ఎంపిక కమిటీ నుంచి తప్పుకున్న సీజేఐ

- న్యాయమూర్తి సిక్రిని నియమించిన రంజన్‌గొగోయ్



న్యూఢిల్లీ: కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) డైరెక్టర్ ఎంపికకు సంబంధించిన ఉన్నతాధికార కమిటీ నుంచి తాను తప్పుకుంటున్నట్టు ప్రధాన న్యాయమూర్తి రంజన్ గొగోయ్ ప్రకటించారు. సెలవుపై పంపిన సీబీఐ మాజీ డైరెక్టర్ అలోక్ వర్మను తిరిగి నియమించాలని తీర్పువెలువరించిన వారంలోపే ప్రధాన న్యాయమూర్తి ఈ నిర్ణయం ప్రకటించటం ...9లో

ఈబీసీ బిల్లుకు లైన్ క్లియర్

రాజ్యసభ ఆమోదముద్ర

- అనుకూలం 149..వ్యతిరేకం 7..



న్యూఢిల్లీ: అగ్రవర్ణ పేదలకు 10శాతం రిజర్వేషన్ బిల్లుకు రాజ్యసభ ఆమోదం తెలిపింది. ఈబీసీ బిల్లుపై సభలో సుదీర్ఘ చర్చ అనంతరం డిప్యూటీ ఛైర్మెన్ హరివంశ్ నారాయణ్‌సింగ్ డివిజన్ పద్ధతిలో ఓటింగ్ నిర్వహించారు. ఈబీసీ బిల్లుకు అనుకూలంగా 149 మంది ...9లో

డిగ్రీలో కొత్త కోర్సులు

డిమాండ్ ఉన్న కోర్సులకు అనుమతి

- కొత్త కాలేజీలకు నిరాకరణ : ఉన్నత విద్యామండలి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో డిగ్రీ విద్యలో మార్పులు చేయాలని తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి (టీఎస్‌సీహెచ్‌ఈ) భావిస్తున్నది. అందులో భాగంగా ఉపాధి అవకాశాలు, మార్కెట్ అవసరాలకు అనుగుణంగా కొత్త కోర్సులు ప్రవేశపెట్టాలని సమాలోచన చేస్తున్నది. బీఏ జర్నలిజం తరహాలో కొన్ని కోర్సులను ప్రవేశపెట్టే ఆలోచన చేస్తున్నది. ఇందుకు సంబంధించి విశ్వవిద్యాలయాల నుంచి ...9లో

ఇక ఎంపీ రేసు

మల్కాజ్‌గిరి నుంచి రాజీవ్‌శర్మ..?

ఎంపీ అభ్యర్థిగా బరిలోకి దింపేందుకు కేసీఆర్ యోచన

- పార్లమెంటు స్థానాలకు పెరుగుతున్న ఆశావహులు
- సీఎం దృష్టిలో పడేందుకు తహతహ
- చేవెళ్ల నుంచి స్వామిగౌడ్ లేదా మహేందర్‌రెడ్డి
- పెద్దపల్లి టిక్కెట్ కోసం పోటాపోటీ
- కడియంకే ఛాన్స్ అంటున్న టీఆర్ఎస్ వర్గాలు
- రేసులో ఘంటా చక్రపాణి, మల్లేపల్లి లక్ష్మయ్య



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన సలహాదారుగా ఉన్న మాజీ సీఎస్ డాక్టర్ రాజీవ్‌శర్మ.. త్వరలోనే రాజకీయ నాయకుడి అవతారం ఎత్తబోతున్నారా..? ఆయన్ను పార్లమెంటు బరిలో దింపేందుకు సీఎం కేసీఆర్ యోచిస్తున్నారా..? అంటే అవుననే ...9లో

భారత ఆర్థిక ప్రగతికి గండి

నోట్ల రద్దు, జీఎస్టీ కారణం : ప్రపంచబ్యాంకు

వాషింగ్టన్: భారత ఆర్థిక ప్రగతికి మోడీ ప్రభుత్వం చేపట్టిన పెద్ద నోట్ల రద్దు, వస్తు, సేవల పన్ను విధానం (జీఎస్టీ) గండికొట్టాయని ప్రపంచ బ్యాంకు మంగళవారం విడుదల చేసిన ప్రపంచ ఆర్థిక ప్రగతి నివేదికలో వెల్లడించింది. 2018లో చైనా ఆర్థికాభివృద్ధి రేటు 6.5 శాతం వుంటుందని, భారత్ 7.3 శాతం వృద్ధి రేటు నమోదు చేసుకుంటుందని ప్రపంచ బ్యాంకు అంచనా వేసినప్పటికీ, చైనా 6.9శాతం వృద్ధి రేటు నమోదు చేసుకోగా భారత్ మాత్రం 6.7శాతం వద్దే చతికిల పడిందని తెలిపింది, భారత ఆర్థిక ప్రగతి మందగించటానికి ప్రధానంగా నోట్ల రద్దు, జీఎస్టీ అమలు కారణాలని ఈ నివేదిక స్పష్టం చేసింది. ప్రస్తుత ...9లో



రాహుల్, సోనియాలకు ఐటీ షాక్

ఏజేఎల్‌కు సంబంధించి వంద కోట్ల ట్యాక్స్ నోటీసు

న్యూఢిల్లీ: దేశంలో సార్వత్రిక ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీకి ఊహించని పరిణామం ఎదురైంది. యూపీఏ చైర్‌పర్సన్ సోనియాగాంధీ, కాంగ్రెస్ జాతీయాధ్యక్షుడు రాహుల్ గాంధీలకు ఐటీ శాఖ నుంచి షాక్ తగిలింది. అసోసియేటెడ్ ...9లో



తప్పుడు లెక్కలు

మోడీ సర్కార్‌కు కాగ్ అక్షింతలు

- 'ఆఫ్ బడ్జెట్'లో పెద్ద ఎత్తున వ్యయం
- అప్పుల ఖాతా, రెవెన్యూ ఖర్చులపై అభ్యంతరం

న్యూఢిల్లీ : అప్పుచేసి పప్పుకూడు తినడం ఏనాటికైనా ముప్పుతెచ్చే పనే. పోగా ఆ అప్పును దాచే పని మరింత ప్రమాదకరం. మోడీ సర్కార్ ఇలాంటి ఆర్థిక వ్యూహాన్నే (ఆఫ్ బడ్జెటింగ్) ప్రతీ ఏటా అమలుజేసిందని 'కంప్ట్రోలర్ ఆడిటర్ జనరల్' (కాగ్) తీవ్ర విమర్శలు చేసింది. అన్ని శాఖల్లో జరిగిన రెవెన్యూ, పెట్టుబడి వ్యయం కోసం అప్పులు చేయటం, దానిని ప్రస్తుత బడ్జెట్‌లో చూపకుండా మరో సంవత్సరానికి వాయిదా వేయటం...అనే ఆర్థిక వ్యూహాన్ని మోడీ సర్కార్ అమలుజేసిందని కాగ్ తేల్చింది. తద్వారా దేశ ఆర్థిక వ్యవస్థ, బడ్జెట్ వాస్తవ పరిస్థితిని దాచే ప్రయత్నం జరిగిందని తెలిపింది.

కేంద్ర బడ్జెట్‌పై కాగ్ రూపొందించిన ఆడిట్ నివేదికను మంగళవారం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టారు. ద్రవ్యలోటు, రెవెన్యూలోటును మోడీ సర్కార్ దాచాలనుకుంటోందని, ఇందుకు సంబంధించి అనేక ఉదంతాల్ని ఉదహరిస్తూ కాగ్ నివేదిక రూపొందించింది. తాజా నివేదికలో కాగ్ ...9లో



సంక్రాంతికి ధర పోటు

- అమాంతం పెరిగిన పప్పుల ధరలు
- కొండెక్కిన కోడి, భారమైన కోడిగుడ్డు
- రేషన్ షాపుల్లో ఇచ్చేది రెండు సరుకులే..

భగ్గుమంటున్న నిత్యావసర వస్తువులు..



నవతెలంగాణ - సిటీబ్యూరో

పెరిగిన ధరలు సామాన్యునికి చుక్కలు చూపిస్తున్నాయి. ఇప్పటికే కోడి, గుడ్డు ధరలు విపరీతంగా పెరిగి అందుబాటులో లేకుండా పోయాయి.. ఇప్పుడు వారం రోజుల్లో సంక్రాంతి పండుగ ఉండగా, నిత్యావసరాల ధరలూ అమాంతం పెరిగాయి. దీంతో సామాన్య ప్రజలు పిండి వంటలకూ దూరం కావాల్సిన పరిస్థితి ఏర్పడింది. కూరగాయాల ధరలూ అలాగే ఉన్నాయి. నిత్యావసర ధరలు పెరడంతో ఆనాదిగా ప్రకృతి పరంగా వస్తున్న సంక్రాంతి పండుగనూ భారంగా చేసుకునే పరిస్థితి వచ్చింది. ప్రత్యేకించి సంక్రాంతి పండుగకు అన్ని తరగతుల ప్రజలూ పిండి వంటలు చేసుకుంటారు. కానీ, ప్రస్తుతం మార్కెట్లో పిండి, నూనె, పుప్పులు, చక్కెర, ఇతర సరుకుల ధరలు అమాంతం పెరిగిపోయాయి. మినప పప్పు గత నెల కిలో రూ.65 ఉంటే ప్రస్తుతం మార్కెట్‌లో రూ.90 పలుకుతోంది. శనగపప్పు రూ.70, కందిపప్పు రూ.75 ఉంది. ఇలా పిండి వంటలకు ఉపయోగించే ప్రతి వస్తువు ధరా రూ.35 నుంచి రూ.10 వరకూ పెరి గింది. అసలే అరకొర వేతనాలతో ఇబ్బంది ఇబ్బంది పడే సామాన్యులు ఇంత ధరలు పెట్టి వస్తువులు కొనలేకపోతున్నారు.

కోడి కొక్కొరోకో..



పండుగ పూట ప్రతి ఒక్కరూ చికెన్, మటన్ కొను గోలు చేస్తారు. కానీ ప్రస్తు తం చికెన్ కిలోకు రూ.200 నుంచి రూ.230 వరకు పలుకుతోంది. చలికాలంలో కోళ్ల నోటికి వ్యాధివస్తుందని, దీంతో ఉత్పత్తి తగ్గిందని వ్యాపారులు చెబుతున్నా.. పండుగ సమీపిస్తుండగా ధరలు పెరగడంపై జనంపై ఆవేదన వ్యక్తం ...9లో


కాషాయ రాజకీయ కుట్రతోనే హింస

- హై కోర్టు సిట్టింగ్ జడ్జితో దర్యాప్తుకు డిమాండ్
- బులంద్‌షెహర్‌లో పర్యటించిన సీపీఐ(ఎం) నిజ నిర్ధారణ బృందం

న్యూఢిల్లీ : ఉత్తర ప్రదేశ్‌లోని బులంద్‌షహర్ జిల్లా సియానా బ్లాక్‌లోని నయా బస్, చింగ్రోతి గ్రామాలను సీపీఐ(ఎం) నిజ నిర్ధారణ బృందం శనివారం సందర్శించింది. బులంద్‌షెహర్‌లో గత డిసెంబరు 3న చోటు చేసుకున్న హింసాత్మక సంఘటనలలో పోలీసు అధికారి సుబోధ్ కుమార్ సింగ్, సుమిత్ అనే మరో వ్యక్తి మృతి చెందిన సంగతి తెలిసిందే. దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఈ సంఘటనపై ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) దర్యాప్తుకు ఆదేశించింది. కాని సిట్ ఈ సంఘటనను కప్పి పుచ్చే ప్రయత్నం చేస్తున్నదని, హై కోర్టు న్యాయమూర్తితో నిష్పక్షికంగా దర్యాప్తు జరిపించాలని సీపీఐ(ఎం) డిమాండ్ చేసింది. ఈ నేపథ్యంలో అక్కడ నెలకొన్న వాస్తవ పరిస్థితులు తెలుసుకునేందుకు సీపీఐ(ఎం) బృందం గత శనివారం ఆ గ్రామాలలో పర్యటించి సంఘటన వివరాలను తెలుసుకుంది. సీపీఐ(ఎం) పొలిట్ బ్యూరో సభ్యులు బృందాకారత్, సుభాషిణి అలీ, సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సురేందర్ సింగ్, జిల్లా కమిటీ సభ్యులు జగ్‌వీర్ భట్టి నిజ నిర్ధారణ బృందంలో సభ్యులుగా ఉన్నారు. ఈ సంఘటనకు సంబంధించి ప్రత్యక్ష ప్రభావాన్ని ఎదుర్కొన్న మహాబాత్ సహా నయా బస్, చింగ్రోతి గ్రామాలను నిజ నిర్ధారణ బృందం సందర్శించి పలువురి నుండి వివరాలను సేకరించింది. తప్పుడు కేసులు బనాయించి అరెస్టు చేసిన వ్యక్తులతో సహా గోవధ ఆరోపణలపై అరెస్టు చేసిన వారి కుటుంబ సభ్యులను కూడా ఈ బృందం కలుసుకుంది. ఆ గ్రామాలలో రైతులు తాము ఎదుర్కొంటున్న సమస్యలను కూడా నిజ నిర్ధారణ బృందానికి వివరించారు. యూపీ ప్రభుత్వం తన ఎజెండా ప్రకారం విద్వేషాలను రెచ్చగొట్టేందుకునే డిసెంబరు 3 నాటి సంఘటనలు చోటు చేసుకున్నాయని నిజ నిర్ధారణ బృందం నిర్ధారణకి వచ్చింది. పోలీసు అధికారి హత్యలో ప్రధాన నిందితులను ప్రభుత్వం రక్షణ కల్పిస్తోందని, గో వధ పేరుతో అమాయక ప్రజలను అరెస్టు చేస్తోందని నివేదిక వెల్లడించింది. మత విద్వేషాల నుండి లబ్ది పొందాలనుకున్న కొన్ని శక్తులు పథకం ప్రకారమే హింసను ప్రేరేపించాయా లేదా అనే దానిపై విచారణకు ప్రభుత్వం ఆసక్తి చూపడం లేదని పేర్కొంది. ఈ కారణంతోనే హై కోర్టు సిట్టింగ్ జడ్జి నేతృత్వంలో కాల పరిమితితో కూడిన విచారణ జరపాలని సీపీఐ(ఎం) నిజ నిర్ధారణ బృందం డిమాండ్ చేస్తున్నది. త్వరలో లోక్‌సభ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఇటువంటి సంఘటనలను నివారించేందుకు కూడా సిట్టింగ్ జడ్జితో దర్యాప్తు జరిపించడం అత్యవసరమని ఆ బృందం తన నివేదికలో పేర్కొంది.

బీజేపీ, కాంగ్రెస్‌లకు సమాన దూరం

ఒడిషా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ స్పష్టీకరణ



న్యూఢిల్లీ : రానున్న సార్వత్రిక ఎన్నికల్లో మోడీ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు మహా కూటమి ఏర్పాటుకు కొన్ని పార్టీలు ప్రయత్నిస్తుండగా.. ఈ కూటమిలో తమ పార్టీ భాగస్వామ్యం కాదని బిజు జనతాదళ్(బీజేడీ)నేత, ఒడిషా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ బుధవారం పేర్కొన్నారు. అయితే తమ పార్టీ బీజేపీ, కాంగ్రెస్‌లకు సమాన దూరంలోనే కొనసాగుతుందని అన్నారు. రైతుల సమస్యపై బీజేడీ నిర్వహిస్తున్న నిరసనల్లో పాల్గొనేందుకు మంగళవారం ఇక్కడకు వచ్చిన ఆయనను మహాకూటమిపై మీడియా ప్రశ్నించగా...దీనిపై ఆలోచించి, నిర్ణయం తీసుకోవడానికి కొంత సమయం కావాలని అన్నారు. కాగా, బుధవారం మహా కూటమిలో చేరబోయేది లేదని తెలియజేశారు. మహా కూటమి నేపథ్యంలో ఇప్పటికే పలు పార్టీల నేతలతో మాట్లాడిన ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారు. బీజేపీయేతర, కాంగ్రెసేతర కూటమి అయిన ఫెడరల్ ఫ్రంట్ ఏర్పాటు నిమిత్తం తెలంగాణా ముఖ్యమంత్రి కేసీఆర్ ఇటీవల నవీన్ పట్నాయక్, పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీని కలిసిన సంగతి తెలిసిందే.

కాంగ్రెస్ మహిళా విభాగం
జాతీయ ప్రధాన కార్యదర్శిగా ట్రాన్స్‌జెండర్

న్యూఢిల్లీ: దశాబ్దాల చరిత్ర కలిగిన కాంగ్రెస్ పార్టీ తొలిసారిగా ఓ ట్రాన్స్‌జెండర్‌కు అత్యున్నత పదవిని అప్పగించింది. చెన్నైకి చెందిన హక్కుల కార్యకర్త అప్సర రెడ్డిని కాంగ్రెస్ మహిళా విభాగం జాతీయ ప్రధాన కార్యదర్శిగా నియమించింది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ జాతీయ ధ్యక్షుడు రాహుల్ గాంధీని ఆమె ఢిల్లీలో కలిశారు. ఈ సందర్భంగా పార్టీలోని పలువురు మహిళా ఎంపీలు ఆమె నియామకం పట్ల హర్షం వ్యక్తం చేశారు. తన నియామకం గురించి అప్సర రెడ్డి మాట్లాడుతూ.. 'నీ జీవితంలో ఎలాంటి అద్భుతాలు జరుగవు. నిన్ను చూసి నవ్వుతారు. ఎక్కడికైనా వెళ్లిపో' అనే మాటలు తరుచూ వినేదానినని అన్నారు. కానీ ఆత్మవిశ్వాసంతో ముందుకెళ్లేవారికి వెక్కిరింపులు, వెటకా రాలు కొత్తేంకాదని, వాటిని అధిగమించి ముందుకెళ్తానని చెప్పారు. తనను ఈ పదవిలో నియమించినందుకు రాహుల్ గాంధీకి ధన్యవాదాలు తెలిపారు.

ఆకలి కారణంగానే..

బాలుడు పురుగుల మందు తాగాడు: ఎన్‌సీపీసీఆర్

భోపాల్: మధ్యప్రదేశ్‌లో ఓ గిరిజన బాలుడు పురుగుల మందు తాగిన ఘటనపై జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమిటీ(ఎన్‌సీపీసీఆర్) దర్యాప్తు చేసింది. ఆకలి కారణంగానే ఆ బాలుడు(10) పురుగుల మందును తాగాడని తెలిపింది. బాలుడు పురుగుల మందు తాగిన ఘటన పొన్‌బత్తా గ్రామంలో గతనెల 29న చోటుచేసుకున్నది. అయితే సామాజిక మాధ్యమాల్లో ఇది వైరల్ కావడంతోనే గత సోమవారం వెలుగులోకి వచ్చింది. దీంతో ఈ ఘటనపై ఎన్‌సీపీసీఆర్ దర్యాప్తును చేపట్టింది. ఇటీవల బాలుడి సొంత గ్రామంలో కమిటీ పర్యటించింది. సొంత గ్రామానికి దూరంగా కోట జిల్లాలో బాలుడి తల్లిదండ్రులు కూలీలుగా పనిచేసేవారు. గతేడాది నవంబరు నుంచే వారికి రేషన్ సరుకులు కూడా నిలిచిపోయాయి. ఆర్థిక పరిస్థితి కూడా అంతంత మాత్రమే. దీంతో బాలుడికి కొన్ని రోజులుగా తినడానికి తిండి లేదు. దీంతో తీవ్ర ఆకలితో ఉన్న బాలుడు తట్టుకోలేక క్రిమిసంహారక మందును తాగాడని ఎన్‌సీపీసీఆర్ చైర్మెన్ రాఘవేంద్ర శర్మ అన్నారు. అయితే బాలుడిని వెనువెంటనే ఆస్పత్రికి తరలించడంతో ప్రాణాపాయం తప్పింది. ఇప్పుడు బాలుడి పరిస్థితి నిలకడగానే ఉన్నది. కాగా, కమిటీ ఆరోపణలు అవాస్తవమని బాలుడి తండ్రి నానురాం చెప్పడం కొసమెరుపు.



సమ్మె సక్సెస్


శ్రీనగర్‌లో

పలు చోట్ల ప్రదర్శనలు, మానవహారాలు, ధర్నాలు

- కార్మిక సంఘాల అభినందన


సిమ్లాలో




కోల్‌కతా హౌరా బ్రిడ్జి

న్యూఢిల్లీ : కార్మికుల జీవన ప్రమాణాలు దెబ్బతీసేలా చర్యలు తీసుకుంటే సహించేది లేదని యావత్తు కార్మికలోకం మరోసారి ప్రభుత్వానికి స్పష్టం చేసింది. వ్యవసాయ సంక్షోభం, నిరుద్యోగం, ధరల పెరుగుదల, రుణ భారం వంటి సమస్యలు సామాన్యుడి నడ్డి విరిచాయి. ఈ నేపథ్యంలో మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల పట్ల కర్షక లోకం ఎంతగా విసిగి వేసారిపోయిందో ఈ సమ్మెతో స్పష్టమైంది. పది కేంద్ర కార్మిక సంఘాలు ఇచ్చిన రెండు రోజుల సమ్మె పిలుపులో భాగంగా బుధవారం దేశవ్యాప్తంగా కార్మికులు, కర్షకులతో సహా అన్ని రంగాలవారు పెద్ద సంఖ్యలో పాల్గొని సమ్మెను జయప్రదం చేశారు. అసోం, మణిపూర్, మేఘాలయ, ఒడిషా, పుదుచ్చేరి, కేరళ రాష్ట్రాల్లో కార్యకలాపాలన్నీ రెండు రోజుల పాటు పూర్తిగా స్తంభించిపోయాయి. బీహార్, గోవాల్లో మంగళవారం పారిశ్రామిక సమ్మెకే పరిమితమైనా బుధవారం పూర్తి స్థాయిలో బంద్ జరిగింది. ఆంధ్ర, తెలంగాణా, కర్నాటక, మధ్యప్రదేశ్‌లోని అన్ని జిల్లా కేంద్రాల్లో బంద్ వాతావరణం కనిపించింది. రోడ్డు రవాణా పూర్తిగా స్తంభించింది. తమిళనాడు, మహారాష్ట్ర, చత్తీస్‌గఢ్, జార్ఖండ్, ఉత్తరప్రదేశ్, హిమాచల్ ప్రదేశ్‌లో సమ్మె ప్రభావం బాగా వుంది. ఎన్‌టీపీసీ, ఎన్ఎఫ్‌సీ, బీడీఎల్ వంటి ప్రభుత్వరంగ సంస్థలు రెండు రోజులు పనిచేయలేదు. ఆంధ్రాలో ప్రభుత్వ కార్యాలయాల ఎదుట మానవ హారాలు నిర్మించారు. పంజాబ్, హర్యానా, గుజరాత్, రాజస్థాన్, మధ్యప్రదేశ్‌లో పారిశ్రామిక వాడలు పూర్తిగా మూతపడ్డాయి. విద్యుత్ ఉత్పత్తి, పంపిణీ, బొగ్గు ఉత్పత్తి, రవాణా, ఇనుప ఖనిజం, బొగ్గుయేతర తవ్వకాలు స్తంభిం చాయి. అసంఘటిత రంగ కార్మికులు పెద్ద ఎత్తున సమ్మెకు సంఘీభావం తెలిపి సమ్మెలో పాల్గొన్నారు. పలు పథకాల కార్మికులు కూడా పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. రక్షణ రంగ ఉద్యోగులు సమ్మెకు సంఘీభావం తెలిపారు. బెంగళూరు, చెన్నైల్లో ఐటి ఉద్యోగులు సంఘీ భావం ప్రకటించారు.


బెంగళూరులో


నాగ్‌పూర్

వేలాదిగా అరెస్టులు

అసోం, జార్ఖండ్, పశ్చిమ బెంగాల్‌ల్లో సమ్మె చేస్తున్న కార్యకర్తలను పెద్ద సంఖ్యలో అరెస్టు చేశారు. ఎస్మా ప్రయోగించారు. నో వర్క్, నో పే నోటీసులు అందచేశారు. సర్వీసులనుండి తొలగిస్తామని బెదిరించారు. అయినా ఇవేమీ కార్మిక శక్తిని ఆపలేకపోయాయి. రెండు రోజులూ పూర్తి స్థాయిలో కార్యకలాపాలను బహిష్కరించారు. రాజస్థాన్‌లోని అల్వార్‌లో, నీమ్రానాలో డైకిన్ కార్మికులపై దాడులు జరిగాయి. ఇది ప్రజాస్వామ్యంపై దాడి తప్ప మరొకటి కాదని సిఐటియు ఖండించింది.

సీఐటీయూ అభినందనలు

రెండు రోజులుగా కార్మికులు అద్భుతమైన పోరాట పటిమను ప్రదర్శిం చారని, దేశ ఆర్థిక వ్యవస్థను స్తంభింపచేశారని పేర్కొంటూ సీఐటీయూ కార్మిక లోకానికి అభినందనలు తెలియచేసింది. క్షేత్ర స్థాయి నుండి చూపించిన ఐక్యత వల్లనే ఇది సాధ్యమైందని పేర్కొంది. ఈ సమ్మెకు సంఘీభావం తెలిపిన ప్రపంచ కార్మిక సంఘాల సమాఖ్య (డబ్ల్యూఎఫ్‌టీయూ), అంతర్జాతీయ వాణిజ్య సంఘాల సమాఖ్య (ఐటీయూసీ)కు కృతజ్ఞతలు తెలియచేసింది.

గ్రామీణ హర్తాళ్ విజయవంతం

48గంటల పాటు జరుగుతున్న అఖిల భారత కార్మికుల సమ్మెకు మద్దతుగా రైతు సంఘాలు ఇచ్చిన పిలుపు మేరకు గ్రామీణ హర్తాళ్ కూడా దేశంలో పలు ప్రాంతాల్లో విజయవంతమైంది. కేరళ, త్రిపుర, తెలంగాణ, తమిళనాడు, కర్నాటక, జార్ఖండ్, పశ్చిమ బెంగాల్, ఒడిషా, రాజస్థాన్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్‌ల్లో గ్రామీణ ప్రాంత సమ్మె జయప్రదంగా జరిగింది. ఏఐకేఎస్, భూమి అధికార్ ఆందోళన్, ఏఐకేఎస్‌సీసీలు కార్మిక సమ్మెకు మద్దతు ప్రకటించాయి.




నిర్మానుష్యంగా కోల్‌కతా ఎయిర్‌పోర్టు


పాట్నాలో నిలిచిపోయిన బస్సులు

తెలంగాణ

ఓటు హక్కు కోసం పేర్లు నమోదు చేసుకోవాలి

- రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి రజత్‌కుమార్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్



వచ్చే ఎన్నికల్లో ఓటు హక్కు కోసం అర్హులు పేర్లు నమోదు చేసుకోవాలని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి డాక్టర్ రజత్‌కుమార్ తెలిపారు. గత నెల 26 నుంచే ఓటరు నమోదు ప్రక్రియ ప్రారంభమైందని జనవరి 25 వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని అన్నారు. ఇటీవల జరిగిన శాసనసభ ఎన్నికల్లో ఓటర్ల జాబితా విషయంలో ఎక్కువ ఆరోపణలు వచ్చాయని, అలాంటి పొరపాట్లు జరక్కుండా జాగ్రత్తలు తీసుకుంటున్నట్టు ఆయన వివరించారు. సచివాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కొత్తగా ఓటు వినియోగం కోసం మొత్తం 9 లక్షల 15 వేల దరఖాస్తులు వచ్చాయని, ఫిబ్రవరి 22న తుది ఓటర్ల జాబితా ప్రకటిస్తామన్నారు. తుది ఓటరు జాబితా ముద్రించిన తర్వాత ఓట్ల తొల గింపు చేయడం ఉండదని స్పష్టం చేశారు. తుది జాబితా ముద్రణ తర్వాత డబుల్ ఓట్లు కూడా తొలగించడం కుదరదన్నారు. ఓటు తొలగింపు కోసం 10 వేల దరఖాస్తులు వచ్చాయి. 95 శాతం అనర్హుల ఓట్లను తొలగి ంచామని, ఓటు గల్లంతైన వారి కోసం ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశా మని తెలిపారు. ఏదైనా గుర్తింపు కార్డుతో ఓటు వేయవచ్చని సూచించారు.

గణతంత్ర వేడుకలకు ఏర్పాటు చేపట్టాలి :సీఎస్

సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో జనవరి 26న జరిగే గణతంత్ర దినోత్సవ వేడుకల ఏర్పాట్లు ఘనంగా నిర్వహించడానికి వివిధ శాఖల అధికారులు పకడ్బంది ఏర్పాట్లు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా.ఎస్.కె.జోషి ఆదేశించారు. గణతంత్ర దినోత్సవ వేడుకల ఏర్పాట్లపై బుధవారం సచివాలయంలో సంబంధిత శాఖల అధికారులతో సీఎస్ సమన్వయ సమావేశం నిర్వహించారు.

బీటీపై మోన్‌శాంటోకు పేటెంట్ హక్కు రైతుకు నష్టం

- తెలంగాణ రైతు సంఘం

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

కార్పొరేట్ విత్తన సంస్థలకు భారత రైతుల నుంచి పేటెంట్ల పేరుతో బహుళజాతి విత్తన కంపెనీలు దోపిడీ చేయడానికి మోన్‌శాంటోకు అవ కాశం కల్పించే విత్తన పేటెంట్ హక్కు రైతులకు తీవ్రమైన నష్టమని తెలం గాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు పి జంగారెడ్డి, టి సాగర్ పేర్కొన్నారు. ఈమేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. భారత పేటెంట్ల చట్టం ప్రకారం మెన్‌శాంటోకు బీటీ పత్తిపై ఇంతవరకు పేటెంట్ హక్కులేదని, హక్కులేకున్నా దేశం నుంచి పేటెంట్ పేరుతో వేలకోట్ల లాభా లను తరలించకపోయారని తెలిపారు. ఇప్పుడు మోన్‌శాంటోకు హక్కులు కల్పించడంతో ఈ దోపిడీ మరింత పెరుగుతుందని అభిప్రాయపడ్డారు. ఈ తీర్పును బహుళ జాతి కంపెనీలన్నీ ఆహ్వానిస్తున్నాయని పేర్కొన్నారు. దీంతో రైతులు మాత్రం తీవ్రంగా నష్టపోతారని, మోన్‌శాంటో తన హక్కు లను బేయర్(ఏజీ) సంస్థకు అమ్మడం వల్ల ఇప్పుడు బేయర్ పేటెంట్ పేరు తో లాభాలు సంపాదిస్తున్నదన్నారు. ఇప్పటికే విత్తన కుంభకోణం వల్ల రైతు లు బాగా నష్టపోయారని, అన్ని పంటల్లోకి బీటీ టెక్నాలజీ తెచ్చారన్నారు.

అంతర్జాతీయం

ముగిసిన కిమ్ చైనా పర్యటన



ప్యాంగాంగ్ : ఉత్తరకొరియా అధ్యక్షుడు కిమ్ జోంగ్ ఉన్ చైనా పర్యటన ముగిసింది. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌తో రెండవ శిఖరాగ్ర సమావేశం విషయంలో సంప్రదింపులు జరుగుతున్న సమయంలోనే కిమ్ చైనా పర్యటన ఆసక్తికరంగా మారింది. గురువారం వరకు కిమ్, ఆయన భార్య, ఇతర కీలక ఉత్తర కొరియా అధికారులు చైనాలో ఉంటారని చైనా అధికారిక మీడియా తెలిపింది. అయితే, ఆయన ఒక్కరోజు ముందుగానే తన పర్యటన ముగించుకుని ఉత్తరకొరియాకు వెళ్లిపోయారు. ఉత్తర కొరియా నుంచి చైనాకు కిమ్ రైలులో వచ్చారు. ఆ రైలు సరిహద్దు దాటి చైనాలోకి ప్రవేశించగానే రెండు దేశాల అధికారిక మీడియా సంస్థలు ఈ పర్యటనకు సంబంధించి ప్రకటన విడుదల చేశాయి. ఆయన చైనా రాజధాని బీజింగ్ చేరుకున్నారన్న విషయం అందరికీ తెలుసు. కిమ్ కాన్వాయ్ చైనా రాజధాని రోడ్లపై వెళుతున్న దృశ్యాలు కూడా అందరూ చూశారు. ఉత్తర కొరియా పాలకుడిగా బాధ్యతలు చేపట్టిన తొలి ఆరేండ్లలో కిమ్ ఎలాంటి విదేశీ పర్యటనలు చేయలేదు. కానీ, గత ఏడాది కాలంలోనే ఆయన నాలుగు సార్లు చైనాలో పర్యటించారు. 2011లో తన తండ్రి కిమ్ జోంగ్ ఇన్ కూడా రష్యా, చైనా పర్యటనకు వినియోగించిన ఆకుపచ్చ, పసుపు రంగు రైలునే ఇప్పుడు కిమ్ వాడుతున్నారని జపాన్ మీడియా తెలిపింది.

ప్రధాన మిత్రదేశం చైనా :

దౌత్యపరంగా ఉత్తర కొరియాకు అత్యంత కీలక భాగస్వామి చైనా. వాణిజ్యానికి సంబంధించి కూడా ముఖ్యమైన మిత్ర దేశం. గతేడాదిలో కిమ్ మూడుసార్లు చైనాలో పర్యటించారు. జిన్‌పింగ్‌తో ఆయనకిది నాలుగో సమావేశం. దౌత్యపరంగా, ఆర్థికపరంగా అమెరికా, దక్షిణ కొరియాలే కాదు.. తమకు ఇతర మార్గాలు కూడా ఉన్నాయన్న సంకేతాలివ్వడమే కిమ్ చైనా పర్యటన వెనుకున్న ఉద్దేశమని విశ్లేషకులు భావిస్తున్నారు. అణు ఒప్పందం లాంటివి కుదుర్చుకోవడంలో ఉత్తర కొరియాకు చైనా ఎంత ప్రాధాన్యత ఉన్న దేశమో ఈ పర్యటన ద్వారా సంకేతాలిస్తున్నారు.

తన నూతన సంవత్సర సందేశంలో కిమ్ తమ ఓపికను పరీక్షించొద్దనే హెచ్చరిక స్వరం కూడా వినిపించారు. అదే సమయంలో రెండవ శిఖరాగ్ర సమావేశం కోసం ప్రయత్నాలు జరుగుతున్నాయని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ తెలిపారు. ట్రంప్, కిమ్‌ల సమావేశం గతేడాది సింగపూర్‌లో జరిగింది. ఇప్పుడు ఎక్కడ జరగొచ్చు అన్న విషయం మీద ఎన్నో ఊహాగానాలు వినిపిస్తున్నాయి.

గూఢచర్యం కేసులో...
ఇజ్రాయిల్ మాజీ మంత్రికి 11ఏండ్ల జైలు



జెరూసలేమ్ : గూఢచర్యం కేసు లో ఇజ్రాయిల్ మాజీ మంత్రి గోనెన్ సెగేవ్ దోషిగా తేలారు. ఈకేసులో న్యాయస్థానం ఆయనకు 11 ఏండ్ల జైలుశిక్ష ఖరారు చేసిందని ఇజ్రాయిల్ న్యాయశాఖ బుధవారం ప్రకటించింది. ఇజ్రాయిల్ రక్షణ శాఖకు సంబంధించిన రహస్య సమాచారాన్ని ఇరాన్‌కు చేరవేసినట్టు విచారణలో సెగేవ్ అంగీకరించారని తెలిపింది. ప్రాసిక్యూషన్ వెల్లడించిన వివరాల ప్రకారం...1990లో సెగేవ్ ఇజ్రాయిల్ విద్యుత్ శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. ఈ క్రమంలో ఇజ్రాయిల్ రక్షణ శాఖకు సంబంధించిన కీలక దస్త్రాలను, సమాచారాన్ని ఇరాన్‌కు చేరవేశారు. ఆయన కదలికలపై అనుమానం వచ్చిన ఇజ్రాయిల్ ఆర్మీ సెగేవ్‌ను గినియాలో అదుపులోకి తీసుకుంది. మంత్రి పదవి చేపట్టక ముందు ఆయన నైజీరియాలో కొంతకాలం వైద్యుడిగా పనిచేశారు. 2005లో మాదకద్రవ్యాల కేసులో అరెస్టయి ఐదేండ్ల కారాగారం అనుభవించారు. జైలు నుంచి విడుదలైన తర్వాత కూడా ఆయన కోడింగ్ విధానం ద్వారా ఇజ్రాయిల్ సైనిక శిబిరాలకు సంబంధించిన అత్యంత రహస్య సమాచారాన్ని ఇరాన్‌కు చేరవేసినట్టు ఆధారాలతో సహా అధికారులు కోర్టులో ప్రవేశపెట్టారు.

గ్వాటెమాల నుంచి ఐరాస వెళ్లిపోవాలి : మొరేల్స్



గ్వాటెమాల : అవినీతి నిరోధక కేసుల దర్యాప్తు కోసం ప్రత్యేకంగా ఏర్పాటైన ఐరాస కమిషన్ 24 గంటల్లోపు గ్వాటెమాల నుంచి వెళ్లిపోవాలని అధ్యక్షుడు జిమ్మీ మొరేల్స్ ఆదేశాలు జారీ చేశారు. అవినీతి నిరోధక కేసులపై స్వతంత్ర్య దర్యాప్తు చేపట్టగలమని ఆయన ఉద్ఘాటించారు.

గ్వాటెమాల విదేశాంగ మంత్రి సాంద్రా జోవెల్ తెలిపిన వివరాల ప్రకారం...అవినీతి అధికారులపై కొరడా ఝుళిపించాలని గ్వాటెమాల సర్కార్ నిర్ణయించుకుంది. 2015లో అవినీతి నిరోధక కమిషన్ ఏర్పాటు చేసింది. ఈ కమిషన్ ఏర్పాటునకు ఐరాస సహకరించింది. 24 మంది సభ్యులతో కూడిన ఈ కమిషన్ వంద మందికి పైగా కీలక అధికారుల అవినీతి చిట్టాను పారదర్శకంగా బయటపెట్టింది. అరెస్టయినవారిలో కీలక అధికారులు, ప్రముఖ నేతలు కూడా ఉన్నారు. ఆరునెలల నుంచి ఐరాస కమిషన్ దూకుడు పెంచింది. దేశాధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టక ముందు మొరేల్స్ కూడా అవినీతికి పాల్పడ్డారని ఓ రిపోర్టును ప్రచురించింది. ఆయనను కూడా విచారించాలని గ్వాటెమాల ప్రాసిక్యూషన్ కార్యాలయాన్ని కోరింది. దీనిపై స్పందించిన మొరేల్స్ ఐరాస కమిషన్‌ను రద్దు చేయాలని యోచించారు.

అయితే, మొరేల్స్ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ప్రజలు ఆందోళన చేపట్టారు. అవినీతి రహిత సమాజం కోసం ఐరాస కమిషన్ తప్పనిసరి అని అభిప్రాయపడ్డారు.

ప్లకార్డులు, బ్యానర్లు చేబూని అధ్యక్షుడికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మొరేల్స్ అధ్యక్ష పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. నిరసనకారులు ఆందోళన కార్యక్రమాలు విరమించడంతో ప్రెసిడెంట్ ఐరాస కమిషన్ బహిష్కరణకు ఆదేశాలు జారీ చేశారు. అవినీతి నిర్మూలన కోసం గ్వాటెమాలలో ఏర్పాటైన ఐరాస కమిషన్ తన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించిందని ఐరాస ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెరస్ కితాబిచ్చారు.

ఆయన అమెరికా హీరో...

- కాల్పుల్లో మృతి చెందిన ప్రవాస భారత పోలీసు అధికారిపై ట్రంప్ ప్రశంసలు



వాషింగ్టన్: అమెరికాలోని కాలిఫోర్నియా నగరంలో దుండగుల కాల్పులకు బలైన భారత సంతతి పోలీసు అధికారి రొనిల్ సింగ్(33)పై అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రశంసలు కురిపించారు. ఆయన 'అమెరికా హీరో అని కితాబిచ్చారు. గతనెల26న అమెరికా-మెక్సికో సరిహద్దు ద్వారా మెక్సికోకు పారిపోయేందుకు గుస్తావో పెరేజ్ అనే అక్రమ వలసదారుడు ప్రయత్నించాడు. ఈ క్రమంలో సరిహద్దులో తనిఖీలు నిర్వర్తిస్తున్న రొనిల్ సింగ్‌పై ఆ వలసదారుడు కాల్పులకు పాల్పడి పరారయ్యాడు. ఈ ఘటన అందరి హృదయాలను కలచివేసింది. అమెరికా గుండె పగిలినంత బాధపడిందని ట్రంప్ వెల్లడించారు. కాలిఫోర్నియా పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేశారు. రొనిల్ మృతిపై ట్రంప్ సంతాపం వ్యక్తం చేశారు. మృతిచెందిన అధికారి కుటుంబ సభ్యులను, ఆయన తోటి ఉద్యోగులను ట్రంప్ ఇటీవల కలిసి మాట్లాడారు.

రాఫెల్ నుంచి దృష్టి మళ్లించేందుకే...

ఈబీసీ రిజర్వేషన్లు ఎన్నికల జిమ్మిక్కు

- సీబీఐపై సుప్రీం తీర్పు కేంద్రానికి చెంపపెట్టు
- సమ్మెను జయప్రదం చేసిన కార్మికవర్గానికి జేజేలు : సీపీఐ ప్రధాన కార్యదర్శి సురవరం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాఫెల్ కుంభకోణం నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అగ్రవర్ణ పేదలు (ఈబీసీ)లకు పది శాతం అంశాన్ని తెచ్చిందని సీపీఐ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి విమర్శించారు. ఈబీసీ రిజర్వేషన్ల అంశం ఎన్నికల జిమ్మిక్కు అని ఎద్దేవా చేశారు. బుధవారం హైదరాబాద్‌లోని మఖ్దూంభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈబీసీ బిల్లును న్యాయబద్ధంగా సెలెక్ట్ కమిటీకి పంపాలని చెప్పారు. అఖిలపక్షాన్ని పిలిచి ఏకాభిప్రాయం వచ్చేలా ప్రయత్నించాల్సి ఉండేదని అన్నారు. ఇవేవీ చేయకుండానే ప్రజల దృష్టిని మళ్లించేందుకు ఈబీసీ రిజర్వేషన్ల అంశాన్ని ముందుకు తెచ్చిందన్నారు. ఇటీవల ఎన్నికలు జరిగిన మూడు రాష్ట్రాల్లో ఓటమితో ప్రజలు వారివైపు లేరని గ్రహించి ఆకర్షించేందుకు ఇలాంటి పని చేస్తోందని చెప్పారు. విద్యా, సామాజికంగా వెనుకబడిన వారికి రిజర్వేషన్లు వర్తిస్తాయని అన్నారు.



ఆర్థికంగా వెనుకబడిన వారికి రిజర్వేషన్లు వర్తించబోవని స్పష్టం చేశారు. ఒకవైపు కార్పొరేట్ అనుకూల విధానాలు అవలంబిస్తూ ఇంకోవైపు అగ్రవర్ణ పేదలకు రిజర్వేషన్లు కల్పిస్తోందని విమర్శించారు. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం రిజర్వేషన్లు 50 శాతం దాటకూడదనీ అన్నారు. ప్రభుత్వరంగంలో రిజర్వేషన్లు అంతంతమాత్రంగానే అమలవుతున్నాయని చెప్పారు. ఖాళీ పోస్టులు భర్తీ కావడం లేదన్నారు. పరిమితంగా భర్తీ చేస్తున్నా ఈబీసీ రిజర్వేషన్లతో ఉద్యోగాలు ఎవరికి దక్కుతాయన్న ప్రశ్న ఉత్పన్నమవుతోందని అన్నారు. సీబీఐ డైరెక్టర్‌గా అలోక్‌వర్మను నియమించాలని సుప్రీం కోర్టు తీర్పు ఇవ్వడం కేంద్ర ప్రభుత్వానికి చెంపపెట్టు అని విమర్శించారు. ముస్లిం ఎమ్మెల్యే ప్రొటెం స్పీకర్‌గా ఉంటే ప్రమాణస్వీకారం చేయబోనని బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ ప్రకటించడం రాజ్యాంగవిరుద్ధమని విమర్శించారు. ఇది లౌకికవాదానికి వ్యతిరేకమని అన్నారు. ఈ దేశంలో ముస్లిములు ఉండకూడదా?అని ప్రశ్నించారు. ప్రొటెం స్పీకర్‌కు ముస్లిం అర్హుడు కాదా?అని అడిగారు. ముస్లిముల పట్ల బీజేపీకి ఎంత వ్యతిరేకత ఉందో ఈ ప్రకటనను బట్టి అర్థమవుతోందన్నారు. ఇంకోవైపు కేసీఆర్‌కు ఓవైసీ మద్దతు, మోడీకి కేసీఆర్ మద్దతు ఇవ్వడాన్ని ఎలా అర్థం చేసుకోవాలని అన్నారు. రెండురోజుల సార్వత్రిక సమ్మెను జయప్రదంచేసిన కార్మికవర్గానికి జేజేలు ప్రకటించారు. కేంద్రం ట్రేడ్ యూనియన్ల చట్టం తేవడం కార్మికుల హక్కులకు తీవ్రభంగం కలిగిస్తుందని చెప్పారు. ఈ చట్టాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

జిల్లాల సరిహద్దులో నీటి వివాదం

- కాకతీయ కాలువ క్రాస్ రెగ్యూలేటరీ వద్ద ఉద్రిక్తత

నవతెలంగాణ- కమ్మర్‌పల్లి

ఎస్సారెస్పీ నీటి విడుదల కోసం నిజామాబాద్, జిగిత్యాల జిల్లాల సరిహద్దు రైతుల మధ్య వివాదం నెలకొంది. ఇరు జిల్లాల రైతులు ఎస్సారెస్పీ కాకతీయ కాలువ క్రాస్ రెగ్యూలేటరీ వద్దకు చేరుకోవడంతో కొంతసేపు ఉద్రిక్తత ఏర్పడింది. నిజామాబాద్ జిల్లా కమ్మర్‌పల్లి మండలం ఉప్లూర్, జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం డబ్బా గ్రామాల మధ్య ఎస్సారెస్పీ కాకతీయ కాలువ క్రాస్ రెగ్యూలేటరీ ఉంది. ఇటీవల ఆయకట్టు రైతుల కోసం ఎస్సారెస్పీ నుంచి జగిత్యాల జిల్లా వెలుల్ల వద్ద గల క్రాస్ రెగ్యూలేటరీ వరకూ కాకతీయ కాలువలో నిల్వ ఉండేలా నీటిని వదిలారు. కాలువలో కొద్ది మేర నీరు నిల్వ కాగానే నిజామాబాద్ జిల్లా ఆయకట్టు రైతుల కోసం కమ్మర్‌పల్లి మండలం ఉప్లూర్ గ్రామ శివారులోని సరిహద్దులో ఉన్న క్రాస్ రెగ్యూలేటరీ గేట్లను దించారు. బుధవారం మధ్యాహ్నం జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం వర్షకొండ, పెద్దాపూర్, రేగుంట, ఇబ్రహీంపట్నం గ్రామాల కాకతీయ కాలువ ఆయకట్టు రైతులు క్రాస్ రెగ్యూలేటరీ వద్దకు చేరుకున్నారు. మూడు గేట్లలోని ఒక గేటును కొంత మేర ఎత్తి నీటిని దిగువకు వదిలారు. దిగువ జిల్లా రైతులు క్రాస్ రెగ్యూలేటరీ గేటును ఎత్తి నీటిని దిగువ భాగానికి వదులుకున్నారనే సమాచారం తెలుసుకున్న ఉప్లూర్ కాకతీయ కాలువ ఆయకట్టు రైతులు కూడా అక్కడికి చేరుకుని నీటి తరలింపును అడ్డుకున్నారు. ఈ సమయంలో ఇరు జిల్లాల రైతుల మధ్య స్వల్ప తోపులాట చోటుచేసుకోవడంతో ఘర్షణ వాతావరణం ఏర్పడింది. ఎస్సారెస్పీ అధికారుల అనుమతి లేకుండా గేటు ఎత్తి నీటిని ఎలా తరలించుకుపోతారని ఉప్లూర్ రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న కమ్మర్‌పల్లి ఎస్ఐ మురళి ఆధ్వర్యంలో పోలీసులు క్రాస్ రెగ్యూలేటరీవ ద్దకు చేరుకుని ఇరు జిల్లాల రైతులను సముదాయించి చర్చించారు. రైతులు ఎత్తిన గేటును కిందికి దించారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు కాకతీయ కాలువకు నీటిని వదలగానే క్రాస్ రెగ్యూలేటరీ గేట్లు ఎత్తుతామని చెప్పడంతో దిగువ జిల్లా రైతులు వెనుదిరిగారు.

గ్రామాన్ని విచ్ఛిన్నం చేసే కుట్ర

- పేదల పక్షపాతి ఎర్రజెండా : సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం

నవతెలంగాణ-ఖమ్మంరూరల్

ఐక్యంగా ఉన్న గ్రామాన్ని కొన్ని అరాచక శక్తులు విచ్ఛిన్నం చేసేందుకు కుట్ర చేస్తున్నాయనీ, పేద, బడుగు, బలహీన తరగతుల ప్రజలకు అండగా నిలబడేది సీపీఐ(ఎం) మాత్రమేననీ సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. ఖమ్మంరూరల్ తెల్దారుపల్లి గ్రామపంచాయతీకి సీపీఐ(ఎం) నుంచి సర్పంచ్ అభ్యర్థిగా తమ్మినేని కోటేశ్వరరావు బుధవారం మద్దులపల్లి గ్రామపంచాయతీలో నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా గ్రామ చావిడి సెంటర్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో తమ్మినేని మాట్లాడుతూ.. గెలుపోటములతో సంబంధం లేకుండా ప్రజల పక్షాన నిలబడి ప్రజా సమస్యలు పరిష్కరించడమే సీపీఐ(ఎం) ధ్యేయమన్నారు. తెల్దారుపల్లిలో సీపీఐ(ఎం)ను దెబ్బతీసేందుకు కొన్ని అసాంఘిక శక్తులు గ్రామంలో అలజడి సృష్టించేందుకు ప్రయత్నం చేస్తున్నాయన్నారు. గ్రామస్తులంతా సీపీఐ(ఎం) వైపు ఉండటం ఓర్వలేక దుష్ప్రచారాలు చేస్తూ పబ్బం గడుపుకుంటున్నారని విమర్శించారు. అరవై ఏండ్ల చరిత్ర గల తెల్దారుపల్లి ఔన్నత్యాన్ని దెబ్బతీసేందుకు కుట్ర జరుగుతోందన్నారు. ప్రజలంతా గ్రామ ఐక్యతను కాపాడాలని సూచించారు. ఈ కార్యక్రమానికి సీపీఐ(ఎం) రాష్ట్రకార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్‌రావు, జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బండి రమేశ్, సర్పంచ్ అభ్యర్థి తమ్మినేని కోటేశ్వరరావు, తమ్మినేని కమలమ్మ తదితరులు పాల్గొన్నారు.



నామినేషన్ వేస్తున్న సీపీఐ(ఎం) సర్పంచ్ అభ్యర్థి

'చిత్రపురి' ఇండ్ల కేటాయింపుల్లో అవకతవకలు

- విచారణ జరపాలి...
- సినీ కార్మికులకు న్యాయం చేయాలి : చిత్రపురి పోరాట సంఘం అధ్యక్షులు యస్.శ్రీనివాసరావు



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తెలుగు సినీ వర్కర్స్ కో-ఆపరేటివ్ హౌసి ంగ్ సొసైటీ(చిత్రపురి కాలనీ)లో సినీ కార్మికులకు ఇండ్ల కేటాయింపుల్లో అవకతవకలు జరిగాయని చిత్రపురి పోరాట సంఘం అధ్యక్షులు యస్. శ్రీనివాసరావు అన్నారు. ఈ అక్రమాలపై సమగ్ర విచారణ జరిపించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. హైదరాబాద్‌లోని సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో బుధవారం నిర్వహించిన మీడియా సమా వేశంలో ఆయన మాట్లాడుతూ...చిత్ర పరిశ్రమలో 24 విభాగాల్లో పనిచేసే కార్మికుల ఇండ్ల స్థలాల కోసం సినీ నటులు డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి పోరాటం చేసి 67 ఎకరాల 18 గుంటల స్థలాన్ని సాధించారని, అక్కడే చిత్రపురి కాలనీ ఏర్ప డిందని గుర్తుచేశారు. నేడు ఆ భూముల్లో హౌసిం గ్ సొసైటీ నిబంధనలకు విరుద్ధంగా సినీ పరిశ్ర మతో సంబంధం లేని వ్యక్తులకు ఇండ్లను కేటా యిస్తూ పాలకమండలిలోని కొందరు నాయకులు అవినీతికి పాల్పడుతున్నారని ఆరోపించారు. ఎలాంటి అవినీతి ఆరోపణలు పాల్పడలేదని చెప్ప దల్చుకుంటే... 4,213 ఇండ్లలో 24 విభాగాల్లోని ఏ విభాగంలోని సినీ కార్మికులకు ఎన్ని ఇండ్లు ఇచ్చారో చెప్పాలని డిమాండ్ చేశారు. ఇండ్ల సంఖ్య 4,213 ఉండగా...నిబంధనలకు విరుద్ధంగా 5,767 మంది సభ్యులు ఎలా ఉంటారని ప్రశ్నించారు. ఇళ్లు పొందినవారు ఎట్టిపరిస్థితుల్లోనూ అమ్మొద్దని, అలాంటిది ఇక్కడ ఇండ్ల అమ్మకాలు ఎలా జరుగుతాయని నిలదీశారు. సొసైటీలోని ఎవ్వరికీ తెల్వకుండా కైరోస్‌స్కూల్ 18 కోట్ల రూపాయలకు 33 ఏండ్లకు ఎలా లీజుకు ఇస్తారని ప్రశ్నించారు. సొసైటీలో జరుగుతున్న అక్రమాలపై బహిరంగ న్యాయవిచారణ జరిపించాలని ప్రభుత్వాన్ని కోరారు. అర్హులైన సినీ కార్మికులకు ఇండ్లు దక్కేలా పోరాటం కొనసాగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో చిత్రపురి పోరాట సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు యస్.వెంకట్‌స్వామి, ప్రధాన కార్యదర్శి పి.సంపత్‌కుమార్, డి.రాంబాబు, వంశీ, తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీల ఏకగ్రీవాలు

- నర్సయ్యపల్లి సర్పంచ్‌గా సీపీఐ(ఎం) అభ్యర్థి

నవతెలంగాణ- విలేకరులు

రాష్ట్ర వ్యాప్తంగా బుధవారం కూడా పలు గ్రామ పంచాయతీల సర్పంచ్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నాగర్‌కర్నూల్ జిల్లా బల్మూరు మండలం నర్సయ్యపల్లి గ్రామపంచాయతీ సర్పంచ్‌గా సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు దేశ్యానాయక్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

సిద్దిపేట జిల్లా నంగునూరు మండలంలోని జేపీ తండా సర్పంచ్ పదవి ఏకగ్రీవమైంది. నిన్న మొన్నటి వరకు బద్దిపడగ పాలమాకుల గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న గ్రామాల పునర్విభజనలో జేపీ తండా కొత్త పంచాయతీగా ఆవిర్భవించింది. ఇక్కడ గిరిజనులు, ముదిరాజ్‌లు మాత్రమే ఉన్నారు. ఆ గ్రామం ఎస్టీ రిజర్వు కావడంతో పాలమాకుల, బద్దిపడగ పరిధిలోని కులపెద్దలు నిర్ణయించుకుని సర్పంచ్‌గా భూక్య భిక్షపతి నాయక్, ఉప సర్పంచిగా ఆంజనేయులును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంగారెడ్డి జిల్లా కంగ్టి మండలంలోని ఎడ్లరేగడి తండా, జీర్గి తండా, జంమ్గి(కే) గ్రామస్తులు టీఆర్ఎస్ అభ్యర్థులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. హత్నూర మండలంలో కొత్తగా ఏర్పాటైన 3 పంచాయతీలు తెల్లరాళ్ల తండా, చింతల్‌చెరు, కొత్తగూడెం తండా ఏకగ్రీవమయ్యాయి. బుధవారం నామినేషన్ల చివరి రోజు సర్పంచ్ పదవులకు ఒక్కో నామినేషన్ మాత్రమే రావడంతో ఏకగ్రీవమయ్యాయి.

బీసీల రిజర్వేషన్ల సంగతేంటీ?

- ఎస్టీ, ముస్లిం జనాభాకు అనుగుణంగా పెంచాలి
- ప్రయివేటురంగంలోనూ రిజర్వేషన్లు వర్తింపచేయాలి : బీఎల్పీ రాష్ట్ర అధ్యక్షులు నల్లా సూర్యప్రకాశ్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ ప్రభుత్వం ఎస్టీలకు 10 శాతం, ముస్లిములకు 12 శాతం రిజర్వేషన్లు కల్పించాలని అసెంబ్లీ తీర్మానం చేసి కేంద్రానికి పంపించినా ఎందుకు చర్య తీసుకోలేదని బహుజన లెఫ్ట్ పార్టీ (బీఎల్పీ) రాష్ట్ర అధ్యక్షులు నల్లా సూర్యప్రకాశ్ ప్రశ్నించారు. దశాబ్దాలుగా బీసీలు వారి జనాభాకు అనుగుణంగా 52 శాతం రిజర్వేషన్ కల్పించాలని వినతిపత్రాలు ఇస్తున్నారనీ, విజ్ఞప్తులు చేస్తున్నారనీ, ఆందోళనలు నిర్వహిస్తున్నారనీ చెప్పారు. అయినా బీసీల రిజర్వేషన్ల సమస్య ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారిందని అన్నారు. బుధవారం హైదరాబాద్‌లో తనను కలిసిన విలేకరులతో ఆయన మాట్లాడుతూ గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం బీసీల రిజర్వేషన్లను పట్టించుకోలేదని విమర్శించారు. ఇప్పుడు బీసీ ప్రధాని అని చెప్పుకుంటున్న మోడీ హయాంలోనూ వారికి న్యాయం జరగడం లేద న్నారు. ప్రయి వేటురంగంలో రిజర్వేషన్లు కల్పించాలని సీపీఐ(ఎం) నాయ కత్వంలో వామపక్షాలు, సామాజిక శక్తులు అనేక పోరాటాలు చేసినప్పటికీ ప్రభుత్వాలు పట్టించు కోలేదని విమర్శించారు. అంబేద్కర్ రూపొందించిన రాజ్యాంగం ద్వారా రిజర్వేషన్లు ఎందుకు అమలు జరగాలో పార్లమెంటులో ఈబీసీ బిల్లుపై జరిగిన చర్చలో ఎంఐఎం సభ్యుడు అసదుద్దీన్ ఓవైసీ మాట్లాడారని చెప్పారు. వామపక్షాలు మౌనంగా ఉండడం శోచనీయమని అన్నారు. వామపక్ష పార్టీలు సరిగ్గా వ్యవహరించకలేకపోయాయని చెప్పారు.. మరింత సునిశితంగా వ్యవహరించాల్సి ఉండేదన్నారు.

ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా బీసీ,ఎస్టీ,ముస్లింల రిజర్వేషన్లను తక్ష ణమే ఆర్డినెన్స్ ద్వారా అమలయ్యేలా చూడాలని డిమాండ్ చేశారు. ప్రయివేటు రంగంలో రిజర్వేషన్ల అమలుకు ఆర్డినెన్స్ తేవాలని కోరారు. రిజర్వేషన్లకు తిలోద కాలు ఇచ్చేందుకే బీజేపీ కుట్ర పన్నుతోం దని చెప్పారు. బీజేపీ చేపడుతున్న రిజర్వేషన్ల వ్యతిరేక కార్యక్రమాలను తీవ్రంగా ఖండించారు. కేంద్ర ప్రభుత్వం, బీజేపీ కపటనీతికి వ్యతిరేకంగా రాష్ట్రవ్యాప్తంగా బహుజన చైతన్య సదస్సులు నిర్వహిస్తామని అన్నారు.

సంపాదకీయం

పంచాయతీలు-ఏకగ్రీవాలు

కోర్టు మొట్టికాయలు తిన్నాకగానీ స్థానిక సంస్థలకు ఎన్నికలు పెట్టడానికి ససేమిరా అన్న టీఆర్ఎస్ సర్కారు, ఇప్పుడు ఆ పల్లెసీమల్లో రాజకీయ జూదానికి శ్రీకారం చుట్టింది. పంచాయతీ సర్పంచి స్థానాలకు ఏకగ్రీవాలు చేసే పేర సాగుతున్న క్రీడ, ప్రజాస్వామ్యాన్ని ప్రశ్నార్థకం చేస్తున్నది. ప్రమాదంలో పడేస్తున్నది. చెర పడు తున్నది. రాష్ట్రవ్యాప్తంగా 12,700కుపైగ్రామపంచాయతీలకు రాష్ట్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్ జారీచేసింది. అందులో దాదాపు 4500కుపైగా తండా పంచాయతీల్లోనూ మూడు దశల్లో ఎన్నికలు జరగనున్నాయి. రాజ్యాంగబద్ధంగా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిపించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదే. అయితే, ఆ బాధ్యత నిర్వర్తించే పేర అధికార టీఆర్ఎస్ 'ఏకగ్రీవం' నాటకానికి తెరలేపింది. రూ. 20 లక్షల నుంచి రూ. 45 లక్షల వరకు పంచాయితీలకు బహిరంగంగా 'అర్రాస్' పెట్టడం ప్రజాస్వామ్య కాముకులను ఔరా అంటూ ముక్కున వేలేసుకునేలా చేస్తున్నది. ఏకగ్రీవం అంటే స్వచ్ఛందంగా జరిగే ప్రక్రియ. ఒకరే నామినేషన్ వేసి, వేరెవరూ పోటీరాకుండా ఉండటం ఏకగ్రీవం. ఇప్పటి టీఆర్ఎస్ సర్కారు ఏకగ్రీవాలు జరిగితే గ్రామాల అభివృద్ధికి నిధులు ఇస్తామంటూ అధికారికంగానే ప్రలోభానికి గురిచేస్తున్నది. ఇది ప్రజాస్వామ్య స్ఫూర్తికి మచ్చ. నిధులను ఎరవేయడం చట్టవిరుద్ధం. దానికి ప్రోత్సాహకం అనే ముద్దు పేరు పెట్టారు. ఏకగ్రీవంగా తమ వారిని ఎన్నుకుంటే తప్ప నిధులు రావని సంకేతాలివ్వటమే కదా ! ఇదోరకం రాజకీయ పాచిక. మరోరకంగా బ్లాక్‌మెయిలింగ్. ఇది రాజ్యాంగ విరుద్ధం. ఇది ప్రభుత్వానికి, ఎన్నికల కమిషన్‌కు, పోలీసు యంత్రాంగానికి తెలిసి జరుగుతున్నది. ఏకగ్రీవం పేరుతో సర్పంచి స్థానాలకు అర్రాస్ పెడుతున్నారు. లక్షలాదిగా డబ్బు ఇవ్వగలిగే వారికే పదవిపేరుతో అమ్మకాలు సాగుతున్నాయి. ఇక ప్రజాస్వామ్యం ఎక్కడున్నట్టు ? పదుల లక్షలు పెట్టి పదవి కొనుక్కునేవారు ప్రజాసేవ చేస్తారా ? సర్పంచ్ గిరి చేతికొచ్చిన మరుక్షణం నుంచి చేతివాటం ప్రదర్శించి పెట్టుబడితోపాటు అదనంగా కొల్లకొడతారు కదా ! ఈ పదవుల పందేరంలో అవినీతిని సర్కారే బహిరంగంగా ప్రోత్సహిచడం, స్థానిక పరిపాలనకు, పంచాయతీరాజ్ చట్టానికి, వాటి మౌలిక లక్ష్యానికి తూట్లు పొడవడమే.

పంచాయతీలను 14వ ఆర్థిక సంఘం నిధులు కొంతమేర ఆదుకున్నాయి. కాగా మండల, జిల్లా పరిషత్తులకు మాత్రం ఇటు రాష్ట్రం, అటు కేంద్రం నిధులు కేటాయించకుండా ఎండ బెట్టాయి. సర్పంచులకు చెక్ పవర్ ఇవ్వడానికి మూడేండ్ల సమయం తీసుకున్న ఈ ప్రభుత్వం, ఏకగ్రీవాల పేరుతో వేలం వేసి తన గుప్పిట బిగించే సంప్రదాయానికి శ్రీకారం చుట్టడం ఆందోళనకరం.



అధికార వికేంద్రీకరణ రాజ్యాంగంలోని 73వ సవరణ ప్రధాన ఉద్దేశ్యం. ప్రజల భాగస్వామ్యాన్ని పెంచడం. తాజాగా రాష్ట్రంలో చోటుచేసుకుంటున్న ఈ తంతుతో ప్రజాస్వామ్య ప్రక్రియను నీరుగార్చడమే. ఒకవైపు రియల్ ఎస్టేట్ మాఫియా కాసులను ఎరగా వేస్తూ గ్రామాలపై తన పడగనీడను ప్రసరిస్తుండగా, మరోవైపు అధికారమే పరమావధిగా ఎవరు ఎటుపోతే మాకేంటనే ధోరణితో అధికార పార్టీ పావులు కదుపుతున్నది. పెట్రేగిపోతున్న రాజకీయ రాబందులకు గుణపాఠం నేర్పాల్సిన సమయం ఆసన్నమైంది. ఏకగ్రీవాల పేర రిజర్వేషన్లకు అర్థంలేకుండా పోతున్నది. కాదు కాదు అర్థం లేకుండా చేస్తున్నారు. ఎస్సీ, ఎస్టీలున్న చోట వారిని అడ్డంపెట్టుకుని తమ అనుయాయులను ఉప సర్పంచులుగా రంగంలోకి దింపి, మళ్లీ పెత్తనం చేసే పరిస్థితులను సృష్టిస్తున్నారు. అసలు స్టాంపు(సీళ్లు) దగ్గర పెట్టుకుని, ఎన్నికైన సర్పంచులను రబ్బరుస్టాంపులుగా మార్చేస్తున్న వైనం ఎవరికి తెలియనిది ? ఇప్పటికే గ్రామ అభివృద్ధి కమిటీ(వీడీసీ)ల పెత్తనంతో ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన స్థానిక సర్పంచులు, ఇతర పాలక వర్గాలకు విలువ లేకుండాపోయింది. ఏకగ్రీవం పేర చోటుచేసుకున్న ఘర్షణలో యాదాద్రి-భువనగిరి జిల్లాలో ఒక అమాయక పౌరుడు తన విలువైన ప్రాణాలను కోల్పోవడం ప్రత్యక్ష ఉదాహరణ. రాజ్యాంగం ప్రసాదించిన 29 అధికారాలను స్థానిక ప్రభుత్వాలకు బదిలీ చేయకుండా, ఇప్పటికే అనేక రకాలుగా చెప్పుచేతల్లో పెట్టుకున్న చట్టసభల ప్రతినిధులు, ఏకగ్రీవాల పేర సమాజంలోని అట్టడుగు తరగతులకు ప్రజాస్వామ్య ఫలాలను అందకుండా అడ్డుకుంటున్నారు. ఓటుకు వెల కట్టడం ద్వారా సామాన్యులను అధికారానికి దూరంగా పెట్టడం, అసలా పంచాయతీ దరిదాపుల్లోకి రావాలంటేనే భయపడేలా చేస్తున్నారు. ఒక్కో ఓటు రూ. 10 వేలు పెట్టి కొనడానికి రంగం సిద్ధం చేస్తున్నారు. అధికార, ప్రతిపక్షం అన్న తేడా లేదు. ప్రతిపక్ష పార్టీ ఎమ్మెల్యేలను అధికార పార్టీ కొన్న తరహాలోనే పంచాయతీలను చెరబట్టే వ్యూహానికి పథక రచన చేయడం అంటే రాజ్యాంగాన్ని అవమానించడమే. పోటీ చేసే హక్కును హరించడమే. ఇది ఎంతమాత్రం క్షమించరాని విషయం. ఇంకా గట్టిగా చెప్పాలంటే నేరమే. పంచాయతీలను 14వ ఆర్థిక సంఘం నిధులు కొంతమేర ఆదుకున్నాయి. కాగా మండల, జిల్లా పరిషత్తులకు మాత్రం ఇటు రాష్ట్రం, అటు కేంద్రం నిధులు కేటాయించకుండా ఎండబెట్టాయి. సర్పంచులకు చెక్‌పవర్ ఇవ్వడానికి మూడేండ్ల సమయం తీసుకున్న ఈ ప్రభుత్వం, ఏకగ్రీవాల పేరుతో వేలం వేసి తన గుప్పిట బిగించే సంప్రదాయానికి శ్రీకారం చుట్టడం ఆందోళనకరం.

ఐరోపాలో ఆగని కార్మిక నిరసనలు



ఎం కోటేశ్వరరావు

ఐరోపాలో ప్రస్తుతం భౌతికంగా చలి, రాజకీయంగా వేడి పోటీ పడుతున్నాయి.మేలో ఐరోపా పార్లమెంట్ ఎన్నికల గడువు దగ్గరపడుతోంది. ఈ పూర్వరంగంలో పలుచోట్ల పెల్లుబుకుతున్న ఆందోళనల పట్ల ఎలా వ్యవహరించాలో పాలక పార్టీలకు దిక్కుతోచటం లేదు. పచ్చి మితవాదులు, నయా నాజీలు, ఫాసిస్టు శక్తుల ప్రభావం పెరుగుతోంది. ఫ్రాన్సులో పసుపు చొక్కాల ఆందోళన చల్లబర్చేందుకు అధ్యక్షుడు మక్రాన్ కొన్ని రాయితీలు ప్రకటించినప్పటికీ ప్రతి శనివారం జరుగుతున్న నిరసన ప్రదర్శనలు ఐదవ తేదీ కూడా జరిగాయి. సోషలిజాన్ని కాలదన్నుకొని పెట్టుబడిదారీ విధానాన్ని తిరిగి ప్రవేశపెట్టిన దేశం హంగరీ. పూర్తి పరిహారం లేకుండా ఓవర్‌టైమ్ చేయటం లేదా చేసిన పనికి వెంటనే చెల్లింపులు చేయనవసరం లేకుండా వీలు కల్పిస్తూ పార్లమెంట్ ఆమోదించిన బిల్లును 'బానిస చట్టం 'గా వర్ణిస్తూ దానికి వ్యతిరేకంగా వేలాదిమంది కార్మికులు వణికిస్తున్న చలిని కూడా లెక్క చేయకుండా పెద్దఎత్తున ప్రదర్శనలు జరిపారు. మరో పూర్వ సోషలిస్టు రాజ్యమైన సెర్బియాలో వరుసగా ఐదవ శనివారం ఐదవ తేదీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రదర్శనలు జరిగాయి. ఇవి మచ్చుకు కొన్ని. గతానికి భిన్నంగా ఈ ఆందోళనల సందర్భంగా జనం తీవ్రంగా స్పందించటం ఒక ముఖ్యాంశం. అన్ని చోట్లా ఆందోళనల లక్షణాలు ఒకే విధంగా లేనప్పటికీ మొత్తంమీద చూసినపుడు జనాకర్షక వైఖరులు, ఆర్థిక జాతీయవాదం ముందుకు వస్తున్నాయి. ఇవి విడివిడిగానూ, ఒకదానినొకటి ఆశ్రయించి గానీ వుంటాయి. ఈ వైఖరిని ఐరోపా యూనియన్‌ను బలహీనపరిచేందుకు దోహదం చేస్తుందన్నది కొందరి అంచనా. పదేండ్ల క్రితం పెట్టుబడిదారీ ప్రపంచాన్ని తీవ్రంగా కుదిపివేసి ఇప్పటికీ ప్రభావం చూపుతూ అందరికీ సుపరిచితమైన 2008 ఆర్థిక సంక్షోభం పర్యవసానాలే ఇవన్నీ అని చెప్పవచ్చు.

వివిధ సర్వేలు మితవాద శక్తులు గతం కంటే బలంగా తయారవుతున్నాయని, వివిధ పార్టీల మధ్య విబేధాలున్నప్పటికీ ఐరోపా యూనియన్‌కు బ్రేకులు వేసేవిగా వున్నాయని చెబుతున్నారు. ఇటీవలి వరకు అనేక దేశాలలో నోటి తుత్తర శక్తులుగా వున్నప్పటికీ ప్రస్తుతం అనేక దేశాలలో అధికారంలో వుండటం లేదా అధికార పక్షాలకు మద్దతు ఇచ్చేవిగా తయారయ్యాయి. ఇటీవలి కాలంలో పెరిగిన వలసలను వ్యతిరేకిస్తూ వలసల రహిత ఐరోపా కావాలని, ఐరోపా యూనియన్ బదులు ఐరోపా జాతులుగా ఉండాలని చెబుతున్నాయి.

రెండవ ప్రపంచ యుద్ధం తరువాత స్థూలంగా ఐరోపాలో సోషల్ డెమోక్రటిక్ పార్టీలు, మితవాద పార్టీలుగా రాజకీయ పక్షాలు వున్నాయి. గత పదేండ్లలో సాంప్రదాయ మితవాదం స్థానే పచ్చి మితవాద శక్తులు పెరిగి పెద్దవి అవుతున్నాయి. గత పాలకుల వైఫల్యాలను ఎండగడుతూ తాము నూతన ఐరోపాను నిర్మిస్తామనే ప్రజాకర్షక వాగ్దానాలు, వలస కార్మికులు ముఖ్యంగా ముస్లిం వ్యతిరేకతను రెచ్చగొట్టే శక్తులు పెరుగుతున్నాయి. ముస్లిం తీవ్రవాదంపై యుద్ధం పేరుతో అమెరికా నాయకత్వంలో పశ్చిమాసియా, ఆఫ్రికా, మధ్య ప్రాచ్యంలో ఐరోపా ప్రభుత్వాల మద్దతుతో దాడులు చేస్తున్న పూర్వరంగంలో ఐరోపాలోని మితవాదశక్తులలో ముస్లిం వ్యతిరేకత పెరగటంలో ఆశ్చర్యం లేదు. పదేండ్ల నాటి ఆర్థిక సంక్షోభంతో వలస కార్మికుల రాక తమ ప్రయోజనాలను దెబ్బతీస్తున్నదనే భావం ఐరోపాలో కలుగుతున్నది.

కొన్ని దేశాలలో జరుగుతున్న పరిణామాలు కొన్నేండ్లనాటి అరబ్బు వసంత కాల ఆందోళనలను పోలి వున్నాయన్నది కొందరి వర్ణన. సోవియట్ యూనియన్ మాదిరి ఆరు నుంచి 28దేశాలకు విస్తరించిన ఐరోపా యూనియన్ కూడా ప్రజాకర్షక, ఆర్థిక జాతీయవాదాలతో కూలిపోతుందా అని కూడా పరిపరివిధాల ఆలోచిస్తున్న వారు లేకపోలేదు. అనేక దేశాలలోని పరిణామాలు అంతర్గత రాజకీయ నాటకాల లక్షణాలను కూడా కలిగి వున్నాయి. వీటికి వలసల సమస్య వుమ్మడిగా వుంది. అమెరికా, రష్యాలు ఐరోపా రాజకీయ వేదిక మీద ప్రధాన పాత్రధారులుగా వున్నాయి. ఐరోపా యూనియన్ వుమ్మడిగా రష్యాను వ్యతిరేకిస్తున్నది, అదే సమయంలో కొన్ని దేశాలు భిన్నవైఖరి వ్యక్తం చేస్తున్నాయి. ఐరోపా యూనియన్ తమ శత్రువు అని ట్రంప్ వర్ణించిన అంశం కూడా తెలిసిందే. ఈ పరిణామాలు వాటి మధ్య వున్న అంతర్గత వైరుధ్యాలకు నిదర్శనం. పాలకవర్గాలు రాజీపడుతున్న కారణంగా ఒక కొత్త రూపాన్ని తీసుకొనే స్థితి ఇంకా రాలేదు. ఒక కూటమిగా ఐరోపా బతికి బట్టగలుగుతుందా అన్న సందేహాలు కూడా వెలువడుతున్నాయి.

2019వ సంవత్సరం ఐరోపాలో అనేక పరిణామాలు సంభవిస్తాయని జోశ్యాలు వెలువడుతున్నాయి. మార్చి 29 ఐరోపా యూనియన్ నుంచి బ్రిటన్ వైదొలగనుంది. ఇటలీ ఆర్థిక సంక్షోభం మరింత ముదరవచ్చు. మే నెలలో జరిగే ఐరోపా పార్లమెంట్ ఎన్నికలలో మితవాద పార్టీలు మెజారిటీ సాధించటం లేదా దగ్గరగా వచ్చే అవకాశాలున్నాయి.పూర్వపు యుగోస్లావియా నుంచి ప్రత్యేక దేశంగా ఆవిర్భవించిన సెర్బియా అధ్యక్షుడు అలెగ్జాండర్ యుసిక్ నియంతృత్వ వైఖరికి వ్యతిరేకంగా వేలాదిమంది గత ఐదు వారాలుగా ప్రతి శనివారం రాజధాని బెల్‌గ్రేడ్‌లో ప్రదర్శనలు జరుపుతున్నారు. నవంబరు లో క్రుసెవాక్ పట్టణంలో ప్రతిపక్ష నేత బర్కొ స్టెఫానోవిస్ మీద దాడి చేసిన దుండగులు అధికారపక్షానికి చెందిన వారేనని ప్రతిపక్షాలు విమర్శించాయి.డిసెంబరు ఎనిమిది నుంచి జరుగుతున్న ప్రదర్శనల్లో విద్యార్థులు, కళాకారుల వంటి అనేక మంది ప్రముఖులు భాగస్వాములౌతున్నారు. యాభై లక్షల మందిలో ఒకరిని అనే బ్యానర్ వెనుక ప్రదర్శనలు జరుపుతున్నారు. ఒకవేళ 50లక్షల మంది వీధుల్లోకి వచ్చినప్పటికీ తాను ప్రతిపక్షంతో మాట్లాడేది లేదని, జనంచెప్పేది వింటానంటూ అధ్యక్షుడు యుసిక్ జనాన్ని మరింతగా రెచ్చగొట్టాడు. ముప్పై ప్రతిపక్ష పార్టీలు, సంస్థలు సెర్బియా కోసం కూటమి పేరుతో ప్రదర్శనలు జరుపుతున్నాయి.దేశం రోజు రోజుకూ నియంతృత్వంవైపు పయనిస్తున్నదని, ప్రజాస్వామిక వ్యవస్థలను చిన్నచూపు చూస్తున్నారని ప్రతిపక్షాలు విమర్శిస్తు న్నాయి. మీడియాలో స్వేచ్ఛలేదు, జర్నలిస్టులకూ స్వేచ్ఛ లేదని, ఎన్నికలు కూడా స్వేచ్ఛగా జరిగే పరిస్థితి లేదని విమర్శిస్తున్నాయి.

ఏడాదికి నాలుగు వందల గంటల పాటు ఓవర్‌టైమ్ వర్క్ చేయాలన్న యజమానులకు అనుగుణంగా చట్టం చేసిన హంగరీ ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ డిసెంబరులో ప్రారంభమైన నిరసనలు ఈనెలలో కూడా కొనసాగాయి. ఐదవ తేదీన జాతీయ సమ్మెకు పిలుపునివ్వగా మరోసారి 19వ తేదీన నిరసన ప్రదర్శనకు పిలుపునిచ్చారు. మెరుగైన వేతనాలు, సులువైన వుద్యోగ విరమణ విధానాన్ని కూడా వారు కోరుతున్నారు.అయితే ఈ ఆందోళనల వెనుక హంగేరియన్-అమెరికన్ బిలియనీర్ జార్జ్ సోరోస్ హస్తం వుందని, పెద్దమొత్తంలో నిధులు అందచేసినట్టు హంగరీ ప్రభుత్వం ఆరోపించింది. వలసదారుల అనుకూల విధానాలను తాము అడ్డుకుంటున్న కారణంగానే ఇదంతా జరుగుతోందని పేర్కొన్నది. కార్మిక చట్టంతో సహా అనేకం నిరంకుశంగా వున్నాయని ప్రతిపక్షాలు విమర్శించాయి. మరింత పని మరింత సంపాదన అనే ముసుగులో ఓవర్‌టైమ్ పరిమితిని ఏడాదికి 250 నుంచి 400గంటలకు పెంచటమే కాదు, పని చేసినందుకు వేతనం ఇంతకు ముందున్న చట్ట ప్రకారం ఏడాది లోపు ఎప్పుడైనా చెల్లించవచ్చు. తాజా చట్టంలో ఆ పరిమితిని



మూడేండ్లకు పెంచారు. కొన్ని సందర్భాలలో అదనపు వేతనం చెల్లించే అవకాశం లేకుండా చేశారు. ఇప్పటికే ఇరుగుపొరుగు దేశాలతో పోల్చితే పని గంటలు ఎక్కువ, వేతనాలు తక్కువగా వున్నాయి. హంగరీ నుంచి పెద్ద సంఖ్యలో విదేశాలకు వలసలు పోయిన కారణంగా స్థానిక బహుళజాతి కంపెనీ ఫ్యాక్టరీలు, కార్యాలయాల్లో పనిచేసే కార్మికుల సంఖ్య తక్కువగా వుండటంతో బలవంతంగా పని చేయించేందుకు ఈ చట్టాన్ని తీసుకు వచ్చారు. దీంతో ప్రభుత్వానికి అనుకూలంగా ఓటు వేసిన వారు కూడా నిరసనలలో భాగస్వాములయ్యారని వార్తలు వచ్చాయి.

దేశాలలో జనం వీధుల్లోకి రావటం అక్కడి అసంతృప్తికి నిదర్శనం అయితే పచ్చి మితవాద పార్టీలు జనాన్ని ఆకర్షించటం మరొక సూచిక. 2019 వారిదే అవుతుందా ? ఇటలీలో గతేడాది జరిగిన ఎన్నికలలో 630కిగాను 125 సీట్లు తెచ్చుకొని ఇటలీ సంకీర్ణ ప్రభుత్వంలో నార్తరన్ లీగ్ అనే మితవాద పార్టీ భాగస్వామిగా వుంది. పేరుకు చిన్నపార్టీ అయినా ప్రభుత్వ అజెండా రూపొందించటంలో పెద్ద పాత్ర నిర్వహిస్తున్నది. యూరోపియన్ కమిషన్ అధ్యక్షుడిగా వున్న జీన్ క్లాడ్ జుంకర్ తరచూ ఈ ప్రజాకర్షక శక్తులు, జాత్యంహంకారులు, ఫాసిస్టులు, సిల్వనీ(ఇటలీ) లీపెన్, జర్మనీ ఎఎఫ్‌డిపార్టీ వంటితో ఐరోపా ప్రమాదంలో వుంది అంటారు. ప్రస్తుతం హంగరీ, నార్వే, స్వీడన్, ఫిన్లాండ్, ఆస్ట్రియా, ఇటలీల్లో పచ్చి మితవాద పార్టీలు పాలక పక్షాలు లేదా భాగస్వామ్య పక్షాలుగా వున్నాయి. గతేడాది స్లోవేనియా పార్లమెంట్‌కు జరిగిన ఎన్నికలలో 90కి గాను రెండు పచ్చిమితవాద పార్టీలు 29 సీట్లు తెచ్చుకున్నాయి. అక్కడ ఇంకా ప్రభుత్వం ఏర్పడలేదు. హంగరీ ఎన్నికలలో 199 స్థానాలకు గాను రెండు మితవాద పార్టీలు 133, 26 చొప్పున 159 సీట్లు తెచ్చుకొన్నాయి. ఇటలీ ఎన్నికలలో మెజార్టీ సీట్లు మితవాద పార్టీలకే వచ్చాయి. దిగువ సభల్లోని 630 సీట్లకుగాను మూడు మితవాద పార్టీలకు కలిపి 379 వున్నాయి. ఎగువ సభలో 315కుగాను 140 తెచ్చుకున్నాయి. 2008లో తలెత్తిన ఆర్థిక సంక్షోభ . పర్యవసానంగా ప్రస్తుతం ఇటలీ తీవ్రమైన ఆర్థిక సమస్యల్లో వుంది. జర్మనీలో ఐదేండ్ల క్రితం ఏర్పడిన జర్మనీ ప్రత్యామ్నాయ పార్టీ(ఎఎఫ్‌డి)2017 ఎన్నికల్లో అతి పెద్ద ప్రతిపక్ష పార్టీగా ముందుకు వచ్చింది.2015లో దాదాపు పదిలక్షల మంది జర్మనీకి వలస వస్తే వారిలో ఎక్కువమంది ముస్లిం దేశాల నుంచి వచ్చిన వారే వున్నారు. ముస్లిం వ్యతిరేకత రెచ్చగొట్టి ఎఎఫ్‌డి బలం సంపాదించుకుంది.

వివిధ సర్వేలు మితవాద శక్తులు గతం కంటే బలంగా తయారవుతున్నాయని, వివిధ పార్టీల మధ్య విబేధాలున్నప్పటికీ ఐరోపా యూనియన్‌కు బ్రేకులు వేసేవిగా వున్నాయని చెబుతున్నారు. ఇటీవలి వరకు అనేక దేశాలలో నోటి తుత్తర శక్తులుగా వున్నప్పటికీ ప్రస్తుతం అనేక దేశాలలో అధికారంలో వుండటం లేదా అధికార పక్షాలకు మద్దతు ఇచ్చేవిగా తయారయ్యాయి. ఇటీవలి కాలంలో పెరిగిన వలసలను వ్యతిరేకిస్తూ వలసల రహిత ఐరోపా కావాలని, ఐరోపా యూనియన్ బదులు ఐరోపా జాతులుగా ఉండాలని చెబుతున్నాయి. యూరోబారో మీటర్ తాజా సర్వే ప్రకారం ఐరోపా యూనియన్ సభ్యత్వం తీసుకోవటం మంచిదే అయినప్పటికీ అది తప్పుడు మార్గంలో నడుస్తున్నదని 62శాతం మంది అభిప్రాయపడ్డారు. వలసల తక్షణ సమస్యగా భావిస్తున్నారు. మితవాద పార్టీలు 20శాతం మేరకు ఐరోపా వ్యాపితంగా ఓట్లను తెచ్చుకొనేవిగా వున్నాయని, ఇది మెజారిటీ సాధించేందుకు దోహదం చేయకపోయినా ఐరోపా యూనియన్ పనికి ఆటంకాలు కలిగించేందుకు వీలు కలిగిస్తాయని భావిస్తున్నారు. మేము ఒక చారిత్రక మలుపులో వున్నాం, తీవ్రమైన ప్రపంచీకరణ ముగింపునకు రానున్నది అని ఫ్రెంచి నేషనలిస్టు పార్టీ నాయకురాలు మారినె లీపెన్ ఇటీవల సోఫియా నగర పర్యటనలో చెప్పారు. ■


మెయిల్ @ నవతెలంగాణ

కౌరవులు టెస్ట్ ట్యూబ్ బేబీలా?



కె.ఎల్. కాంతారావు

ఇటీవలి ఇండియన్ సైన్స్ కాంగ్రెస్ సమావేశాల్లో ఆంధ్రా యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ నాగేశ్వరరావు మాట్లాడుతూ మహాభారత కథలోని కౌరవులు పుట్టుక అనే అంశం, ఆ కాలంలోనే భారతదేశంలో టెస్ట్‌ట్యూబ్ బేబీలను సృష్టించేంతగా వైద్య శాస్త్రం అభివృద్ధి అయిందని నిరూపిస్తోందని అన్నారు. సైన్సు విజ్ఞానం అంతగా లేని మన ప్రధాని, వినాయకుడి పుట్టుక, వేల సంవత్సరాల క్రితమే మనకు ప్లాస్టిక్ సర్జరీ, అదీ జంతువు తలను



మానవుని దేహానికి తగిలించే విజ్ఞానం మనకు ఉన్నదీ అంటే, ఆయనకు సైన్స్ విజ్ఞానం లేదు కాబట్టి అలా అన్నాడని కొద్దిగా బాధపడ్డాను. కాని ఒక విశ్వవిద్యాలయానికి అధిపతిగా ఉండి, 40మంది విద్యార్థులకు పీహెచ్‌డీలు రావడానికి, వారికి గైడ్‌గా వ్యవహరించిన ఒక శాస్త్రజ్ఞుని నోటినుండి ఇలాంటి ప్రకటన రావడం అదీ ఒక సైన్స్ సమావేశంలో జరగటం, దిగ్భ్రాంతిని కలిగిస్తోంది. ఒక అత్యున్నత కల్పనా గ్రంథమైన మహాభారతంలోని ఒక గొప్ప కల్పనకు, సైన్స్ అంశంగా నిరూపించే నాగేశ్వరరావుగారి ప్రయత్నం శాస్త్రజ్ఞుల సమూహాన్ని ఆశ్చర్య పరుస్తోంది.

నాగేశ్వరరావుగారి వాదనను పరిశీలిద్దాం. ఒకవైపు ఆయన మహాభారత కాలంలో గాజు టెస్ట్‌ట్యూబులు లేదని (ఒక టీవీ చర్చలో) అంటూనే, మరోవైపు స్టెమ్‌సెల్ టెక్నాలజీ వంటి అతి గొప్ప శాస్త్ర విజ్ఞానం ఆ కాలంలో ఉందంటున్నారు. గాజును తయారు చేసే టెక్నాలజీయే తెలియక మట్టికుండల్లో, విచ్ఛిత్తి చెందిన గర్భస్థ పిండాన్ని ఉంచారని అంగీకరిస్తూనే, అత్యాధునిక శాస్త్ర విజ్ఞానం వారికి తెలుసునని చెప్పడం వారి వాదనను వారే ఖండించుకోవడం కాదా? మరో విషయం, టెస్ట్‌ట్యూబ్ బేబీల సృష్టి అనేది వైద్య శాస్త్ర విషయం. అలాంటి విషయం ప్రాచీన వైద్య శాస్త్ర పండితులైన చరకుడు, శుశ్రుతుని రచనల్లో ఎక్కడా ఎందుకు కనిపించడం లేదు? కేవలం మహా కల్పనాగ్రంథమైన మహాభారతంలో మాత్రమే ఎందుకుంది? అంటే ఆనాటి వైద్యరంగం మహా శాస్త్రజ్ఞులకు ఆ విషయం తెలియదని అర్థం కావడం లేదా? ఇంకో విషయం కల్పనా గ్రంథమైన మహాభారత ప్రతులు కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు అనేక వేలు లభించాయి. కాని ఆనాటి శాస్త్ర విజ్ఞాన గ్రంథాలు ఈనాటికీ ఒక్కటైనా ఎందుకు లభించడం లేదు? ఎందుకంటే, అలాంటి విజ్ఞానమేది మనవద్ద లేదు కాబట్టి . చివరి విషయం స్టెమ్‌సెల్ టెక్నాలజీ, టెస్ట్‌ట్యూబ్ బేబీ టెక్నాలజీ అభివృద్ధి కావడానికి ముందు, అపారమైన జీవశాస్త్ర పరిజ్ఞానం, అండమూ, శుక్రాలను బాహ్యంగా కలపగలిగే విజ్ఞానం తదితర జీవశాస్త్ర పరిజ్ఞానం, వేల సంవత్సరాలనాడే మన పూర్వీకులకున్నట్టు తెలిసే ఆధారలేమీ లేవే?

ఇలా శాస్త్రీయ ఆధారాలు లేని విషయాలను శాస్త్రీయ విషయాలుగా ప్రకటించడం, ఒక విశ్వవిద్యాలయ ఉపకులపతి స్థాయికి తగిన పని కాదు. దీనిని శాస్త్రవేత్తల విషయాలను ప్రకటిస్తుంటే, ప్రపంచంలోని వైజ్ఞానిక శాస్త్రవేత్తల ముందు మన దేశం మరింత చులకన అవుతుందని గ్రహించాలి. ■


శబరిమల తీర్పు... బీజేపీ కుటిల నీతి!



సాగర్ వనపర్తి

శబరిమల అయ్యప్పస్వామి ఆలయంలోకి మహిళలను కూడా అనుమతిస్తూ భారత సర్వోన్నత న్యాయస్థానం ఇటీవల చారిత్రాత్మక తీర్పు వెలువడించింది. విశ్వాసం పేరుతో వివక్ష చూపడమంటే... భారత రాజ్యాంగాన్ని ఉల్లంఘించడమేనంటూ ఘాటుగా వ్యాఖ్యానించింది. ఇంకా చెప్పాలంటే, వారికి రాజ్యాంగం ప్రసాదించిన హక్కులను కాలరాసినట్టేనని ధర్మాసనం తెలిపింది. స్త్రీ కూడా మీరు చెప్పే దేవుడి స ష్టేనని... పనిచేసే చోట, పూజించే చోట ఈ భేదభావం ఎందుకని ట్రావెన్‌కోర్ బోర్డును సుప్రీంకోర్టు నిలదీసింది. తీర్పు వెలువడిన వెంటనే బీజేపీ కేంద్రమంత్రులు మేనకా గాంధీ, ఉమాభారతి, ఆ పార్టీ ఎంపీ సుబ్రమణ్యస్వామి... కేరళ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు పిళ్లై, ప్రధాన కార్యదర్శి సురేంద్రన్, ఆర్ఎస్ఎస్ నేతలు సైతం స్వాగతించారు. రెండు రోజులు గడిచిన వెంటనే మత నాయకులంతా కలిసి కథను మళ్ళీ మొదటి తెచ్చారు. నాగ్‌పూర్ కేంద్రంగా పాచికలు వేసి మరీ... అయ్యప్ప భక్తుల మనోభావాలను గుర్తించి తమ వైఖరి మార్చుకున్నామని కుటిల వ్యాఖ్యానాలు చేసిన తీరును యావత్ దేశం గమనించింది. అయితే, ఆది నుంచి ఈ తీర్పును బీజేపీ రాజ్యసభ సభ్యుడు సుబ్రహ్మణ్యస్వామి సమర్థిస్తూనే ఉండటం చెప్పుకోదగ్గ విషయం.

ముందుగా ఇద్దరు మహిళా జర్నలిస్టులు అయ్యప్ప దర్శనం చేసుకుందామని భావించారు. కానీ భక్తుల పేరిట మూకలన్నీ ఏకమై రాళ్ళు రువ్వి మరీ వారిని దారిలోనే దిగ్బంధించారు. దీంతో పోలీసులు సదరు మహిళా జర్నలిస్టులను లోపలికి తీసుకెళ్ళే ప్రయత్నంలో సాయం చేయడం కష్టమవుతుందని చెప్పారు. అనంతరం సుప్రీంకోర్టు తీర్పు సఫలీకతం అయ్యేందుకు ఫేస్‌బుక్‌లో ఏర్పడిన ఒక పేజీలో కొందరు దేవాలయ సందర్శన కాంక్షితులు పరిచమయ్యారు. ఆ విధంగా ఇటీవల దర్శనం చేసుకున్న కనకదుర్గ, బిందు ఒకరికొకరు కలుసుకున్నారు. ఆలయ దర్శనం కోసం స్థానిక పోలీసులను అభ్యర్థించారు. ఈ నేపథ్యంలోనే వారికి పోలీసులు సాయం చేసి దర్శనం కల్పించారు. అందుకు సంబంధించిన వీడియోలు టీవీల్లో హల్ చల్ చేయడం చర్చనీయాంశమైంది. అటు తర్వాత ఆర్ఎస్ఎస్ దాని అనుచరగణం స ష్టించిన విధ్వంసం అంతా ఇంతా కాదు. అయ్యప్ప ఆలయ దర్శనకు కేరళ పోలీసులను సంప్రదించిన మహిళలకు రక్షణ కల్పించడం అక్కడి ప్రభుత్వ కనీస బాధ్యత. సుప్రీంకోర్టు తీర్పు ఉల్లంఘిస్తే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని బీజేపీ దాని అనుబంధ సంస్థలకు కూడా తెలుసు. బీజేపీ, కాంగ్రెస్ నాయకత్వం మాట్లాడుతూ భక్తుల మనోభావాలు దెబ్బతిన్నం దున ఆందోళన నిర్వహిస్తున్నారని సెలవిస్తున్నారు. సరే ఈ వాదన నిజమనుకుందాం. భక్తులు నిజంగా భయోత్పాత వాతావరణం సృష్టిస్తారా? భక్తులు బస్సులు, సీపీఎం కార్యలయాలు తగలబెడతారా? అన్న ప్రశ్నకు వారి దగ్గర సమాధానం ఉండదు. ముమ్మాటికీ ఇది మతవాదులు స ష్టించే మారణహోమమేనని నిస్సంకోచంగా చెప్పవచ్చు. అల్లర్లపై ముఖ్యమంత్రి పినరయి విజయన్ మాట్లాడుతూ సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో ఆలయంలోకి వచ్చిన మహిళలకు రక్షణ కల్పించడం ప్రభుత్వం బాధ్యతనీ, రాజ్యాంగ బాధ్యతను ప్రభుత్వం నిర్వర్తించిందనీ వ్యాఖ్యానించారు. శబరిమలను ఘర్షణ జోన్‌గా మలిచేందుకు మతోన్మాదులు ప్రయత్నిస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ-ఆరెస్సెస్ ప్రేరేపించే హింసను కఠినంగా ఎదుర్కొంటామని దీటుగా సమాధానమిచ్చారు. ఇక ఆర్ఎస్ఎస్ దాని సైద్ధాంతిక సారూప్యత కల్గిన సంఘాలన్నీ సోషల్



మీడియాలో చేస్తున్న విష ప్రచారం భరించరానిది. ఇక వారు చేస్తున్న వాదన ఏమంటే... పురాతన కాలం నుంచీ కేరళ వేదభూమి, కర్మభూమి గనుక మత విశ్వాసాలను ప్రోత్సహించడంలో తప్పులేదంట. కానీ దానిలో శాస్త్రీయత ఇసుమంతైన ఉండాలన్నది సుప్రీంకోర్టు తీర్పు సారాంశం. ఆచారం పేరిట సాగే దురాచారాన్ని పాటిస్తామా? అని న్యాయస్థానం తీర్పు సందర్భంగా వ్యాఖ్యానించింది. ఇది అక్షర సత్యం. స్వాగతించాల్సిన అంశం కూడా. ఈ దేశం ఒక లౌకిక రాజ్యం. ప్రభుత్వాలు కూడా దేశ ప్రజల్లో శాస్త్రీయ ద కృథాన్ని పెంపొందించాల్సిన ఆవశ్యకత ఉందని భారత రాజ్యాంగం ఘోషిస్తున్నా బీజేపీ, కాంగ్రెస్ నాయకత్వాలు పెడచెవిన పెడుతున్నాయి. తీర్పును సర్‌పాస్ చేసేందుకు అధికారంలో ఉన్న బీజేపీ ఆర్డినెన్స్ తీసుకువచ్చి తీర్పును రద్దు చేయవచ్చు. కానీ బీజేపీ ఆర్ఎస్ఎస్, బజరంగ్‌దళ్, హిందూ వాహిని వంటి సంస్థలతో అరాచకాన్ని సష్టిస్తున్నది. మత సంరక్షణ పేరిట సాగే మానవ హననాన్ని ఎవరూ స్వాగతించరన్న విషయం మతోన్మాదులు గమనంలో ఉంచుకోవాలి. ఈ మతోన్మాదానికి వ్యతిరేకంగా ఇటీవల లక్షల మంది కేరళ మహిళలు మానవహారం నిర్వహించి తమ ఆకాంక్ష చాటి చెప్పారు. కొన్ని హిందూ సంస్థలు ఇచ్చిన పిలుపుతో అక్కడ హింస చెలరేగడం, బాంబులు విసరడం, సీపీఐ(ఎం), సీపీఐ కార్యాలయాలను ధ్వంసం చేయడం వంటివి పెద్ద ఎత్తున జరిగాయి. అయినా, హిందూ సంస్థలు కేరళ ప్రభుత్వం తమపై దాడి చేస్తుందని బుకాయించడం, సోషల్ మీడియాలో ఫ్యాబ్రికేటడ్ ఫోటోలు, వీడియోలు తయారు చేసి ఇతర ప్రాంతాల్లో అలజడికి ప్రయత్నిస్తున్నారు. మీడియా ప్రతినిధులపై కూడా మతోన్మాదులు దాడులకు తెగబడ్డారు. ఈ దాడులకు తమకు దర్శనభాగ్యం కలిగించాలని ఆలయం వద్దకు చేరిన మహిళలపై దాడులు చేయడం, అలా వచ్చేవారికి రక్షణ కల్పిస్తామన్న రాష్ట్ర ప్రభుత్వానిది మహాపరాధమన్నట్టు చిత్రించడం ఆశ్చర్యం కలిగిస్తోంది. మహారాష్ట్రలోని శనిసింగాపూర్ శనీశ్వరాలయం ప్రధాన వేదికపైకి మహిళలను అనుమతించకూడదన్న ఆచారం రాజ్యాంగ విరుద్ధమని నిరుడు బొంబాయి హైకోర్టు తేల్చి చెప్పాక అక్కడున్న బీజేపీ, శివసేన సర్కారు దాన్ని శిరసావహించింది. స్వయంగా పోలీసు రక్షణ కల్పించి మహిళా ఉద్యమనాయకురాలు తప్తి దేశాయ్ తదితర మహిళలకు దర్శనం ఇప్పించింది. అదే పని కేరళ వామపక్ష ప్రభుత్వం చేస్తే వీరికది మహాపరాధమై పోయింది.

రాజ్యాంగ స్ఫూర్తిని పెంపొందిస్తూ... సుప్రీంకోర్టు తీర్పును అమలు చేస్తున్న విజయన్ సర్కారుపై వీరంతా ఎందుకు కత్తి కడుతున్నారు. మతానికి సంబంధించిన అంశాలను సజీవంగా ఉంచి భావోద్వేగాలతో ఓట్లు రాజేసుకునేందుకు ఎత్తుగడలు వేసే శక్తులు దేశ రాజకీయ యవనికపై ఉండటం దౌర్భాగ్యం. మహిళలకు సమానత్వం అన్నిరంగాల్లో ఇస్తున్నామని చెప్పి... ఆలయాల్లో మాత్రం తాము ఎందుకు అనర్హులమని ప్రశ్నించే మహిళా భక్తులు కూడా అంతటా ఉన్నారు. ఇటీవల మీడియా ఛానెల్‌కు ప్రధాని మోడీ ఇంటర్వ్యూ ఇస్తూ... ట్రిపుల్ తలాక్‌తో ముస్లిం మహిళలు సమానత్వం పొందుతారని సెలవిచ్చారు. మరి సమానత్వం శబరిమలలో అవసరం లేదా?

కాంగ్రెస్, బీజేపీల కపట నీతి

శబరిమల అయ్యప్ప సన్నిధిలోకి మహిళలు వెళ్ళి దర్శనం చేసుకొన్న తర్వాత... అక్కడ చెలరేగిన హింసపై పార్లమెంట్‌లో చర్చించాలని పలువురు ఎంపీలు ఆందోళన చేశారు. దీనిపై ఉభయ సభలు చర్చించాలని వామపక్ష ఎంపీ కేకే రాగేష్ పార్లమెంట్‌లో స్పీకర్ కు వాయిదా తీర్మానం నోటీసులను అందజేశారు. కానీ, స్పీకర్ మాత్రం ఈ విషయంలో పక్షపాత వైఖరినే ప్రదర్శించారు. దేశవ్యాప్తంగా ఆందోళన కలిగించే విధంగా హింస చెలరేగిన అంశంపై చర్చించాల్సిన అవసరం లేదని రాగేష్ ఇచ్చిన నోటీసులను తిరస్కరించారు. అనంతరం ఎల్డీఎఫ్ ఎంపీలు పార్లమెంట్ లో నినాదాలు చేసి తమ ఆందోళన వ్యక్తం చేశారు. ఇందుకు ప్రతిగా కాంగ్రెస్ తరపున యూడీఎఫ్ ఎంపీలు చేతులకు నల్ల బ్యాడ్జీలు కట్టుకొని సభలో నిరసనఖ్యత్ర ప్రయత్నించిన వారిని యూపీఏ ఛైర్‌పర్సన్ సోనియా గాంధీ మందలించారు. కావాలంటే, కేరళలో తమ రాష్ట్ర కమిటీ నేతత్వంలో ఆందోళన చేపట్టుకోవచ్చని ఆమె వారికి హితవు పలికారు. మతం, మహిళల హక్కుల విషయంలో కాంగ్రెస్, బీజేపీ దొందూ దొందే...!

సెల్: 9494041258

మానవి
నవతెలంగాణ
హైదరాబాద్
manavi@navatelangana.com

గురువారం 10-1-2019

పోషకాల సంక్రాంతి



సంక్రాంతి చలికాలంలో వచ్చే అతి పెద్దపండగ. రైతులు పండించిన ధాన్యం పంటచేల నుంచి ఇంటికి తెచ్చే పండగ. కొత్తధాన్యంతో పిండివంటలు చేసుకోవడం సంప్రదాయంగా వస్తున్నా.. ఈ వంటల్లో ఉపయోగించే పదార్థాలు చలికాలంలో శరీరానికి కావల్సిన పోషకాలను అందిస్తాయి. అత్యధిక శక్తిని అందించే ఈ వంటల్లో ప్రధానంగా మనం ఉపయోగించేది నువ్వులనే.. మరి నువ్వులతో ఎలాంటి పిండివంటలు చేయవచ్చో చూద్దాం..

సకినాలు



కావలసిన పదార్థాలు
బియ్యం - కిలో
నువ్వులు - పావుకిలో
వాము - 2 టేబుల్‌స్పూన్లు,
వెన్న - 2 టేబుల్‌స్పూన్లు
ఉప్పు - తగినంత

తయారుచేసే విధానం:
ముందురోజు రాత్రి బియ్యాన్ని నానబెట్టాలి. ఉదయమే నానిన బియ్యం నుంచి నీళ్ళు వడగట్టాలి. నీళ్ల పూర్తిగా వడకట్టిన తర్వాత మెత్తగా పిండి పట్టించాలి. ఈ పిండిలో వెన్న, నువ్వులు, వాము, ఉప్పు, తగినన్ని నీళ్ల పోసి బాగా కలపాలి. పిండిని కొద్దికొద్దిగా చేతుల్లోకి తీసుకుంటూ కాటన్‌క్లాత్‌పై సకినాలు చుట్టుకోవాలి. అరగంటపాటు ఆరిన తర్వాత వీటిలో ఎక్స్‌ట్రాగా ఉన్న నీరంతా క్లాత్‌లోకి ఇంకిపోతుంది. ఆ తర్వాత స్టవ్‌పై బాండీలో నూనె కాగాక, ముందుగా చేసుకున్న సకినాలను వేసి వేయించాలి. ఇవి దాదాపు ఆరునెలల వరకు నిల్వ ఉంటాయి.

తీపి గుమ్మడితో



కావలసిన పదార్థాలు..
గుమ్మడికాయ - పావు కిలో
నువ్వులు -100గ్రాములు
నెయ్యి- రెండు టేబుల్‌స్పూన్లు
జీలకర్ర -ఒక టీస్పూన్
బెల్లం- రెండు టేబుల్‌స్పూన్లు

తయారుచేసే విధానం..
బాణలిలో నెయ్యివేసి కాగిన తర్వాత జీలకర్ర , గుమ్మడి కాయ ముక్కలు వేసి కలిపి మూతపెట్టాలి. ఇవి మగ్గిన తర్వాత అందులో చిటికెడు ఉప్పు బెల్లం వేసి మళ్లీ ఒక ఐదు నిమిషాలు ఉడికించాలి. జొన్న, సజ్జ రొట్టలోకి ఎంతో రుచిగా ఉంటుంది.

తీపి పులగం



కావలసిన పదార్థాలు..
కొత్త బియ్యం -కిలో
పెసరపప్పు -పావు కిలో
నువ్వులు -పావు కిలో
బెల్లం -కిలోపావు
నెయ్యి -పావు కిలో
డ్రైఫ్రూట్స్ -100గ్రాములు

తయారుచేసే విధానం..
ముందుగా పెసరపప్పు , నువ్వులు విడివిడిగా వేయించుకొని పెట్టుకోవాలి. బియ్యం, వేయించిన పెసరపప్పు కలియ దంచాలి.(రోటిలో దంచుకోలేని వారు మిక్సీలో ఒక రౌండ్ వేయవచ్చు) చివరగా నువ్వులు కూడా వేసి దంచాలి. (పెసరపప్పు, నువ్వులు కలిపి దంచిన ఈ బియ్యం ఎప్పుడైనా వాడుకోవచ్చు.)
ఒక గ్లాసు బియ్యానికి నాలుగు గ్లాసుల నీళ్ల తీసుకోవాలి. స్టవ్‌పై గిన్నె పెట్టి అందులో లెక్క ప్రకారం కావల్సినన్నీ నీళ్ల పోసి ఎసరు వచ్చేవరకు చూడాలి. ఎసరు వచ్చిన తర్వాత ముందుగా దంచిపెట్టుకున్న బియ్యం వేసి కలుపుతూ ఉడికించుకోవాలి. సన్నని మంటపై మెత్తగా ఉడికించుకోవాలి. ఉడికిన తర్వాత బెల్లం వేసి బాగా కలపాలి. మరో చిన్న బాణలిలో నెయ్యి వేసి డ్రైఫ్రూట్స్ వేయించుకోవాలి. మిగిలిన నెయ్యిని పులగంలో వేయాలి. డ్రైఫ్రూట్స్‌ను పులగంపై అందంగా అమర్చాలి. అంతే నోరూరించే తీపి పులగం రెడీ..

బర్ఫీ



కావలసిన పదార్థాలు..
నువ్వులు - పావు కిలో
బెల్లం - పావుకిలో
పల్లీలు - 100గ్రాములు
ఎండు కొబ్బరి తురుము - 50 గ్రాములు
జీడిపప్పు - కొద్దిగా,
నెయ్యి - రెండు టేబుల్‌స్పూన్లు.

తయారు చేసే విధానం:
నువ్వులు, పల్లీలను విడివిడిగా వేయించుకోవాలి. చల్లారాక వీటిని మిక్సీలో వేసి పొడి చేసుకోవాలి. ఇప్పుడు స్టవ్‌పై మందపాటి గిన్నె పెట్టి అందులో కొద్దిగా నీళ్ల పోసి బెల్లం వేయాలి. బెల్లం పూర్తిగా కరిగి తీగపాకం వచ్చేవరకు మెల్లగా కలుపుతూ ఉండాలి. పాకం వచ్చిన తర్వాత ముందుగా చేసుకున్న నువ్వులు, పల్లీల పొడి మిశ్రమం వేస్తూ ఉండలు కట్టకుండా కలుపుతూ ఉండాలి. గిన్నెకు అంటుకోకుండా మధ్యమధ్యలో కొద్దిగా నెయ్యి వేయాలి. ఈ మిశ్రమం కొద్దిగా గట్టిపడగానే స్టవ్ ఆపేయాలి. ఒక ప్లేట్‌కు నెయ్యి రాసి ఈ మిశ్రమాన్ని అందులో పోయాలి. డైమండ్ ఆకారంలో కట్ చేసి.. మధ్యమధ్యలో జీడిపప్పు ఉంచాలి. చల్లారిన తర్వాత ఫ్రిజ్‌లో ఉంచితే వారం రోజుల వరకు బాగుంటుంది.

ఉండలు



కావలసిన పదార్థాలు..
నువ్వులు - అర కిలో
బెల్లం - 400 గ్రాములు
యాలకుల పొడి - టీ స్పూన్
నెయ్యి- కొద్దిగా

తయారు చేసే విధానం:
నువ్వులను వేయించుకోవాలి. కొన్నింటిని పొడి చేయకుండా అలాగే ఉంచాలి. లేదా కాస్త పలుకుగా ఉండేట్లు దంచాలి. ఇందులో బెల్లం పొడి, యాలకుల పొడి వేసి మిక్సీ చేయాలి. కొద్దిగా నెయ్యి కూడా వేయాలి. చేతికి నెయ్యి రాసుకుని కావల్సిన సైజులో ఈ మిశ్రమాన్ని ఉండలుగా చేయాలి. ఈ ఉండలను నువ్వులలో దొర్లించాలి. అంతే నువ్వుల ఉండలు రెడీ. వీటిలో పోషకాలు మెండుగా ఉంటాయి. చలికాలం లో శరీరానికి కావల్సిన శక్తిని అందిస్తాయి.



రంగా పద్మ
తెలంగాణ వంటల స్పెషలిస్టు

క్లీన్‌గా ఉంచుకోండి...



- టీవీ రిమోట్ కంట్రోల్, బ్యాగు, పర్సు వంటి వాటిని తరుచుగా వినియోగిస్తుంటాం. కాబట్టి వాటిని ఎప్పటికప్పుడు క్లీన్‌గా ఉంచాలి.
- మొబైల్ ఫోన్, ఆఫీస్‌లో గానీ ఇంట్లో గానీ ప్రతి రోజూ వాడే కంప్యూటర్ కీ బోర్డు, మౌస్‌లను శుభ్రంగా ఉంచుకోవడం ద్వారా అలర్జీలకు దూరంగా ఉండవచ్చు.
- చలికాలంలో రిఫ్రిజిరేటర్‌ను పలుమార్లు ఉపయోగిస్తాం. ఆ సమయంలో చేతులకు ఉండే బ్యాక్టీరియా వైరస్‌గా మారక ముందే క్రిమి సంహారక మందులతో శుభ్రం చేయాలి.
- కారు లోపల ఉండే డ్యాష్ బోర్డును తప్పనిసరిగా వారానికోసారి తుడుచుకోవాలి. లేదంటే దుమ్ము, ధూళి ఉండి మరింతగా బ్యాక్టీరియా పెరుగుతుంది.
- పిల్లలు కారులో కూర్చున్నప్పుడు చాలా జాగ్రత్తలు తీసుకోవాలి. ముఖ్యంగా సీట్లను శుభ్రంగా ఉంచుకోవడం.

ఇట్లు చేద్దాం

ఎండిపోయిన పచ్చిమిరపకాయలు వృధాగా పారేయ్యకుండా, ఉప్పుజీలకర్ర, వెల్లుల్లి వేసి దంచితే రుచికరమైన చట్నీ తయారవుతుంది.



నిటారుగా కూర్చుంటే సరిపోదు...

గంటల కొద్దీ కంప్యూటర్ ముందు కూర్చోవడం వల్ల అలసట, తలనొప్పి, కండరాల మీద ఒత్తిడి పడుతుందంటున్నారు శాన్‌ఫ్రాన్సిస్కో స్టేట్ యూనివర్సిటీ పరిశోధకులు. 'బయో ఫీడ్‌బ్యాక్ జర్నల్' లో వచ్చిన ఈ అధ్యయన సారాంశమేమంటే... నిటారుగా కూర్చోవడం వల్ల వెన్నెముక కండరాలు మెడ, తల బరువును సపోర్టు చేస్తాయి. ఈ పొజిషన్‌లో ఉన్నప్పుడు మెడ కండరాలు ఐదు కిలోల బరువును భరిస్తాయన్నమాట. అలా కాకుండా తలను 45 డిగ్రీలో ముందుకు వంచి కూర్చుంటే మెడ భాగంపై అదనపు బరువు పడుతుందని చెబుతున్నారు ప్రొఫెసర్ ఎరిక్ పెపర్. సరిగ్గా కూర్చోకపోవడం వల్ల మెడ, తల భాగం మీద 20 కిలోల అదనపు బరువు పడుతుందట. దాంతో మెడ కండరాలు పట్టేసి, వెన్నెముకలో నొప్పి వస్తుంది.



అధ్యయనంలో భాగంగా 87 మంది విద్యార్థుల మీద పరిశోధన చేశారు. కంప్యూటర్ ముందు విద్యార్థులను మెడ, తల భాగం నిటారుగా ఉండేలా కూర్చోమన్నారు. అందర్నీ మెడలు తిప్పి, తలను ముందుకు కదిలించమన్నారు. 92 శాతం మంది తమ మెడను సులువుగా తిప్పారు. రెండో పరీక్షలో 125 మంది విద్యార్థులు 30 సెకన్ల సమయం తీసుకున్నారు. వీరిలో 98 శాతం మంది తల, మెడ, కళ్లు నొప్పి పుట్టాయని చెప్పారు. వారిలో 12 మంది విద్యార్థులను ఎలక్ట్రోమయోగ్రఫీ పరికరం ద్వారా పరిశీలిస్తే... తలను ముందుకు కదిలించినప్పుడు మెడ వెనక భాగంలో ఉండే ట్రపేజియస్ కండరం మీద ఒత్తిడి పడినట్లు గుర్తించారు పరిశోధకులు. కాబట్టి కంప్యూటర్‌పై ఎక్కువ సేపు పనిచేసేవారు తల, మెడ ఒకే పొజిషన్‌లో ఉంచి పని చేసుకోవాలి. స్క్రీన్ మీద అక్షరాల సైజును పెద్దగా చేసుకోవడం, కంప్యూటర్ రీడింగ్ అద్దాలు ధరించడం, కంప్యూటర్‌ను కళ్లకు సమాంతరంగా ఉండేలా చూసుకోవాలి.

రంగ వల్లులు



21చుక్కలు
మధ్య చుక్క
1 వచ్చేవరకు




కామిడి శ్రీదేవి రెడ్డి
పరకాల, వరంగల్ రూరల్ జిల్లా



కె. ఉషా
నేలకొండపల్లి

15చుక్కలు
సరిచుక్క
1 వచ్చేవరకు





14చుక్కలు
2వరుసలు
2 వచ్చేవరకు



కుమారి చీకట్ల సంగీత
తక్కళ్లపల్లి గ్రామం, జగిత్యాల జిల్లా

ఎకో వారియర్...



అందరూ వారసత్వంగా ఆస్తులు తీసుకుంటుంటారు. కానీ తల్లిదండ్రులు కన్న కలలను, కళలను వారసత్వంగా తీసుకునేవాళ్లు చాలా తక్కువమంది ఉంటారు. అందులో ఎకో వారియర్ నీర్జా పాలిశెట్టి ముందుంటారు. నేతకారుడైన తండ్రి పనిని గమనిస్తూ పెరిగిన ఆమె... ఏడో తరగతిలోనే జూట్‌తో పెన్సిల్ పౌచ్ నేసింది.
శ్రీకాకుళం జిల్లా పొందూరులో నేత కారుల కుటుంబంలో పుట్టింది. బరోడాలోని మహారాజా సాయాజీ రావు యూనివర్సిటీలో క్లాతింగ్ అండ్ టెక్స్‌టైల్ డిజనింగ్‌లో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసింది. లోతైన అధ్యయనం కోసం ఇంగ్లండ్ వెళ్లి నట్టింగమ్ ట్రెంట్ యూనివర్సిటీలో పీజీ చదివింది. యూనివర్సిటీల్లో ఎన్ని చదువులు చదివినా.. తన తండ్రి దగ్గర నేర్చుకున్నవాటి ముందు అంతా తక్కువే అంటుంది నీర్జా.
ప్రారంభంలో కొద్దిరోజులు తమిళనాడులో వస్త్ర వ్యాపారం చేసింది. తరువాత కొద్దికాలం కోయంబత్తూర్‌లో డిజైనింగ్ బోధన చేసింది. కానీ ఇవేవీ ఆమెకు సంతృప్తినివ్వలేదు. అందుకే ... 2016లో 'సూత్రకార్' పేరుతో జైపూర్‌లో వీవింగ్ స్టూడియో ప్రారంభించింది. రెండేండ్లు పూర్తయ్యాయి. అయినా ఆమె ఇంకా ఆటుపోట్లలోనే ఉంది. కారణం... పర్యావరణహితమైన ప్రొడక్ట్స్‌పై ప్రజలకు అవగాహన లేకపోవడమేనంటుంది. జపనీస్ సంస్కృతిలో భాగమైన పేపర్ వీవింగ్‌ను ఆమె మొదలుపెట్టింది. వేస్ట్ పేపర్స్ నుంచి హ్యాండ్‌బ్యాగ్స్, అలంకరణ వస్తువులు, వాల్ హ్యాంగింగ్స్, రగ్స్, ల్యాంప్‌షేడ్స్‌తో పాటు స్టేషనరీ ఉత్పత్తులైన పెన్ను స్టాండ్స్, డైరీలు, స్కెచ్‌బుక్స్ వంటివి తయారు చేస్తుంది. అన్ని ఉత్పత్తులు హ్యాండ్‌మేడ్. సహజమైన పద్ధతిలోనే. ప్రాసెసింగ్ కోసం కూడా విద్యుత్‌ను ఉపయోగించరు.
ప్రకృతిని చూస్తూ, భాగమై పెరిగిన ఆమె.. వెంచర్‌ను సైతం పర్యావరణ హితంగానే ఎంచుకుంది. స్టూడియోలో ఇద్దరు పూర్తికాలం నేతకారులు ఉంటారు. ప్రారంభించిన కొత్తలో... బంధువులు, స్నేహితులే ఉత్పత్తుల పట్ల ఆసక్తి చూపేవారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎగ్జిబిషన్స్ నిర్వహించి గిరాకీ పెరిగింది. ఇప్పుడు ఆన్‌లైన్‌లోనై నీర్జా ఉత్పత్తులు లభిస్తున్నాయి. సాధారణంగా పేపర్ వస్తువులు అనగానే.. మన్నిక ఉండదేమో అనుకుంటారు. కానీ ఒక్కసారి వాటిని వడికి ఉడికించిన తరువాత స్థితిస్థాపక గుణం వస్తుంది. అవి ప్రకృతికి ఎలాంటి హానీ చేయవు.
అయితే ఇప్పటిదాకా కొన్ని వస్తువులకే పరిమితమైన ఆమె... ప్రజల జీవితంలో రోజూవారీ వస్తువులను తయారు చేయాలని ఆలోచిస్తున్నది. ఇది సవాళ్లతో కూడుకున్నది. అయినా వాటికామె సిద్ధంగా ఉన్నది. పర్యావరణ హితమైన వస్త్రాన్ని, అది కూడా పేపర్‌తో తయారు చేయాలన్నది ఆమె కల. ఫ్యాషన్ ఇండస్ట్రీలో 17 ఏండ్ల అనుభవం ఉన్నది నీరజకు.
'ప్రపంచవ్యాప్తంగా ప్రజలను సుస్థిర జీవనవిధానంవైపు ప్రోత్సహించాలన్నది నా కల. ఇప్పుడు నా ఆశయానికి నా బర్త కూడా తోడయ్యాడు. ఈ భూమి మీద పుట్టినందుకు దానిని రక్షించి భవిష్యత్ తరాలకు అందించడాన్ని బాధ్యతగా భావిస్తాను' అంటుంది నీరజ.



సృష్టిలో మహిమలు, మాయలకు తావులేదు



రవికుమార్ సంగనమోని

ఈ విశ్వం గురించి, ఇందులో మనం నివసిస్తున్న భూమి గురించి, సూర్యుని గురించి, ఇతర గ్రహాల గురించి అవి ఏర్పడిన పరిస్థితుల గురించి ప్రధానంగా రెండు వాదనలు అనాధిగా ప్రజల మధ్య చర్చల్లో ఉన్నాయి. విశ్వ ఆవిర్భావం నక్షత్రాలు, గ్రహాలతో పాటు సమస్త జీవరాశి దైవ శక్తితో సృష్టించబడిందన్నది మొదటిది కాగా, విశ్వవిర్భావంతోపాటు సూర్యుడు, దాని చుట్టూ తిరిగే గ్రహాలు భూమి దాని పైన జీవం అంతా సహజసిద్ధంగా కొన్ని కోట్ల సంవత్సరాలలో క్రమక్రమంగా అభివృద్ధి చెందింది అనేది రెండవది. పురాతన కాలం నుంచి మానవుని ఆలోచనలన్నీ ఈ రెండు వాదనల చుట్టూ తిరుగుతున్నాయి. ప్రపంచంలో ఈ రెండు వాదనలు బలపరిచే వ్యక్తులున్నారు. ఎవరి వాదనలు వారు బలపరిచే ప్రయత్నాలు నిరంతరం చేస్తూనే వస్తున్నారు. మొదటి వాదన చేసే వారు మతవిశ్వాసాలను బలంగా నమ్మేవారు కాగా, రెండోవాదన చేసే వారు నిరూపించబడిన సత్యాల సాయంతో మతాలకతీతంగా ఆలోచించేవారని ప్రత్యేకంగా చెప్పనవసరంలేదు. మతాలు, మాయలు, శక్తులను నమ్మేవారు ఈ ఆవిర్భావం గురించి తెల్సుకోవడానికి, ఎక్కువగా ప్రయత్నించాల్సిన అవసరం లేదు. వీరు తమకు అర్థం కాని ప్రతి విషయం దైవ సృష్టిగా భావించే వెసులుబాటు ఉంది. కానీ, ప్రతీ విషయానికి గల అసలు కారణాలు తెల్సుకోవాలనుకునే వారు మాత్రం ఎక్కువ అధ్యయనం చేయాలి. ఎక్కువ ఆలోచించాలి. ప్రపంచం, దైవసృష్టి అని నమ్మేవారిలో తిరిగి రెండు రకాల వారుంటారు. వీరిలో అత్యధికులు ఈ ప్రపంచంలో ఏం జరిగినా వెంటనే దానిని దైవ శక్తితో ముడిపెడుతూ అసలు కారణ అన్వేషణకు దూరంగా ఉండటానికి ఇష్టపడుతూ ఉంటారు. రెండో రకం వారేమో అసాధారణ విషయాలు తారసపడినప్పుడు, వాటి కారణాలు తెలియనప్పుడు మాత్రం వాటిని అతీంద్రియ శక్తులతో అనుసంధానం చేస్తూ చిక్కుముడి పడి అంతు చిక్కని ప్రశ్నల నుంచి తప్పించుకుంటూ ఉపశమనం పొందుతారు. ఈ విశ్వం సహజసిద్ధంగా ఏర్పడింది తప్పా, మతాలు చెప్పినట్లుగా ఏ దైవశక్తి సృష్టి కాదని పరిణామ సిద్ధాంతం అవగాహన ఉన్నవారెవరైనా చెప్పారనుకోండి! మతవాదుల నుంచి వచ్చే మొదటి ప్రశ్న. మరి భూమి ఎలా ఏర్పడింది, భూమిపై తొలి మనిషి ఎలా పుట్టాడు? అని అడుగుతారు. ఈ విషయం వరకు వారి హేతుబద్ధతను ఒప్పుకోవచ్చు. ఆ తర్వాత చెప్పే భూమి అవతరణ గురించి, ఆ తర్వాత పరిస్థితుల ప్రభావం వలన ఏర్పడిన మూలకాల సంయోగం గురించి, వాటి నుండి ఏర్పడిన జీవ పదార్థం గురించి... తద్వారా ఏర్పడిన మొట్టమొదటి జీవి నీటి మొక్క, ఆ మొక్క నుండే వివిధ జాతుల మొక్కలు, నీటిలో జీవించే ఏకకణ జీవులు, బహుకణ జీవులు ఏర్పడ్డాయి. అనంతరం నీటి బయటికి వచ్చి కొద్దిసేపు బతికే జీవులు, వాటి నుండి పూర్తిగా నేలపై వాతావరణ పరిస్థితులను తట్టుకుని జీవించడానికి అనువైన శరీరం ఏర్పరచుకున్న జీవులు ఆవిర్భావించాయి. కాలక్రమేనా అవి వృక్ష, జంతు అనే ప్రధాన జాతులుగా వేరు పడి తమ శరీర అభివృద్ధిని మెరుగు పర్చుకున్నాయి. హిమ పరిస్థితులు, ఆహార అన్వేషణ ఈ రెండు కారణాల వలన జీవులు శారీరకంగా, మానసికంగా అభివృద్ధి చెందుతూ వచ్చాయి. ఇదే క్రమంలో తోక లేని వానరాల నుండి జీవి స్పష్టమైన దశలను దాటుతూ మానవునిగా పరిణామం చెందిందన్న విషయం ఎందరో శాస్త్రవేత్తలు తమ సుదీర్ఘ పరిశీలనల తర్వాత నిర్ధారించారన్న విషయం గుర్తుంచుకోవా లి. జీవి ఇలా మానవునిగా పరిణామం చెందిన తర్వాత కూడా, మార్పులు నిరంతరం జరుగుతూ వస్తూ అందవిహీన మానవుని నుండి అందమైన రూపు కల్గిన మానవునిగా మార్పు చెందాడు. ఇది భౌతికాభివృద్ధి. మానసికంగా కూడా ఎంతో వేగంగా అభివృద్ధిని సాధిస్తూ రాళ్ళను రాపిడి చేస్తే మంట పుడుతుందన్న విషయం గ్రహించడం నుండి మనిషితో, ప్రాణం లేని మర మనుషులను మాట్లాడించే స్థితిలోకి వచ్చాడు. ఈ సుదీర్ఘ ప్రయాణంలో మానవుడు తన మానసిక, ఆలోచన శక్తులను వినియోగించి సాధించిన విజయాలు ఎన్నో. అడవి జంతువులను వేగంగా వేటాడే క్రమంలో పదునైన ఆయుధాలు వినియోగించడం. అందమైన భవనాలు నిర్మించుకుని తనలో కళా సౌందర్యం ఉందని చాటి చెప్పడం, ప్రయాణ సౌలభ్యం కోసం చక్రం తయారు చేయడం, తద్వారా వాహనాలు తయారు చేయడం, దూర ప్రాంతాలలో ఉన్న విషయాలను ఇంట్లో ఉండి చూడటానికి దూరదర్శినిని కనుగొనడం, వివిధ ప్రాంతాల్లో ఉన్న తమ వారితో మాట్లాడానికి టెలిఫోను, అనంతరం దానిని మరింత ఆధునీకరిస్తూ చరవానులను కనుగొనడం, నెలల తరబడి ప్రయాణం చేసి చేరుకునే దేశాలను సైతం గంటల వ్యవధిలో చేర్చే, గాలిలో సునాయాసంగా ఎగిరే అద్భుత వాహనాల రూపకల్పన ఇలా చెప్పుకుంటూ పోతే అంతు చిక్కదు జాబితా.. ఇవన్నీ మనిషి ఎన్నో విఫల ప్రయత్నాల తర్వాత అందుకున్న అపూర్వ విజయాలు. కాని నేడు మనకు అవి సాధారణమైన విషయాలు. అవి మనుగడలోకి వచ్చిన కొత్తలో సాటి మనుషులు కూడా వాటిని చూసి ఆశ్చర్యపోయారు. ఇన్ని విషయాలలో మనిషి ఎంతో నేర్పును కనబర్చి మరింత ఉన్నతంగా సౌకర్యంగా జీవించడానికి బాటలు వేస్తుంటే మరోపక్క మనిషి సాధించిన ఈ విజయాలను అనుభవిస్తూనే కొందరు సమాజంలో అమాయకులను గందరగోళ పరచడానికి కులం పేరుతో, మతం పేరుతో కొందరిని పుట్టుకతో నీచులని, మరికొందరిని పుట్టుకతో ఉన్నతులని ఎవరికి వారు తమ మతం గొప్పది, మిగతా మతాలు అసత్యాలని పొసగని అంశాలను విరివిగా ప్రచారం చేస్తూ స్వచ్ఛమైన మనసులలో విద్వేషాలను నింపుతూ వైజ్ఞానికంగా వెనక్కి తీసుకెళ్తున్నారు. అందుకే నిరంతరం సమాజంలో ఏదో రకమైన ఘర్షణలు సృష్టించబడుతూ మనుషుల మధ్య సుహృద్భావ వాతావరణాన్ని దెబ్బతీస్తూ వస్తున్నాయి. ఇది సమాజాన్ని నిరంతరం వెంటాడుతున్న విషాదంగా పరిగణించాల్సిన అవసరం ఉంది. జీవం ఉద్భవించింది దైవసృష్టి వలన కాదు, నిర్జీవ పదార్థం నుండి అనగా మూలకాల యాదృచ్ఛిక సమ్మేళనం ద్వారా అసంకల్పితంగా ఏర్పడిందన్న విషయం అర్థం చేసుకున్నవారు ఆ సిద్ధాంతాన్ని సామాన్యులకు సులభంగా అర్థం అయ్యేటట్టు వివరించాలి. దాని ద్వారానే పుట్టుకతో వచ్చాయని చెప్పే ఈ అసమానతలు ప్రజల మనుసులనుండి మాయమవుతాయి. ఒక కులం తక్కువ, మరో కులం ఎక్కువ అనే భావనలు అంతమై అందరూ సమానమన్న సోదరభావం ఏర్పడి సమాజంలో నిత్యం కన్పించే కుల, మత ఘర్షణలు తగ్గుముఖం పడతాయి.

> **జీవం ఉద్భవించింది దైవసృష్టి వలన కాదు, నిర్జీవ పదార్థం నుండి అనగా మూలకాల యాదృచ్ఛిక సమ్మేళనం ద్వారా అసంకల్పితంగా ఏర్పడిందన్న విషయం అర్థం చేసుకున్నవారు ఆ సిద్ధాంతాన్ని సామాన్యులకు సులభంగా అర్థమయ్యేటట్టు వివరించాలి. దాని ద్వారానే పుట్టుకతో వచ్చాయని చెప్పే ఈ అసమానతలు ప్రజల మనుసులనుండి మాయమవుతాయి. ఒక కులం తక్కువ, మరో కులం ఎక్కువ అనే భావనలు అంతమై అందరూ సమానమన్న సోధరభావం ఏర్పడి సమాజంలో నిత్యం కన్పించే కుల, మత ఘర్షణలు తగ్గుముఖం పడతాయి.**

భూమి ఆవిర్భవించిన అనంతరం భూమిపైన జీవ పదార్థానికి మూలమైన పదార్థాలు ఉన్నాయని శాస్త్ర నిరూపణల ద్వారా నిరూపితమైన విషయాలను విడమరిచి చెప్పాలి. ఆలోచింపజేయాలి. జీవం ఏర్పడాలంటే అవసరమైన కార్బన్, హైడ్రోజన్, ఆక్సిజన్, నత్రజని లాంటి ముడి పదార్థాలు యాదృచ్ఛికంగా ఒకదానితో ఒకటి చర్య జరిగి నిర్జీవ పదార్థం నుండి జీవం పురుడు పోసుకున్నదన్న విషయాన్ని వివరించాలి. దాన్ని అర్థం చేసుకున్న వారు తమ జీవితంలో మహిమలకు, మాయలకు ప్రభావితం కాకుండా ప్రతీ సమస్యకు, దాని వెనుక గల కారణాన్ని అన్వేషించి, పరిష్కార మార్గాలు ఏర్పరచుకుని క్రమ పద్ధతిలో ప్రయత్నం చేసి సమస్య నుండి బయటపడగల్గుతారు. ఇలా సమాజం శాస్త్రీయంగా, ఘర్షణ రహితంగా, వాస్తవ అన్వేషణ దిశగా ప్రయత్నించడానికి ఆలోచనాపరులు తమ వంతు ప్రయత్నం చేయాలి. చదువుకున్నవారిలోని ఆలోచనాపరులు ఇలాంటి సహజసిద్ధమైన శాస్త్రీయ విషయాలను అందరికీ అర్థమయ్యే రీతిలో వివరిస్తే, ప్రజలు నమ్మకాలనే సుడిగుండాల నుండి బయటిపడి తమ కష్టాలకు గల కారణాలను అన్వేషించి తమంతట తాము స్వయంకృషితో వాటిని సాధించడానికి ప్రయత్నిస్తారు. విజయం సాధిస్తారు. అలాంటి వారి వలననే సమాజం, దేశం వేగంగా అభివృద్ధి చెందుతుంది. అలాంటి ఆలోచనాపరులు పెరగడమే సమాజం ముందున్న తక్షణ కర్తవ్యం.

సెల్ : 7893903740

ఓట్ల కొనుగోలుతో ప్రజాతంత్ర విలువలు బలి



శ్రీనివాస్ చిరిపోతుల

ధృతరాష్ట్ర కౌగిలిగా మారి ఎన్నికల పవిత్రతను అపహాస్యం చేస్తున్న ధన ప్రవాహాన్ని నియంత్రించడం కోసం అంటూ ఆయా పార్టీల ఎన్నికల ఖర్చులను ప్రభుత్వమే భరించాలని సూచనలు ఉన్నాయి. అయితే ఆ సూచనలు పెడచెవిన పెడుతున్నారు, మరోవైపు ఇప్పటికిప్పుడు అది సాధ్యం కాని పరిస్థితిని కూడా గమనించాలి. అవినీతి వలన, నేరగాళ్ల భారత ప్రజాస్వామ్యానికి సరికొత్త అర్థాన్ని తయారుచేసే స్థాయిలో విస్తరించిందన్న మాట నిజం. భారత ఎన్నికల సమగ్ర ప్రక్షాళన కోసం 2004లో 23 ప్రతిపాదనలను, 2016లో 48 సూచనలను ఎన్నికల కమిషన్‌కు సమర్పించినా అవన్నీ కార్యరూపం దాల్చలేదు. చట్టసభకు ఎన్నిక కాబడిన ప్రతి సభ్యుడూ తమ ఎన్నికల ఖర్చును తక్కువ చేసి చూపడంతోనే తమ అవినీతి ప్రస్థానం ఆరంభిస్తాడు. రాజకీయ నాయకుల గొంతులో పచ్చి వెలక్కాయలాంటి ఈ వాస్తవాన్ని ఎలాంటి సంశయం లేకుండా ఆనాడు భారతరత్న అటల్ బిహారీ వాజ్‌పేయి వెల్లడించారు. భారతదేశ ఎన్నికల చరిత్రలో అత్యంత ఖరీదైన ఎన్నికలుగా 2014లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో ఒక్కో అభ్యర్థి సరైన లెక్కలు చూపకుండా పెట్టిన ఖర్చు సగటుగా రూ.55 కోట్ల పైమాటే. 2014 లో జరిగిన శాసనసభ ఎన్నికల్లో ఒక్కో ప్రధాన పార్టీల నాయకుల ప్రచార ఖర్చు సగటున రూ.25కోట్ల పైమాటే అని చెప్పవచ్చు. ఈ లెక్కన ఐదేళ్లకోసారి జరిగే పంచాయతీ నుండి పార్లమెంటు దాకా అయ్యే వ్యయం 3,25,000 కోట్లు అని మాజీ ప్రధాన ఎన్నికల కమిషనరేటే లెక్కగట్టింది. సమాచార హక్కు చట్టం పరిధిలోకి తాము రామంటూ చెప్పుకునే పార్టీలు, పారదర్శకత, జవాబుదారీతనానికి నిలువు పాతరేస్తుంది. ఇది ఎన్నికల సంస్కరణలకు విరుద్ధం. 324 అధికరణ ప్రకారం చట్టసభల ఎన్నికలను స్వేచ్ఛగా, ఎలాంటి గొడవలకు తావులేకుండా జరపాలని సూచిస్తుంది. స్వేచ్ఛా నిబంధనలను రూపొందించుకునే అధికారం, సొంతంగా సచివాలయం, సీఈసీ మాదిరిగానే ఇతర కమిషన్లకూ ఉద్యోగ భద్రత వంటి వాటికోసం రెండు దశాబ్దాలుగా ప్రతిపాదనలకే పరిమితమయ్యాయి. ఎన్నికల్లో నల్లధన ప్రవాహాన్ని నియంత్రించాలని గత జూలైలో సుప్రీంకోర్టులో ప్రజాహిత వ్యాజ్యం దాఖలైంది. దానిని స్వీకరించిన సుప్రీం ఈసీని సంప్రదించాలని పిటిషనర్‌కు సూచించింది. ఎన్నికల సంఘం కండ్లకు గంతలు కట్టి, ఎలక్షన్లలో అక్రమాలు, నల్లధనాన్ని పంచుకోడానికి ఒక అస్త్రంలా ధనస్వామ్యంతో ఆటలాడుతున్నాయి. ఎన్నికలలో ఓటర్లను ప్రలోభాలకు గురి చేస్తూ, వారికి డబ్బు ఇవ్వడాన్ని నేరశిక్షా స్మృతి కింద నేరంగా పరిగణించాలన్నది చట్టసవరణ ప్రతిపాదనలోనే ఉంది. మన దేశంలో సగం రాష్ట్రాల మద్దతు ఉంటే ఆ బిల్లుకు ఒక రూపం వచ్చేది. కానీ, దానికి సగం రాష్ట్రాల మద్దతు లేనందున అది నేటికీ పట్టాలెక్కలేదు. ఎన్నికల వేళ ఓటర్లకు బీరు, బిర్యాణీలు, కానుకలు, నగదుతోపాటు మాదకద్రవ్యాలనూ అందించి ఓటర్లను ప్రలోభాలకు గురి చేసే విషసంస్కృతిని రూపుమాపాలి. ఆ దిశగా ఎన్నికల వ్యవస్థ ప్రక్షాళనను వెంటనే ప్రారంభించాలి.

సెల్: 9603471199


తెలంగాణ ముద్దుబిడ్డ సాంబశివ కన్నంవార్



సాసాల మల్లికార్జున్

కన్నంవార్ తెలంగాణలోని కరీంనగర్ జిల్లా నుండి ముంబై వలస వెళ్లిన కుటుంబంలో 10 జనవరి 1900 సంవత్సరంలో చాంద్ జిల్లా లో జన్మించారు. వీరు చిన్నతనంలో కటిక పేదరికం అనుభవించి ఉన్నత విద్యను చదవడానికి అనేక ఇబ్బందులు పడి ఉన్నత స్థానానికి వెళ్లారు. విద్యార్థిగా ఉన్నప్పుడే స్వాతంత్ర్యోద్యమంలో చురుకుగా పాల్గొనేవారు. క్విట్ ఇండియా (1942) ఉద్యమంలో పాల్గొని 1942నుండి 1945 సంవత్సరాల వరకు జైలు జీవితం గడిపారు. వీరు 1939 నుండి 1948 సంవత్సరం వరకు నాగపూర్ ప్రాంత కాంగ్రెస్ కమిటీకి కార్యదర్శిగా పనిచేశారు. విద్యా, పత్రికా రంగంలో ఉన్నత స్థాయికి చేరుకొని 1933వ సంవత్సరంలో బొంబాయిలో ఇప్పుడు గాంధీ విద్యాలయం అనబడే నవ భారత విద్యాలయాన్ని స్థాపించారు. లోక్ సేవక్, నవ సందేశ్, గ్రామ సేవక్, పంచాయతీ రాజ్ మొదలైన పత్రికలకు ఎడిటర్‌గా పనిచేశారు. ఆయన ఈ పత్రికల ద్వారా గాంధీ సిద్ధాంతాలను, జాతీయ భావాలను ప్రచారం చేసేవారు. మహాత్మాగాంధీ అడుగుజాడల్లో నడిచి వారిపై అభిమానంతో గాంధీ జీవిత చరిత్రపై మరాఠీ భాషలో రెండు పుస్తకాలు రాశారు. మరాఠీలో రాజమాత జిజియా బాయి అనే గ్రంథాన్ని రచించారు.

1952 సాధారణ ఎన్నికలలో చాంద్ జిల్లా ముల్ నియోజకవర్గం నుండి ఎన్నికై మధ్యప్రదేశ్ ప్రభుత్వంలో జైళ్లు, ఆరోగ్యశాఖ మంత్రిగా పనిచేశారు. 1956లో రాష్ట్రాల పునర్నిర్మాణ తర్వాత బొంబాయి మంత్రి మండలిలో ఆరోగ్య శాఖ మంత్రిగా పనిచేశారు. 1957లో ముంబై జిల్లా సవోలి నియోజకవర్గం నుండి ముంబై శాసనసభకు ఎన్నికై క్యాబినేట్ మంత్రిగా పని చేశారు. 1961లో మళ్ళీ శాసనసభకు ఎన్నికై 1962 నవంబర్ 20న దేశంలోనే పెద్ద రాష్ట్రాలలో ఒకటైన మహారాష్ట్ర రెండో ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలు స్వీకరించి 1963 నవంబర్ 24న పదవిలో ఉండగానే మరణించారు. కేవలం ఒక సంవత్సరం మాత్రమే ముఖ్యమంత్రిగా పని చేసినప్పటికీ మహారాష్ట్రలో సంభవించిన అత్యంత క్లిష్ట పరిస్థితులైన పురపాలక సమ్మె, బీఈఎన్‌టీ సిబ్బంది సమ్మె, టాక్సీ డ్రైవర్‌ల సమ్మెలను ఎదుర్కొని తన ధృడ సంకల్పాన్ని, రాజనీతిజ్ఞతను ప్రదర్శించి చాకచక్యంతో సమస్యలను పరిష్కరించి విమర్శకుల ప్రశంసలు సైతం పొందారు.



తమ లక్ష్యం ఉన్నతంగా ఉంటే ఏమైన సాధించవచ్చునని కన్నంవార్‌ని చూసి నేర్చుకోవచ్చు. ఒక సామాన్య మధ్యతరగతి రైతు కుటుంబం నుండి వచ్చి దేశంలోని అతిపెద్ద రాష్ట్రాలలో ఒకటైన మహారాష్ట్ర ముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వహించిన కన్నంవార్ జీవితం ఎంతోమందికి మార్గదర్శకం. తెలంగాణ ఉద్యమ సమయంలో వి.ప్రకాశ్ వంటి తెలంగాణ మేధావులు ఎన్నో వేదికల మీద ఆయన పేరుని ప్రస్తావించి తెలంగాణ ప్రజలు ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని చెప్పారు. మహారాష్ట్ర ప్రభుత్వం ఆయన సేవలను గుర్తించి ముంబైలోని ఒక అతిపెద్ద ప్రాంతానికి కన్నంవార్ నగర్ అని నామకరణం చేసింది. ఈ కన్నంవార్ నగర్ భారతదేశంలోనే కాక ఆసియాలోనే అతిపెద్ద కార్మికుల హౌసింగ్ కాలనీగా పరిగణించబడుతుంది.

సెల్ : 8328210190

ఓటు చైతన్యమే ప్రజాస్వామ్యానికి రక్షణ



వాసిలి సురేష్

భారతదేశం లాంటి అతి పెద్ద ప్రజాస్వామ్య దేశంలో ఎన్నికలు భారీ ఖర్చుతో కూడినవిగా తయారయ్యాయి. రాజకీయ పార్టీలు అభ్యర్థి ఎంపిక నుంచి ఓటరును పోలింగ్ కేంద్రానికి తీసుకొచ్చి ఓటు వేసే వరకు అన్నింటికీ డబ్బుతో ముడిపెడుతున్నారు. ప్రజాస్వామ్య దేశంలో ప్రజలే నిర్ణేతలు అయినప్పటికీ నాయకుల ఎంపికలో డబ్బు, కుల, మత, వర్గ రాజకీయాల ప్రభావం అధికంగా ఉంటోంది. మందుతో, డబ్బుతో, స్వల్ప కాలిక తాయిలాలతో ఓటర్లను ప్రలోభ పెట్టి ఓట్లు వేయిస్తున్నారు. ఎన్నికలలో కులం, మతం వంటి సున్నిత అంశాలను కూడా రెచ్చగొడుతున్నారు. ఈ తరుణంలో ఓటరు చైతన్యం కావాలి, ప్రజాస్వామ్య పరిరక్షణకు నాంది పలకాలి. ప్రపంచగతిని మార్చే శక్తి ఓటుకు ఉంది. వ్యక్తి అస్తిత్వాన్ని ఓటు గుర్తిస్తుంది. వ్యవస్థ మార్పునకు ఓటు నాంది పలుకుతుంది. ఎవరికి అధికారం ఇవ్వాలో ఓటర్లు నిర్ణయించేది ఓటు ఆయుధంతోనే. ప్రజాస్వామ్య వ్యవస్థ పరిరక్షణ ఓటు ద్వారానే. నేతల తలరాతనే కాదు, దేశ తలరాతను మార్చే సత్తా ఓటుకు మాత్రమే ఉంది. ఓటరులో చైతన్యం వస్తే ఓటు దేశ గమనాన్ని మార్చేస్తుంది. ఓటు హక్కును సమర్థంగా వినియోగించుకుంటే దేశాభివృద్ధి సాధ్యం కాగలదు.

ప్రజాస్వామ్య వ్యవస్థ పదిలంగా ఉండాలంటే 18ఏండ్లు దాటిన ప్రతిఒక్కరు తమ ఓటును నమోదు చేసుకోవాలి. తమ ఓటు హక్కును సక్రమంగా వినియోగించుకోవాలి. అయితే ఆ ఓటు విలువ ఎంత మందికి తెలుసు? కేంద్ర ప్రభుత్వం జనవరి 25ను జాతీయ ఓటర్ల దినోత్సవంగా ప్రకటించి ఓటు ఆవశ్యకత, ప్రజాస్వామ్య పరిరక్షణలో ఓటర్ల పాత్ర, యువ ఓటర్ల నమోదు, ఓటర్ల చైతన్యం వంటి కార్యక్రమాలు చేపడుతున్నది. భారత ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం నావంతు కర్తవ్యాన్ని గుర్తించి ఉన్నతమైన నాయకుడిని ఎన్నుకుంటానని ఓటర్ల చేత ప్రమాణం చేయిస్తోంది. నోటుకు, మందుకు, వ్యక్తిగత స్వార్థ ప్రయోజనాలకు ఓటరు అమ్ముడుపోయి నేరస్తులను, అసమర్థులను ఎన్నుకుంటుంటే ఓటర్లలో కల్పించిన చైతన్యం ఏమైనట్టు? ఉన్నత విలువలతో కూడిన ప్రజాస్వామ్యాన్ని కాపాడాల్సిన నేతలే నేరస్తులై నేరమయ భారతం నిర్మితమవుతుంటే దాన్ని మార్చగల సత్తా ఓటరు చేతిలోనే ఉంది. ప్రభుత్వం, నాయకుల చేతిలో ఎంతమాత్రం లేదు.

ఎన్నికల ప్రక్రియ విజయవంతంగా కొనసాగించడంలో పౌర సమాజం పాత్ర కీలకమైనది, వయోజనుడైన ప్రతి పౌరుడు తన ఓటు హక్కును నిష్పాక్షికంగా, నిర్భయంగా వినియోగించుకోవడం ఎంత అవసరమో, ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికలు సజావుగా జరిగేందుకు సహకరించడం కూడా అంతే అవసరం. ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయాలంటే ప్రతి పౌరుడు తన బాధ్యతను గుర్తించాలి. 326 ప్రకారం భారత రాజ్యాంగం ఓటు హక్కు కల్పించింది. 18 ఏండ్లు దాటిన వారంతా భారత లోక్‌సభకు, రాష్ట్ర శాసనసభతో పాటు దాదాపు అన్ని చోట్ల జరిగే ఎన్నికలలో తమ ఓటు హక్కును వినియోగించుకోవచ్చు. భారత రాజ్యాంగం జాతి, మత, కుల, లింగ వంటి ప్రాతిపదికతో నిమిత్తం లేకుండా ఓటు హక్కు కల్పించింది. ఓటు వేయడానికి హక్కు అంటే తనకు నచ్చిన అభ్యర్థిని ఎన్నికలలో గెలిపించడానికి ఓటు వేయడం అంటే భారతదేశంలో రాజ్యాంగం ప్రకారం ఏర్పాటయ్యే ప్రభుత్వ వ్యవస్థ ఏ విధంగా ఉండాలో నిర్ణయించుకునే అధికారం ప్రతి పౌరుడికి ఓటు హక్కు ద్వారా సంక్రమించింది. ఓటరు నిర్భయంగా, ప్రశాంతంగా, ఏకాంతంగా ఓటు హక్కును వినియోగించుకోవచ్చు. 1951 ప్రజా ప్రాతినిధ్య చట్టం, భారతీయ శిక్షా స్మృతిలలో ఎన్నో చట్టాలు రూపొందించడంతోపాటు ఎన్నికల ప్రక్రియను నీతివంతంగా అత్యంత పారదర్శకంగా జరగడానికి చాలా నియమాలు, సూత్రాలు పొందుపరచబడ్డాయి. ఎన్నికలు సజావుగా, శాంతియుతంగా జరగకుండా అడ్డుపడే శక్తులను కఠినంగా శిక్షించడానికి కట్టుదిట్టమైన చట్టాలు ఏర్పరచబడ్డాయి. ప్రజలు ప్రభుత్వానికి సహకరించి ఎన్నికలు సజావుగా జరిపించుకునే బాధ్యత ప్రజల మీద ఉంది. ప్రజాస్వామ్య వ్యవస్థలో అత్యంత శక్తివంతమైన ఆయుధం ఓటు మాత్రమేనని అందరూ గుర్తించాలి. ఓటరు తాను ఎన్నుకొనే ఎన్నికల అభ్యర్థి గుణగణాలను, పూర్వ చరిత్రను పరిగణనలోకి తీసుకొని ఓటు వేయాలి. ఎటువంటి ప్రలోభాలకు ప్రభావితం కాకుండా ఓటర్లు చైతన్యంతో వ్యవహరించాలి. అప్పుడే ప్రజాస్వామ్యం పరిరక్షించబడుతుంది.

సెల్ : 9494615360

లాంగ్వేజ్ పండిట్లకు ప్రమోషన్లు నిల్



రావుల లావణ్య

దేశ భాషలందు తెలుగు లెస్స, తెలుగు భాష తియ్యనైనది, కమ్మనైనది, అమృత భాష తెలంగాణ చరిత్ర, సంస్కృతి, భాషా బోధన చేసే వారికి 30ఏండ్లుగా అడుగడుగునా అన్యాయం జరుగుతుంది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో మండల పరిషత్, జిల్లా పరిషత్, ప్రాథమికోన్నత పాఠశాలల్లో పనిచేస్తున్న లాంగ్వేజ్ పండిట్లకు తీవ్రమైన అన్యాయం జరుగుతుంది. భాష పండితులు తెలుగు, హిందీ, ఉర్దూ భాషా బోధకులుగా ఉండి వివిధ భాషల వికాసానికి కృషిచేస్తున్నారు. ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో భాషా పండిట్లకు శిక్షణ పొందిన అర్హతను నిర్ణయించి, సెకండరీ గ్రేడ్ టీచర్ల వేతన స్కేలును ఇస్తూ, స్కూల్ అసిస్టెంట్లలో సమానమైన పనిని లాంగ్వేజ్ పండిట్లతో చేయించుకుంటున్నారు. సెకండరీ గ్రేడ్ టీచర్లకు స్కూలు అసిస్టెంట్ల ప్రమోషన్ ఇచ్చినట్టు లాంగ్వేజి పండిట్లకు 1985న పదోన్నతులు ఇవ్వటం మరిచిపోయారు. స్కూల్ అసిస్టెంట్లు, గణితం, సైన్సు, సోషల్, ఆంగ్లం, స్కూల్ అసిస్టెంట్, లాంగ్వేజస్ అనే కొత్త పోస్టులను ప్రాథమికోన్నత పాఠశాలల్లో అప్‌గ్రేడ్ చేయాలి. కొత్తగా సృష్టించాలి. స్కూల్ అసిస్టెంట్లు (భాషలు) నియామకాలు, ప్రమోషన్లలో డిగ్రీ స్థాయిలో సంబంధిత సబ్జెక్టు తప్పనిసరిగా చదివిన వారికే ప్రమోషన్లు ఇచ్చే విధంగా జీవోలు 11,12లకు తగిన సవరణ చేయాలి.

గణితం, సైన్సు వంటి ఐచ్ఛిక సబ్జెక్టుల వారికి ఒక న్యాయం తెలుగు, హిందీ, ఉర్దూ వంటి భాషలు బోధించే వారికి మరొక న్యాయమా?అర్హతలు ఉన్న ఉద్యోగికి పదోన్నతి హక్కు అని సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు అమలు కావటం లేదు. భారత రాజ్యాంగం ప్రకారం “సమాన పనికి సమాన వేతనం” ఇవ్వాలనే సూత్రాన్ని దశాద్దాలుగా అమలు పర్చటం లేదు. టీచర్ సర్వీస్ రూల్స్ తప్పులతడకగా ఉండటం, ఏకీకృత సర్వీస్ రూల్స్ కోసం కృషి చేస్తామని ‘వాక్’ దానాలు చేసిన వారు పత్తా లేకుండా పోయారు. ఐచ్ఛిక సబ్జెక్టుల్లో సెకండరీ గ్రేడ్ టీచర్లు, స్కూల్ అసిస్టెంట్లు, ప్యానల్‌గ్రేడ్ ప్రధానోపాధ్యాయులుగా ప్రమోషన్లు పొందుతున్నారు. ఆర్థికంగా, సామాజిక లబ్ధి పొందుతున్నారు. గత 30 ఏండ్లుగా తెలుగు పండితులుగా పనిచేస్తున్న వారికి ప్రమోషన్ లేకుండానే పదవి విరమణ పొందుతున్నారు. వేతనంలో నష్టం, పింఛన్ పొందటంలో నష్టాన్ని చవిచూస్తున్నారు. 2001 నుంచి సుమారు రూ.75 వేల సెకండరీ గ్రేడ్ టీచర్ పోస్టులను స్కూల్ అసిస్టెంట్ పోస్టులుగా స్థాయి పెంచిన పాలకులు ఒక్క లాంగ్వేజి పండిట్ పోస్టును కూడా లాంగ్వేజీ స్కూలు అసిస్టెంట్ పోస్టుగా మార్చకపోవటం తెలుగు భాషలతో సహా ఇతర లాంగ్వేజీల మీద పాలకులకు ఉన్న చిన్న చూపుకు నిదర్శనం.

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో ఉన్నత పాఠశాలలు, ప్రాథమికోన్నత పాఠశాలల్లో ఐచ్ఛిక స్కూలు అసిస్టెంట్లు ఉండగా 8,9,10 తరగతులకు స్కూలు అసిస్టెంట్స్ (లాంగ్వేజీలలో) బోధించటం లేదు. తెలంగాణలో అక్షరాస్యతను పెంచవల్సి ఉంది. జీవో నెంబర్ 11, 12లను వెంటనే సవరించి ప్రమోషన్లు కల్పించాలి. ప్రాథమికోన్నత, హైస్కూళ్లలో భాషా పండిట్ పోస్టులను స్కూలు అసిస్టెంట్లుగా ఆ పోస్టుల స్థాయి పెంచాలి. ప్రాథమిక పాఠశాలల్లో కూడా భాషా పండిట్లను మంజూరు చేయాలి. పండితులకు కూడా ఎల్ఎఫ్ఎల్ ప్రధానోపాధ్యాయులుగా పదోన్నతి కల్పించాలి. ఎంఏ తెలుగు చదివిన సీఎం కేసీఆర్ స్పందించి, వెంటనే పండితులకు ప్రమోషన్లు ఇప్పించాలి.

సెల్ : 9848811424

నిరుద్యోగ శాపానికి కారకులెవరు?



డా.పోలం సైదులు

నూతనంగా ఆవిర్భవించిన తెలంగాణ రాష్ట్రంలో, గత శతాబ్ద కాలం నుండి ఉద్యోగ అర్హత సాధించిన అభ్యర్థులను, ప్రభుత్వం కల్పించిన ఉద్యోగావకాశాలను పరిశీలిస్తే తెలుస్తుంది నిరుద్యోగులెందరో. రాష్ట్రంలో కనీసం పది శాతం కూడా ఉద్యోగాలివ్వని పరిస్థితి నెలకొందంటే దీనికి కారణం ఎవరు?

ఉమ్మడి రాష్ట్రంలో ప్రత్యేక తెలంగాణ మలి ఉద్యమం జరుగుతున్న సమయంలో యావత్తు తెలంగాణ లోకం, ఏకమై సబ్బండ వర్గాలవారిని ఏకంచేసి, పోరాడి తెలంగాణ తెచ్చుకుంటే, మన పిల్లలకు కొలువులొస్తాయి, పొలాలకు నీళ్లు వస్తాయి, అభివృద్ధి చేసుకోవడానికి ఆర్థిక వనరులుంటాయనే సందేశాన్ని యావత్తు తెలంగాణకు చేరవేయడంలో సఫలీకృతమైంది. అందులో భాగాంగాన్నే విద్యార్థి లోకం కొన్నిరోజులు, చదువును పక్కకు పెట్టి, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటే ప్రధాన లక్ష్యంగా పోరాడుతూ, వివిధ ప్రచార సాధనాల ద్వారా మారుమూల గ్రామాల ప్రజలను, యావత్తు తెలంగాణను చైతన్యపరిచి, సంఘటితం చేయడంలో ప్రధాన భూమిక పోషించిందనడంలో ఎలాంటి అతిశయోక్తిలేదు.

ఒకానొక దశలో తెలంగాణ ఉద్యమం నీరుగారిపోతుందన్న సమయంలో విద్యార్థి లోకం ఉద్యమాన్ని తమ చేతుల్లోకి తీసుకుని ముందుకు నడుపుతూ ఉద్యమ లక్ష్యాన్ని తెలియజేసేందుకు 1300కి పైగా నిరుద్యోగ, విద్యార్థి, యువత ఆత్మబలిదానాలు చేసుకుంది. వారే ప్రత్యేక రాష్ట్ర ఆవిర్భావానికి కారకులయ్యారనే విషయం అందరికి తెలుసు.

ఎన్నో ఆశలతో, ఆశయాలతో ఏర్పర్చుకున్న ప్రత్యేక రాష్ట్రంలో తమ జాతకాలు మారుతాయని నిరుద్యోగులు, యువకులు కలలుగన్నారు. కానీ అవి కళలుగానే మిగిలిపోయాయనడంలో ఎలాంటి సందేహం అక్కర్లేదు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడ్డాక ఉద్యమంలో కీలకపాత్ర వహించిన టీఆర్ఎస్ నీళ్లు, నిధులు, నియామకాలనే క్యాప్షన్ తీసుకొని 2014 ఎలక్షన్‌లో ప్రజల్లోకి వెళ్లింది. అందరు అనుకున్నట్టుగానే ఆ పార్టీకే పట్టం కట్టారు. కానీ ఈ నాలుగున్నరేండ్ల కాలంలో నిరుద్యోగులకు జరిగిన మేలును ఎవరన్నా చెప్పగలరా ? దాదాపు పది లక్షలకు పైగా నిరుద్యోగిత ఉద్యోగ ప్రకటనలకు ఎదురుచూస్తే అందులో పది శాతం కూడా నియామకాలు ఇవ్వలేని పరిస్థితికి కారకులెవరు? ప్రభుత్వం ఉద్యోగ ప్రకటనలు ఎందుకు కోర్టులోకి వెళ్తున్నాయి? అంటే ఇది ప్రతిపక్షం చేయించిందా? లేదా ప్రభుత్వమే కావాలని నాటకమాడిందా? లేదా నిజంగానే లోపాలను గుర్తించి నిరుద్యోగులు కోర్టు మెట్లెక్కారా? ఒకవేళ లోపాలుంటే ఎన్నడూ, ఏ ప్రభుత్వంలో జరగని, ఈ విధానం ఇక్కడే జరిగిందంటే కారకులెవరు? తెలియాల్సిన అవసరం లేదా?

2008-14 మధ్యకాలంలో ఎక్కువగా 20-35 సంవత్సరాలలోపు యువత ఉద్యమంలో పాల్గొన్నది. రాష్ట్రం ఏర్పడ్డాక తమ బతుకులు బాగుపడతాయని తలచి, ఉద్యోగ ప్రకటనలకు వేచి చూస్తూ నగరాలలో శిక్షణ కేంద్రాలలో వుంటూ వేలకువేలు ఖర్చు పెడుతూ, చదువుతూ, ప్రకటనలకై ఎదురుచూస్తే, అరకొర ప్రకటనలకే ప్రభుత్వం పరిమితమై, అందులో కొన్ని ఇంకా కోర్టు పరిధిలోనే వున్నాయంటే, ఈ రాష్ట్రంలో నిరుద్యోగ సమస్యల గురించి మాట్లాడేదెవరు? గడిచిన దశాబ్ద కాలంలో ఐదు శాతం నిరుద్యోగులకు నియామకాలు వచ్చాయనుకుంటే, మిగతా వారి వయస్సు నేడు 30-45 సంవత్సరాలలో ఉంటుంది. వీరు ఉద్యోగాల్లేక, ఉన్నదమ్ముకొని, ఉన్నత చదువులు చదివి, అప్పులపాలై, పిల్లనిచ్చేటోడు లేక కొంతమంది, పెండ్లైనవారు కుటుంబాన్ని పోషించలేక మరికొంతమంది మన ప్రభుత్వం పెంచిన పది సంవత్సరాల వయోపరిమితి కారణంగా ఇంకా శిక్షణ కేంద్రాలలో వుంటూ శిక్షణ పొందుతూ, ఉద్యోగ ప్రకటనల కోసం ఎదురుచూస్తున్నారు. ఇదిలా ఉంటే గత దశాబ్ద కాలంలో ఇంకెంతమంది తమ విద్యను పూర్తిచేసి నిరుద్యోగ సంఖ్యను ఎంతవరకు పెంచారో ఎవరైనా ఆలోచిస్తున్నారా? ఏదైనా చిన్న ప్రకటన వస్తే పదిలక్షల మందికిపైగా అప్లై చేసుకుంటున్నారు. అన్ని రకాల విద్యార్హతలను బట్టిచూస్తే మన రాష్ట్రంలో 20 లక్షలకు పైగా నిరుద్యోగులు ఉంటే వారి గురించి మాట్లాడే నాయకులేరి?

ఇప్పుడు ఎన్నికల సమయంలో అన్ని రాజకీయపార్టీలు తమ మ్యానిఫెస్టోలు తయారుచేసి ఎన్నికలలో తమ ప్రచార ఆర్భాటాలను ముమ్మరం చేసుకున్నారు. కానీ కొన్ని పార్టీలు నిరుద్యోగులను మరిచాయి, మరికొన్ని పార్టీలు లక్ష ఉద్యోగాలు కల్పిస్తామని చెబుతాయి, ఇంకొన్ని పార్టీలు మూడువేలు నిరుద్యోగ భృతి అంటూ వారిని ఎంత హీనస్థాయిలో చూస్తున్నారో అవగతమవుతుంది. ప్రత్యేక తెలంగాణ కోసం ముందుకొచ్చినందుకు వారి జీవితాలకు ఎలాంటి భరోసానివ్వకపోవడం అభివృద్ధికి సూచికనా? దీని గురించి కనీసం మేధావులన్నా పెదవి విరిచి, లోకానికి చాటిచెప్పాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది.

రాష్ట్రంలో ఎన్ని రాజకీయ పార్టీలున్నా, ఇప్పటికైనా నిరుద్యోగ నిర్మూలనకై, వారి బతుకులకు భరోసానిచ్చే కార్యక్రమాలు చేపడితే బాగుటుంది. ఈ విషయంలో అన్ని వర్గాలకు చెందిన మేధావి వర్గం ఆలోచించి మేలుచేయాల్సిన అవసరం ఉన్నది. కేవలం నిరుద్యోగ నిర్మూలనే కాకుండా రాష్ట్ర అభివృద్ధికి అన్ని రంగాల అభివృద్ధికి పూనుకొని స్వార్థరహిత పాలన అందించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉన్నది. ముఖ్యంగా గత దశాబ్ద కాలంగా జీవితంతో పోరాటం చేస్తున్న నిరుద్యోగులను ఆదుకోవాల్సిన ఆవశ్యకత రెండోసారి రాష్ట్రంలోఅధికారం చేపట్టిన టీఆర్ఎస్ పార్టీపై, ఆ పార్టీఅధినేత, రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్‌పై ఉన్నది. త్వరలో నిరుద్యోగులు ఆకాంక్షించే నిర్ణయాలు ఈ ప్రభుత్వం తీసుకుంటుందని ఆశిద్దాం.

సెల్ : 9441930361

రచయితలకు సూచనలు

ఇక్కడ వ్యక్తమయ్యే అభిప్రాయాలు వ్యాసకర్తల వ్యక్తిగతం. 4000 క్యారెక్టర్ల లోపు ఉన్న వ్యాసాలకు ప్రాధాన్యత ఉంటుంది. ప్రజాసమస్యలపై రాసిన వ్యాసాలకు ప్రాధాన్యత ఉంటుంది. వ్యాస రచయితలు వారి ఫొటో, సెల్‌నెంబర్ ఇవ్వాలి. ప్రత్యేక సందర్భానికి సంబంధించిన వ్యాసమైతే దానిని గురించి కవరింగ్ లెటర్ రాయండి. వ్యాసం మొదటి పేజీ మీద పంపిస్తున్న తేదీ వేయండి.

వ్యాస రచయితలు తమ వ్యాసంతోపాటు పూర్తి పోస్టల్ చిరునామా కూడా పంపించాలని కోరుతున్నాం. ఇప్పటికే వ్యాసాలు పంపినవారు కూడా తమ అడ్రస్‌లు పోస్టల్ ద్వారా గానీ, మెయిల్ ద్వారా గానీ పంపించాలని మనవి.

\- ఎడిటర్

మీ రచనలు పంపవలసిన చిరునామా :

email: vedika@ navatelangana.com Postal Addres: M.H.Bhavan,plot No,21/1, Azamabad, Near RTC Kalayana mandapam,Hyderabad500020.
Ph:27665420,27673787,9490099077/78.
Fax:040-27652228

एन एम डी सी
NMDC

NMDC Limited

(A Government of India Enterprise)
CIN: L13100AP1958GOI001674
Registered Office: Khanij Bhavan, 10-3-311/A, Castle Hills, Masab Tank, Hyderabad-500028
Tel.: +91 40 23538757, Fax: +91 40 23538759| E-mail: cs@nmdc.co.in | Website: www.nmdc.com

PUBLIC ANNOUNCEMENT FOR THE ATTENTION OF EQUITY SHAREHOLDERS/ BENEFICIAL OWNERS OF EQUITY SHARES OF NMDC LIMITED FOR BUYBACK OF EQUITY SHARES THROUGH TENDER OFFER

This Public Announcement (the **"Public Announcement"**) is being made pursuant to the provisions of Regulation 7(i) of the Securities and Exchange Board of India (Buy-Back of Securities) Regulations, 2018 (the **"Buyback Regulations"**) for the time being in force including any statutory modifications and amendments from time to time and contains the disclosures as specified in Schedule II to the Buyback Regulations.

CASH OFFER FOR BUYBACK OF NOT EXCEEDING 10,20,40,815 (TEN CRORE TWENTY LAKH FORTY THOUSAND EIGHT HUNDRED FIFTEEN) FULLY PAID UP EQUITY SHARES OF FACE VALUE OF Re. 1 EACH AT A PRICE OF Rs.98/- (RUPEES NINETY EIGHT ONLY) PER FULLY PAID UP EQUITY SHARE ON PROPORTIONATE BASIS THROUGH THE TENDER OFFER PROCESS

1. DETAILS OF THE BUYBACK OFFER AND OFFER PRICE

1.1 The Board of Directors (the **"Board"**) of NMDC Limited (**"NMDC" / "Company"**) passed a resolution on January 8, 2019 (**"Board Meeting"**) to approve the proposal of buyback of fully paid-up equity shares of face value of Re.1/- each (**"Shares"** or **"Equity Shares"**) of the Company not exceeding 10,20,40,815 (Ten Crore Twenty Lakh Forty Thousand Eight Hundred Fifteen)Equity Shares from the equity shareholders/beneficial owners of Equity Shares of the Company as on Record Date (hereinafter defined) (the **"Eligible Shareholders"**), on a proportionate basis, through tender offer route (the **"Buyback" / "Buyback Offer"**)at a price of Rs.98/- (Rupees Ninety Eight only)per Equity Share (**"Buyback Price" / "Buyback Offer Price"**) payable in cash, for an aggregate maximum consideration not exceeding Rs.1,000 Crore (Rupees One Thousand Crore)excluding the transaction costs viz. brokerage, applicable taxes such as securities transaction tax, GST, stamp duty, etc. (the **"Buyback Offer Size"**). The Buyback is subject to receipt of any approvals, permissions and sanctions of statutory, regulatory or governmental authorities as may be required under applicable laws including but not limited to Securities and Exchange Board of India (**"SEBI"**), the BSE Limited (the **"BSE"**), National Stock Exchange of India Limited ("NSE") and Calcutta Stock Exchange Limited (the **"CSE"**), where the Equity Shares of the Company are listed. BSE and NSE together referred as **"Stock Exchanges"**.

రాఘవ లారెన్స్ హీరోగా నటిస్తూ దర్శకత్వం వహించిన చిత్రం 'కాంచన 3'. 'ముని' ఫ్రాంచైజీలో భాగంగా వస్తున్న నాల్గవ చిత్రమిది. ఈసినిమాని తెలుగులో లైట్ హౌస్ మూవీ మేకర్స్ ఎల్ఎల్పీ పతాకంపై బి.మధు సమర్పణలో రాఘవేంద్ర ప్రొడక్షన్స్ పతాకంపై రాఘవ నిర్మాణంలో తెరకెక్కుతుంది. ఈ చిత్ర ఫస్ట్‌లుక్ విడుదల కార్యక్రమం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా సమర్పకులు బి.మధు మాట్లాడుతూ, 'రాఘవ లారెన్స్ స్వయంగా రూపొందించిన హర్రర్ సినిమాలన్నీ సూపర్ హిట్టే. అందులో 'ముని' సీక్వెల్ మరీ స్పెషల్. 'కాంచన' పేరుతో ప్రారంభమైన తర్వాత ఇప్పుడు 'కాంచన 3'గా ప్రేక్షకుల ముందుకు వస్తోంది. రాఘవ లారెన్స్‌కి ఈ చిత్రం చాలా ప్రత్యేకం. ఆయన ప్రతి చిత్రంలో తన గెటప్‌ని సామాన్య ప్రేక్షకుడికి దగ్గరగా ఉండేలా చూసుకున్నారు. ఇప్పుడు ఈ సినిమాలో వైట్ హెయిర్‌తో న్యూ స్టయిల్‌కి నాంది పలికారు. ఈ చిత్ర తెలుగు మోషన్ పోస్టర్‌ని విడుదల చేయడం ఆనందంగా ఉంది. ఒక శ్లోకంతో స్టార్ట్ అయి స్లమ్ ఏరియాని చూపిస్తూ క్లాత్ నుంచి యాక్షన్ సీన్ రావడం, అక్కడ్నుంచి రుద్రాక్షలు ధరించి, తెల్లటి పంచెకట్టుకుని, వైట్ హెయిర్ స్టయిల్‌తో దర్జాగా కూర్చొని ఉన్న రాఘవ పోస్టర్‌ని మొదటిసారిగా డాల్బీ ఆట్మాస్ సౌండ్‌తో విడుదల చేశాం. దీనికి మంచి స్పందన లభిస్తుంది. తెలుగు, తమిళం భాషల్లో సినిమా షూటింగ్ దాదాపు పూర్తి కావచ్చింది. ఏప్రిల్ 18న సమ్మర్ స్పెషల్‌గా ప్రపంచ వ్యాప్తంగా విడుదల చేయనున్నాం. గత చిత్రాల మాదిరిగానే ఇది కూడా ఆడియెన్స్‌ని ఆకట్టుకుంటుందని నమ్ముతున్నాం' అని అన్నారు.

మరో క్రేజీ ప్రాజెక్ట్...

గతేడాది 'రైడ్' సినిమాతో బాలీవుడ్‌లో మంచి విజయాన్ని అందుకుంది ఇలియానా. కానీ చాలా గ్యాప్ తర్వాత తెలుగులో నటించిన 'అమర్ అక్బర్ ఆంటోని' మాత్రం నిరాశ పరిచింది. తాజాగా ఇలియానాని ఓ క్రేజీ ప్రాజెక్ట్ వరించింది. అనీస్ బజ్మీ దర్శకత్వంలో రూపొందుతున్న 'పగల్‌పంటి' చిత్రంలో నటించే అవకాశాన్ని అందుకుంది. అనిల్ కపూర్, జాన్ అబ్రహం, అర్షద్ వార్సి, కృతి కర్బంద ఇతర ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. కామెడీ ప్రధానంగా సాగే ఈ చిత్రం ఫిబ్రవరిలో ముంబయిలో ప్రారంభం కానుంది. ఆ తర్వాత 60 రోజుల షెడ్యూల్‌ని లండన్‌లో నిర్వహించనున్నారు. ఇందులో జాన్ అబ్రహంతో ఇలియానా జోడీ కట్టనున్నారట. కృతి కర్బంద, పుల్కిత్ సామ్రాట్ మరో జంటగా నటించనున్నట్టు తెలుస్తుంది. ఈ ఏడాది ద్వితీయార్థంలో సినిమాని విడుదల చేయడానికి ప్లాన్ చేస్తున్నారు. ఇందులో ఇలియానా పాత్ర చాలా కీలకంగా ఉంటుందని సమాచారం. తన పాత్ర కోసం ప్రస్తుతం ఇలియానా ప్రిపేర్ అవుతుంది.


ఇలియానా

నాకేం కావాలో ప్రకృతికి తెలుసు

'అమీర్ ఖాన్ తరహాలో ఎందుకు చేయలేకపోతున్నాను. 'బాహుబలి' లాంటి సినిమాలు మనకెందుకు రాలేదని అందరికీ ఉంటుంది. అలాగని ఇలాంటి పాత్రలు అందరికి రావు. వాటిని చూసి వదిలేయాల్సిందే. వాటి గురించి ఎక్కువగా ఆలోచించకూడదు' అని అంటున్నారు వెంకటేష్. విభిన్న కథా నేపథ్య చిత్రాలతో ఆకట్టుకుంటున్నారు వెంకటేష్. ఇటీవల కథా ప్రధాన చిత్రాలకు ప్రయారిటీ ఇస్తున్నారు. కొంత గ్యాప్‌తో ప్రస్తుతం 'ఎఫ్2'లో నటించారు. వరుణ్ తేజ్ మరో హీరోగా నటించిన ఈ చిత్రానికి అనిల్ రావిపూడి దర్శకుడు. ఈ నెల 12న సంక్రాంతి కానుకగా సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా వెంకటేష్ బుధవారం మీడియాతో ముచ్చటించారు. ఆ విశేషాల సమాహారం ఆయన మాటల్లోనే ...


వెంకటేష్

ఆడవాళ్ళ గొప్పతనాన్ని గుర్తించాలి..

'గురు' సినిమా తర్వాత గ్యాప్‌తో చేస్తున్న చిత్రమిది. ఆ సినిమా తర్వాత చాలా కథలు విన్నా. ఏదీ సెట్ కాలేదు. ఈ స్క్రిప్ట్ నాకు బాగా నచ్చింది. ఇందులో నేను, వరుణ్ తోడళ్ళుళ్ళుగా నటించాం. పెళ్ళికి ముందు, పెళ్ళి తర్వాత వచ్చే సన్నివేశాలు ఫన్నీగా ఉంటాయి. మనం పెళ్ళి గురించి, భార్యల గురించి ఎంత సరదాగా మాట్లాడుకున్నప్పటికీ, ఆడవాళ్ళు లేనిదే సృష్టిలేదు. ఆడవాళ్ళ గొప్పతనాన్ని మనం గుర్తించాలని చెప్పే చిత్రమిది. దాదాపు ఐదేండ్ల తర్వాత సంక్రాంతికి నా సినిమా విడుదలవుతుందంటే హ్యాపీగా ఉంది. ఇది పక్కా ఫ్యామిలీ సినిమా. సినిమాలు బాగుంటే ఫ్యామిలీలు థియేటర్‌కి రావడాన్ని చూస్తున్నాం. ఇప్పుడు కూడా వస్తారు.

మనం కూడా నేర్చుకోవచ్చు..

దర్శకుడు అనిల్ మంచి కుర్రాడు. తను స్వయంగా రైటర్ కావడంతో మధ్యలో ఏదైనా పంచ్ కావాలనిపిస్తే వెంటనే సెట్‌లోనే రాసుకునేవాడు. ఈ చిత్రంలో నా పాత్రని తీర్చిదిద్దిన తీరు చూస్తుంటే నా గత చిత్రాలన్నింటిని స్టడీ చేసినట్టు అనిపించింది. వరుణ్ మంచి నటుడు. చాలా తక్కువ టైమ్‌లోనే మాలో కలిసిపోయాడు. ఇమేజ్ చట్రంలో ఇరుక్కోకుండా తనదైన శైలిలో ముందుకు సాగుతున్నాడు. ఇందులో తెలంగాణ యాసలో మాట్లాడతాడు. తనకీ, మెహరీన్‌కి మధ్య సన్నివేశాలు బాగుంటాయి. యువకులతో కలిసి పనిచేయడంలో ఓ రకమైన ఆనందం ఉంటుంది. వారి నుంచి మనం నేర్చుకోవచ్చు. మన నుంచి వాళ్ళూ నేర్చుకుంటారు.

ఎప్పుడూ ఆవేశ పడను..

ఇమేజ్‌ని నేనెప్పుడూ పట్టించుకోలేదు. అది నా చేతుల్లో ఉండే విషయం కాదు. నా సినిమాతో ప్రేక్షకులకు వినోదం అందుతుందా? లేదా అనేది మాత్రమే ఆలోచిస్తా. యువతరం హీరోలు, దర్శకుల్లో ఉత్సాహం నన్ను బాగా ఆకట్టుకుంటోంది. ఓ సినిమా మల్టీస్టారర్, మరో సినిమా సోలో అనే విషయాన్ని నేను పట్టించుకోను. 30ఏండ్ల కెరీర్ తర్వాత కూడా ఇంకా లెక్కలేసుకుంటే ఏం బాగుంటుంది. సినిమా బాగుందా? లేదా. నిర్మాతలకి లాభం వస్తుందా? లేదా అనే ఆలోచిస్తాను. నా వద్దకి వచ్చిన మంచి కథల్ని ఎంపిక చేసుకుంటున్నా. వ్యక్తిగతంగా నేను ఎప్పుడూ ఆవేశ పడను. ప్రకృతిని బాగా ఇష్టపడతా. ప్రతి రోజుని ఆస్వాధిస్తా. రోజూ సూర్యోదయాన్ని, ప్రకృతి మధ్య కూర్చొని ఆ శబ్దాల్ని గ్రహిస్తుంటా. అవే నాపై ప్రభావం చూపిస్తుంటాయి.

'రోజా' చేయలేకపోయా..

నేనెప్పుడూ ఫలాన పాత్ర చేయాలని కోరుకోలేదు. కాకపోతే వెనక్కి తిరిగి చూసుకుంటే అలాంటి సినిమాలు డాట్స్ రూపంలో కనిపిస్తాయి. నాకే కాదు, చాలా మంది పరిస్థితి అదే. నేను నాలోని నటనను పూర్తి స్థాయిలో చూపించదగ్గ పాత్రల కోసం వెయిట్ చేస్తున్నా. నాకు ఏం ఇవ్వాలో ప్రకృతికి తెలుసు. నాకు కావలసినన్ని పాత్రలు వస్తూనే ఉంటాయి. వాటిలో నాకు నచ్చినవి ఎంపిక చేసుకోవడమే. అందరిలాగే నాకూ అమిర్ ఖాన్ చేసే సినిమాలు, అమితాబ్ తరహా వైవిధ్యమైన సినిమాలు చేయాలని ఉంటుంది. అంతెందుకు 'బాహుబలి' లాంటి సినిమాలు కూడా చేయాలని ఉంటుంది. అలాంటివి మన వద్దకు రావు. కాబట్టి వాటి గురించి ఎక్కువగా ఆలోచించకూడదు. 'రోజా' సినిమాను నేనే చేయాల్సింది. అది చేస్తే నా కెరీర్ ఎక్కడికో వెళ్ళిపోయేది. ఆ సమయంలో నా చేతికి గాయం కావడంతో ఆ సినిమా చేయలేకపోయా. కానీ దాని గురించి ఎప్పుడు బాధపడలేదు. అది చేయలేకపోయినా, 'సుందరకాండ' లాంటి కుటుంబ కథా చిత్రాలు చాలా చేశా. జీవితంలో కొన్ని మార్పులు, చేర్పులు జరుగుతుంటాయి. ఏం జరిగినా మన మంచికే అనుకుంటా.

వారిని గౌరవించాలి..

త్వరలో 'వెంకీమామ' చేస్తున్నా. త్రివిక్రమ్ దర్శకత్వంలో ఓ సినిమా చేయాల్సి ఉంది. అనిల్ రావిపూడి మరో స్క్రిప్ట్‌ని రెడీ చేస్తున్నాడు. ఏది ముందు, ఏది తర్వాత అనేది ఇప్పుడే తెలియదు. 'వెంకీమామ'లో మంచి పాత్రలో కనిపిస్తా. నా పాత్రతో పాటు నాగచైతన్య పాత్ర కూడా బాగుంటుంది. ఇక సోషల్ మీడియా గురించిచెప్పాల్సి వస్తే.. ఇన్‌స్టాగ్రామ్ చాలా బాగుంటుంది. నేను వ్యక్తిగతంగా ఫొటోగ్రఫీని ఇష్టపడతా. ప్రకృతిపై తీసిన ఫొటోలను ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేస్తుంటా. 'మీటూ'పై ఇటీవల మంచి చర్చ జరిగింది. దీనిపై నేను పంచ్‌లు వేయదలుచుకోలేదు. కానీ 'మీటూ' గురించి బయటకు వచ్చి చెప్పిన వాళ్ళని గౌరవించాలి.

ప్రేమ, రాజకీయ నేపథ్య సినిమా


'బైలంపుడి' చిత్ర యూనిట్

హరీష్ వినయ్, తనిష్క్ తివారి జంటగా అనిల్ పిజి రాజ్ దర్శకత్వంలో తార క్రియేషన్స్ పతాకంపై బ్రహ్మానంద రెడ్డి నిర్మిస్తున్న చిత్రం 'బైలంపుడి'. 'పిల్లల దేవుడు' అనే లిరికల్ సాంగ్‌ని బుధవారం విడుదల చేశారు. బాలీవుడ్ నటి మైరా అమిథి చేతుల మీదుగా పాట విడుదలైంది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, 'పిల్లల దేవుడు' పల్లవితో సాగే ఈ పాట చాలా బాగుంది. టీమ్ అందరికి అభినందనలు' అని అన్నారు. 'అందరూ కొత్త వారైనా సహజసిద్ధంగా నటించారు. షూటింగ్ పూర్తయ్యింది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. హై టెక్నికల్ వ్యాల్యూస్‌తో సినిమాని తెరకెక్కించాం. 'ఇక్కడ యుద్ధం చేయాలి, గెలవడానికి కాదు, బతకడానికి' అనే క్యాప్షన్ సినిమాపై మంచి అంచనాలను పెంచింది. తాజాగా రిలీజ్ చేసిన పాట అందరికి నచ్చుతుందని ఆశిస్తున్నా' అని నిర్మాత బ్రహ్మానంద రెడ్డి చెప్పారు. దర్శకుడు అనిల్ పిజి రాజ్ చెబుతూ, 'కెమెరామెన్‌గా నా కెరీర్‌ని ప్రారంభించాను. చాలా సినిమాలకు వర్క్ చేశా. దర్శకుడిగా నాకిది తొలి చిత్రం. 'బైలంపుడి' గ్రామంలో జరిగే లవ్ అండ్ పొలిటికల్ చిత్రమిది. ప్రతి పాత్ర ఎంతో నేచురల్‌గా ఉంటుంది. ఓ గ్రామంలో ఏ అంశాలు ఉంటాయో, ఈ చిత్రంలో అవన్నీ ఉంటాయి. నిర్మాత రాజీపడకుండా నిర్మించారు. ప్రస్తుతం కొత్త కథలని ఆదరిస్తున్నారు. ఆ తరహాలో వచ్చే మా సినిమాని కూడా ఆదరిస్తారని కోరుతున్నా' అని చెప్పారు. 'సంగీత దర్శకుడు సుభాష్ అద్భుతమైన సాంగ్ అందించారు. దర్శక, నిర్మాతలకు థ్యాంక్స్. మంచి సినిమాలో నన్ను ఎంపిక చేసుకున్నందుకు' అని హీరో హరీష్ తెలిపారు.

హిట్ కోసం..!


మారుతి, శర్వానంద్

ఒక్క ఫ్లాప్ వచ్చినా హీరోలు సాధ్యమైనంత వరకు సేఫ్ గేమ్ ఆడతారు. హిట్ ఇచ్చిన దర్శకుడితో సినిమా చేసేందుకు సిద్ధమైపోతుంటారు. తాజాగా శర్వానంద్ అదే చేస్తున్నట్టు కనిపిస్తుంది. తనకు 'మహానుభావుడు' వంటి విజయాన్ని అందించిన మారుతి దర్శకత్వంలో సినిమా చేసేందుకు సిద్ధమయ్యారట. శర్వానంద్ ఇటీవల నటించిన 'పడి పడి లేచే మనసు' పరాజయం చెందింది. హను రాఘవపూడి దర్శకత్వంలో వచ్చిన ఈ సినిమా రొటీన్‌గా ఉందంటూ విమర్శలు ఎదుర్కొంది. ఈ నేపథ్యంలో తవిజయం కోసం మారుతితో సినిమా చేయాలని నిర్ణయించుకున్నారట. ఇదిలా ఉంటే మారుతి రూపొందించిన 'శైలజా రెడ్డి అల్లుడు' సైతం పరాజయం చెందిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో మారుతికి ఓ హిట్ కావాలి. శర్వానంద్ ప్రస్తుతం సుధీర్ వర్మ దర్శకత్వంలో క్రైమ్ డ్రామా నేపథ్యంలో ఓ సినిమా చేస్తున్నారు. ఇందులో ఆయన రెండు భిన్న షేడ్స్ ఉన్న పాత్రలో కనిపించనున్నారట. దీంతోపాటు '96' రీమేక్‌లోనూ నటిస్తుంచనున్నట్టు తెలుస్తుంది.

భరతనాట్యం ప్రధానంగా..!

శ్రీ మంగం, శశాంక్, అవంతిక హరి నల్వా, గాయత్రి అయ్యర్ ప్రధాన పాత్రధారులుగా కుమార్ జి. దర్శకత్వంలో చరిత అండ్ గౌతమ్ ప్రొడక్షన్స్ పతాకంపై తను.ఎస్ నిర్మిస్తున్న చిత్రం 'ప్రణవం'. సినిమా షూటింగ్ పూర్తి చేసుకుని ప్రస్తుతం నిర్మాణాంతర కార్యక్రమాలు జరుపుకుంటోంది. ఈ సందర్భంగా చిత్ర దర్శకుడు కుమార్.జి మాట్లాడుతూ, 'ప్రస్తుతం శరవేగంగా పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుపుకుంటున్న ఈ చిత్రంలో చండీఘర్‌కి చెందిన మోడల్ అవంతిక హరి హీరోయిన్‌గా నటిస్తుండగా, గాయత్రి అయ్యర్ మరో కీలక పాత్ర పోషిస్తున్నారు. భరతనాట్యం నేపథ్యంలో లవ్, సస్పెన్స్‌తో సినిమాని తెరకెక్కిస్తున్నాం. అన్ని వర్గాల ప్రేక్షకులకు నచ్చే చిత్రమవుతుందన్న నమ్మకం ఉంది. అలాగే మా సినిమాకి మ్యూజిక్ ప్రధాన ఆకర్షణగా నిలుస్తుంది. ఆర్.పి.పట్నాయక్, ఉష కలిసి ఒక డ్యూయెట్ పాటని ఆలపించారు. త్వరలో ఆడియో రిలీజ్ చేయడానికి ప్లాన్ చేస్తున్నాం. ఫ్రెష్ కాన్సెప్ట్‌తో యంగ్ టీమ్ అంతా కలిసి చేస్తున్న మా ప్రయత్నాన్ని ప్రేక్షకులు ఆశీర్వదిస్తారని కోరుకుంటున్నా' అని అన్నారు.


శ్రీ మంగం, అవంతిక హరి నల్వా


రణ్‌వీర్ సింగ్, అలియా భట్

నువ్వు పెద్ద గూండావా ?

రణ్‌వీర్ సింగ్ ప్రస్తుతం 'గల్లీబాయ్స్' చిత్రంలో నటిస్తున్నారు. అలియా భట్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రానికి జోయా అక్తర్ దర్శకత్వం వహిస్తున్నారు. మ్యూజికల్ ప్రధానంగా రూపొందుతున్న ఈ చిత్రం ట్రైలర్‌ని బుధవారం విడుదల చేశారు. ఇందులో రణ్‌వీర్ సింగ్ గాయకుడు కావాలనుకుంటాడు. పేదరికంలో పుట్టిన నేపథ్యంలో తన కలలను అందుకోవడం కష్టంగా మారుతుంది. చదువు మానేసి తిరుగుతుండటంతో వాళ్ళ నాన్న అతనిపై కోప్పడుతుంటాడు. మరో పక్క అలియాకి త్వరగా పెళ్ళి చేయాలని వారి తల్లిదండ్రులు చూస్తుంటారు. పెళ్ళిచూపుల్లో ఓ మహిళ 'నువ్వు వంట చేయగలవా' అని అడిగితే, 'లేదు, కానీ అన్నీ అనుకున్నట్టు జరిగితే ఏదో ఒక రోజు నేను మీకు కాలేయ మార్పిడి శస్త్రచికిత్స చేయగలను' అని అలియా అంటుంది. 'నా బాయ్‌ఫ్రెండ్‌ని ఎవరైనా ఆటపట్టిస్తే లాగిపెట్టి కొట్టకుండా ఉండలేను కదా' అంటుంది. రణ్‌వీర్ స్పందిస్తూ, 'అంత పెద్ద గూండావా నువ్వు' అని ఆటపట్టించడం ట్రైలర్‌లో హైలైట్‌గా నిలిచింది. ముంబయికి చెందిన అండర్‌గ్రౌండ్ ర్యాపర్స్ డివైన్, నీయాజీ జీవితాల ఆధారంగా తెరకెక్కిస్తున్న ఈ చిత్రం ఫిబ్రవరి 14న రిలీజ్ కానుంది.

స్పష్టత అవసరం

'మీ ప్రేమ నిజమైతే, భాగస్వామి విషయంలో స్పష్టత ఉంటే, మీ ప్రేమని పెళ్ళి వరకు తీసుకెళ్ళండి' అని అంటోంది దీపికా పదుకొనె. గతేడాది తన ప్రేమికుడు, నటుడు రణ్‌వీర్ సింగ్‌ని దీపికా వివాహమాడిన విషయం విదితమే. ఈ సందర్భంగా దీపికా నేటి యువతరానికి ఓ సందేశాన్ని ఇచ్చారు. ఫేస్‌బుక్ లైవ్‌లో ఆమె చెబుతూ, 'పెళ్ళి చేసుకోవడం ఓ అందమైన ఘట్టం. ప్రేమ పెళ్ళి విషయంలో కచ్చితంగా ఉండాలి. ఎవరో ఒత్తిడి చేస్తున్నారని పెళ్ళి చేసుకునేందుకు తొందరపడవద్దు. మీకు సరైన భాగస్వామి ఎవరనే విషయంలో స్పష్టంగా ఉండాలి. ఎందుకంటే మిగిలిన జీవితం అంతా వారితోనే కలిసి ఉండాల్సి వస్తుంది. ముఖ్యంగా మిమ్మల్ని గౌరవించి, అర్థం చేసుకునే వ్యక్తి ఎవరో తెలుసుకోవాలి. ఏ బంధమైన విజయవంతం కావడానికి నమ్మకం, స్నేహం, పరస్పర గౌరవం ముఖ్యం. గతేడాది వ్యక్తిగతంగా, వృత్తిపరంగా నాకు అద్భుతంగా సాగింది. 'పద్మావత్' చిత్రానికి ప్రశంసలు పొందాను. చాలా రోజులు కుటుంబంతో గడిపాను. పెళ్ళి కూడా జరిగింది. సెట్‌కి దూరంగా ఉండి ఏడాది అవుతుంది. మళ్ళీ వర్క్ చేసేందుకు సిద్ధమవుతున్నా' అనిచెప్పింది.


దీపికా పదుకొనె

అందుకు గర్వంగా ఉంది

'కొత్త సంవత్సరం ప్రారంభమైంది. కొత్త సినిమా షూటింగ్ పూర్తయ్యింది' అని అంటోంది సోనాక్షి సిన్హా. బాలీవుడ్‌లో తనకంటూ ఓ ప్రత్యేకతను ఏర్పర్చుకుంది సోనాక్షి. కమర్షియల్ సినిమాలే కాదు, నవ్యమైన కథా చిత్రాల్లో భిన్నమైన పాత్రలు పోషిస్తూ రాణిస్తుంది. ప్రస్తుతం ఆమె ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న 'కళంక్' చిత్రంలో ప్రధాన పాత్ర పోషిస్తుంది. పీరియడ్ డ్రామాగా రూపొందుతున్న ఈ చిత్రానికి అభిషేక్ వర్మన్ దర్శకత్వం వహిస్తున్నారు. కరణ్ జోహార్, సాజిద్ నడియడ్‌వాలా నిర్మిస్తున్న ఈ చిత్రంలో సంజయ్ దత్, వరుణ్ ధావన్, ఆదిత్య రాయ్ కపూర్, మాధురీ దీక్షిత్, అలియా భట్, కూనల్ ఖెమ్ము ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. ఇందులో తన పార్ట్ షూటింగ్ పూర్తయ్యిందట. సోనాక్షి ఈ విషయాన్ని ట్విట్టర్ ద్వారా మంగళవారం వెల్లడించింది. 'కొత్త ఏడాది ప్రారంభమైన సందర్భంగా నా కొత్త సినిమాకి సంబంధించి నా పార్ట్ షూటింగ్ పూర్తవడం చాలా ఆనందంగా ఉంది. ఇందులో భాగమైనందుకు గర్వంగా ఫీలవుతున్నా. సినిమా కోసం ఈగర్‌గా వెయిట్ చేస్తున్నా' అని తెలిపింది. దీంతోపాటు సోనాక్షి 'మిషన్ మంగళ్'లో, అలాగే 'టోటల్ దమాల్' చిత్రంలో ప్రత్యేక పాటలో మెరవనుంది. వీటితోపాటు త్వరలో ప్రారంభం కాబోతున్న సల్మాన్ ఖాన్ 'దబాంగ్ 3'లో నటించేందుకు సన్నద్ధమవుతుంది.


సోనాక్షి సిన్హా

మోడీ హఠావో... మజ్దూర్ బచావో

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

మోడీ హఠావో..మజ్దూర్ బచావో అంటూ కార్మిక వర్గం గొంతెత్తింది. రెండు రోజుల జాతీయ సమ్మెలో భాగంగా బుధవారం ఢిల్లీలో కార్మిక సంఘాలు భారీ ర్యాలీ నిర్వహించాయి. పది కార్మిక సంఘాల ఆధ్వర్యంలో మండిహౌస్ నుంచి పార్లమెంట్ స్ట్రీట్ వరకు వేలాది మంది కార్మికులు కదంతొక్కారు. "మోడీ హఠావో... దేశ్ బచావో, కార్మిక విరోధి నరేంద్ర మోడీ డౌన్ డౌన్, ఇంక్విలాబ్... జిందాబాద్" అన్న నినాదాలతో పార్లమెంట్ స్ట్రీట్ హోరెత్తింది. ఈ ప్రదర్శనలో సీపీఐ(ఎం) పొలిట్ బ్యూరో సభ్యురాలు బృందా కరత్, ఏఐకేఎస్ ప్రధాన కార్యదర్శి హన్నన్ మొల్లా తదితర నేతలు పాల్గొని సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ ప్రధాన కార్యదర్శి తపన్ సేన్ మాట్లాడుతూ మోడీ సర్కార్ ప్రజా వ్యతిరేక, కార్మిక వ్యతిరేక విధానాలపై దేశవ్యాప్తంగా పది కార్మిక సంఘాలు పిలుపునిచ్చిన జాతీయ సమ్మెలో గ్రామీణ భారతం సైతం పెద్ద ఎత్తున పాల్గొన్నారని వెల్లడించారు. ఈ సమ్మె కార్మిక ఆందోళనగా మాత్రమే కాకుండా ప్రజా ఉద్యమంగా సాగిందని తెలిపారు. ఆందోళనకు అన్నివర్గాల నుంచి సంఘీభావం లభించిందని చెప్పారు. జాతీయ సమ్మెలో భాగంగా భారీ ర్యాలీ, ధర్నాలు, పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపట్టారని వివరించారు. జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో సంఘటితంగా ఆందోళన కార్యక్రమాలు జరిగాయని చెప్పారు. కార్మికుల సత్తా ఏంటో ప్రధాని నరేంద్ర మోడీకి చూపామని ఆయన వివరించారు. అధికారంలోకి వచ్చిన తొలిరోజు నుంచి కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న బీజేపీ ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపే రోజులు దగ్గర పడ్డాయన్నారు. గత నాలుగున్నరేండ్లుగా కార్మిక హక్కులపై పెద్ద ఎత్తున దాడి జరుగుతున్నదని వివరించారు. హేతుబద్ధత లేకుండా ట్రేడ్ యూనియన్ చట్టాన్ని సవరించేందుకు కేంద్రం ప్రయత్నించడం దారుణమన్నారు. తొందరలోనే మోడీ సర్కారుకు దేశ ప్రజానీకం గుణపాఠం చెప్పనున్నదని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి అమరజిత్ కౌర్ మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేటీకరణ చేస్తున్న మోడీ సర్కారుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ జాతీయ సమ్మెకు అన్ని కార్మిక సంఘాలు మద్దతు తెలిపినట్టు వివరించారు. ఐటీ రంగంలో కూడా పలుచోట్ల కొంతమంది టెక్కీలు సమ్మెలో పాల్గొన్నట్టు వివరించారు. బ్యాంకింగ్, కోల్, పెట్రోలియం, పోస్టు, టెలికం, ఇంజనీరింగ్, స్టీల్, డిఫెన్స్, హెల్త్, ఎడ్యూకేషన్ తదితర రంగాలకు చెందిన శ్రామిక సంఘాలు జాతీయ సమ్మెలో పాల్గొన్నారని చెప్పారు. ముఖ్యంగా రైతు, వ్యవసాయ కార్మికుల సంఘాల తరపున రైతులు, రైతు కూలీలు గ్రామాల్లో హర్తాల్ నిర్వహించారన్నారు. ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడు అశోక్ సింగ్ మాట్లాడుతూ మోడీ సర్కారు కార్మికులపై కక్ష గట్టిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి తరుణంలో కార్మికులంతా ఏకమై, జాతీయ సమ్మెను విజయవంతం చేయడం ఆనందకరమన్నారు.

ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నేత ఆర్‌కె శర్మ, సీఐటీయూ నేత ఎఆర్ సింధూ, హెచ్ఎంఎస్, టీయూసీసీ, ఎస్ఈడబ్ల్యూఏ, ఏఐసీసీటీయూ, ఎల్‌పీఎఫ్, యూటీయూసీ తదితర సంఘాల నేతలు పాల్గొన్నారు.

సమ్మె సంపూర్ణం..

- రెండోరోజూ భారీ ర్యాలీలు, ధర్నాలు
- అన్నిప్రాంతాల్లో తరలొచ్చిన కార్మికలోకం
- కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు

నవతెలంగాణ-యంత్రాంగం

కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా చేపట్టిన దేశవ్యాప్త సమ్మె రెండోరోజైన బుధవారం సంపూర్ణంగా జరిగింది. అన్ని జిల్లాలు కార్మికుల భారీ ర్యాలీలు, ధర్నాలతో హోరెత్తాయి. రంగాలవారీగా కార్మిక లోకం తరలొచ్చి కేంద్రానికి వ్యతిరేకంగా నినదించింది. పాఠశాలల్లో మధ్యాహ్న భోజన విరామ సమయంలో ఉపాధ్యాయులు నిరసన చేపట్టారు.

సంగారెడ్డి కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన ధర్నాలో సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు చుక్కరాములు మాట్లాడుతూ... కార్మికులకు మంచి రోజులు రావాలంటే మోడీ ప్రభుత్వాన్ని గద్దె దించాల్సిందేనని స్పష్టం చేశారు. అంతర్జాతీయ మార్కెట్‌లో క్రూడాయిల్ ధరలు తగ్గుతున్నా దేశంలో పెట్రోల్, ధరలు తగ్గించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. న్యాల్‌కల్ మండల కేంద్రంలో సీఐటీయూ, ఆశాలు, రెవెన్యూ ఉద్యోగుల సంఘాలు, ఝరాసంగంలో సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో కేంద్రం దిష్టిబొమ్మ దహనం చేశారు. సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లో ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేసి వినతిపత్రం అందజేశారు. మహబూబ్‌నగర్, జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రాల్లో నిరసనలు కొనసాగాయి.

మిర్యాలగూడ ఆర్డీవో కార్యాలయం ఎదుట సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి మాట్లాడుతూ... సమాన పనికి సమాన వేతనమివ్వాలని డిమాండ్ చేశారు. సూర్యాపేట జిల్లాలో కలెక్టరేట్ వరకు ర్యాలీ తీశారు. యాదాద్రి భువనగిరి జిల్లాలో కలెక్టరేట్ ఎదుట సీఐటీయూ జాతీయ ఉపాధ్యక్షులు ఆర్ సుధాభాస్కర్ మాట్లాడుతూ.. కార్మిక చట్టాలను సవరించడానికి కేంద్ర ప్రభుత్వం పూనుకుందని కార్మికులంతా ఐక్యంగా ఉంటేనే కార్మికుల హక్కులను సాధించుకోవచ్చన్నారు. ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి వెంకటేశం మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం వ్యవహరిస్తున్న నయా ఉదారవాద విధానాల వల్ల కార్మికులు, ప్రజలు ఇబ్బంది పడుతున్నారని అన్నారు. వరంగల్ ఉమ్మడి జిల్లాలో రెండ్రోజుల పాటు సమ్మెలో నాలుగు లక్షల మందిపైగా పాల్గొన్నారు. హన్మకొండలోని వేయి స్థంభాల ఆలయం నుంచి అంబేద్కర్ జంక్షన్ వరకు ర్యాలీ చేశారు. ఖమ్మం జిల్లా సత్తుపల్లిలోని జేవీఆర్ బొగ్గుగనిలో దాదాపు 200మందికార్మికులు సమ్మెకు మద్దతు తెలపడంతో బొగ్గుఉత్పత్తికి అంతరాయం ఏర్పడింది. ఖమ్మం నగరంలోని జడ్పీ సెంటర్‌లో పెత్త ఎత్తున మానవహారాన్ని ఏర్పాటుచేశారు. కొత్తగూడెంలో పోస్టాఫీసు సెంటర్ నుంచి ప్రారంభమైన ప్రదర్శన కలెక్టర్ కార్యాలయం వరకు సాగింది.





హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో మధ్యాహ్న భోజన, ఫీల్డ్ అసిస్టెంట్లు, హమాలీలు, పంచాయతీ కార్మికులు ఆందోళనలు చేశారు. తుర్కయంజాల్ చౌరస్తాలో అంబేద్కర్ విగ్రహానికి మున్సిపల్ వర్కర్స్ పూలమాలలు వేశారు. అశోక్‌నగర్ లేబర్ అడ్డా నుంచి లిబర్టీ అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. ఇబ్రహీంపట్నం, షాద్‌నగర్ తదితర మండలాలతో పాటు వికారాబాద్ జిల్లాలో ఆర్డీవో, తహసీల్దార్ కార్యాలయాల ఎదుట ధర్నాలు చేశారు. కరీంనగర్ కలెక్టరేట్ ఎదుట ధర్నాలో సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి పి.జయలక్ష్మి మాట్లాడారు. రాజన్నసిరిసిల్ల జిల్లాలో కలెక్టరేట్ ఎదుట కార్మికులు బైటాయించారు. ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ బహిరంగ సభలో సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాయిబాబు మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం పెట్టుబడిదారులకు కొమ్ముకాస్తోందన్నారు. ఆదిలాబాద్‌లో కలెక్టరేట్ ప్రధాన ద్వారం వరకు వందలాది మంది కార్మికులు ర్యాలీగా వెళ్లారు.

మంచిర్యాల జిల్లా కాసి పేట ఏరియాలోని సింగరేణి గనుల్లో బొగ్గు ఉత్పత్తి తగ్గిం ది. జగిత్యాల, పెద్దపల్లి జిల్లా కలెక్టరేట్ల వరకు ర్యాలీలు కొన సాగాయి. సమ్మెకు మద్దతుగా టీఎన్జీవోస్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని అమరవీరుల స్థూపం నుంచి జిల్లా కలెక్టరేట్ వరకు ఉద్యోగులు నల్లా బాడ్జీలు ధరించి ర్యాలీ తీశారు. కామారెడ్డిలో రాస్తారోకో చేపట్టడంతో ఇరువైపులా వాహనాలు నిలిచిపోయాయి. నిజామాబాద్‌లో రైల్వే కమాన్ నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వరకు వేర్వేరుగా ర్యాలీలు నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా సమ్మెను విజయవంతం చేసిన ఉద్యోగ, కార్మిక వర్గానికి సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాయిబాబు అభినందనలు తెలిపారు.

తప్పుడు లెక్కలు

(మొదటిపేజీ తరువాయి)

పేర్కొన్న అంశాలు ఇలా ఉన్నాయి. ఆదాయ, వ్యయాలు, అప్పులు...మొదలైన విషయాల్లో మెరుగ్గా ఉన్నామనీ, ద్రవ్యలోటు సమస్యలేదనీ చూపడానికి మోడీ సర్కార్ 'ఆఫ్ బడ్జెట్' విధానాల్ని ఎంచుకుంది. ఈ విషయం కాగ్ ఇటీవల జరిపిన అనేక ఆడిటింగ్ లెక్కల్లో తేలింది. రెవెన్యూ, పెట్టుబడి వ్యయం కోసం పెద్ద ఎత్తున అప్పులు చేశారు. అయితే వీటికి సంబంధించి కేంద్రం ఇచ్చిన వ్యయ గణాంకాలు పారదర్శకంగా లేవు. కారణం కేంద్రం 'ఆఫ్ బడ్జెట్' విధానా ల్ని అనుసరించటమే. నిధుల్ని వ్యయం ఎలా చేశారన్నదానిపై లోపాలుబయటపడ్డాయి.

'ఆఫ్ బడ్జెట్' ఎక్కడ జరిగింది?

అన్ని శాఖల్లో 'ఆఫ్ బడ్జెట్' మార్గాన్ని అమలుజేశారు. ఫెర్టిలైజర్ బిల్లుల దగ్గర్నుంచీ విద్యుత్ ప్రాజెక్టులకు నిధులు సమకూర్చడం వరకూ ఇదే పంథాలో కేంద్రం ముందుకువెళ్లింది. ఎరువుల బకాయిలు, బిల్లులకు ప్రత్యేక బ్యాంకింగ్ విధానంలో చెల్లింపులు జరిగాయి. ప్రతీ ఏటా చెల్లించాల్సిన బకాయిలు పెరుగుతూ వచ్చాయి. అంటే ఇక్కడ బకాయిలు, బిలుల్ని చెల్లించకుండా ప్రతీఏటా వాయిదావేస్తూ వచ్చారు. అలాగే ఎఫ్‌సీఐ ద్వారా అప్పులు చేసి ఆహార సబ్సిడీ బిల్లులు, బకాయిలు చెల్లిస్తూ వచ్చారు. నాబార్డ్ కింద నీటిపారుదల రంగానికి తీసుకొచ్చిన అప్పులు...అన్నీ ఇలాగే చేశారు.

రైల్వే ప్రాజెక్టులకు 'ఆఫ్ బడ్జెట్' విధానంలో పెట్టుబడి వ్యయం సమకూర్చారు. ఇందుకోసం ఐఆర్‌ఎఫ్‌సీ ద్వారా అప్పులు చేశారు. విద్యుత్ రంగ ప్రాజెక్టులకు పీఎఫ్‌సీ ద్వారా నిధులు సమకూర్చారు. ప్రతీఏటా బడ్జెట్ లక్ష్యానికి అనుగుణంగా నిధుల వ్యయం లేకపోవటంతో 'ఆఫ్ బడ్జెట్' విధానాల్లో అప్పులతో నెట్టుకొచ్చారు. ఇలాంటి ఆర్థిక వ్యూహాలు యూపీఏ-1, యూపీఏ-2 హయాంలోనూ పాలకులు అమలుజేశారు. అప్పుడు ఇదే భారతీయ జనతా పార్టీ పెద్ద ఎత్తున విమర్శలు చేసింది.

మానవత్వం చూపటంలో విఫలం

కోల్‌కతా : దాడులకు గురవుతున్న వర్గాలకు మద్దతుగా నిలబడలేకపోతున్నామనీ, మానవత్వం చూపటమనే కనీస బాధ్యతను నిర్వర్తించటంలో విఫలమవుతున్నామనీ నోబెల్ గ్రహీత, ప్రముఖ ఆర్థికవేత్త అమర్త్యసేన్ ఆవేదన వ్యక్తం చేశారు. మూకదాడులు, ఎన్‌జీ ఓలపై మోడీ సర్కార్ అణిచివేతలకు వ్యతిరేకంగా బాలీవుడ్ నటుడు నసీ రుద్దీన్ షా మాట్లాడటంతో ఆయనపై కాషాయ మూకలు మాటల దాడులు పెంచారు. ఇండియాలో అసహనంపై మాట్లాడుతున్న నసీరుద్దీన్‌షా వంటి వారిపై బాంబులు వేసి చంపాలని ఒక బీజేపీ ఎమ్మెల్యే దారుణమైన వ్యాఖ్యలు చేశారు. ఈనేపథ్యంలో నసీరుద్దీన్ షాకు అమర్త్యసేన్ మద్దతు పలుకుతూ.. పైవ్యాఖ్యలు చేశారు. రాజకీయాలు, భౌగోళిక సరిహద్దులకన్నా కళలు, సాహిత్యం మనుషుల్ని కలుపుతాయని అన్నారు. కోల్‌క తాలో జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ..."1971 బంగ్లాదేశ్ యుద్ధం జరిగినప్పుడు ఏం జరిగింది? దాడులకు గురైనవారికి మానవత్వమే అం డగా నిలబడింది. ఎన్‌ఆర్‌సీ పేరుతో నేడు అస్సాంలో జరుగుతున్నదేమిటి? ఆశ్రయం కోసం రోహింగ్యాలు మనదేశానికి వస్తే న్యాయం చేశామా? ఎక్కడ ఉంది లోపం? బాధితులకు, అణగారిన వర్గాలకు అండగా నిలబడటంలో మనం విఫ లమయ్యాం. కనీస బాధ్యత మానవత్వాన్ని చూపలేదు. నసీరుద్దీన్ షా వంటి వారి పై దాడులను మనం ఖండించాలి. దేశంలో అసహన ఛాయలు పెరుగుతు న్నాయి. ఇలాంటి ధోరణులను ఆపే ప్రయత్నం ప్రతీ ఒక్కరూ చేయాలి" అని అన్నారు.

ఈఆర్‌సీ చైర్మెన్ ఇస్మాయిల్ అలీఖాన్ పదవీ విరమణ

హైదరాబాద్ : రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి (టీఎస్ ఈఆర్‌సీ) చైర్మెన్ ఇస్మాయిల్ అలీఖాన్ బుధవారం పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా ఆయన్ను ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎమ్‌డీ డి.ప్రభాకరరావు, ఎస్పీడీసీఎల్ సీఎమ్‌డీ జి.రఘురామిరెడ్డి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు అలీఖాన్ సేవలను గుర్తు చేసుకున్నారు.

నామినేషన్ వేయకుండా అడ్డగింత!

- బలవంతంగా ఈడ్చుకెళ్లిన టీఆర్‌ఎస్ నాయకులు
- సర్పంచ్ బరిలో నిలిచిన వ్యక్తిపై దాడి
- ప్రేక్షకపాత్ర వహించిన పోలీసులు

నవతెలంగాణ-జనగామప్రతినిధి

ఏకగ్రీవానికి బెదిరింపులు, వేలంపాటలు కుదరబోవని ఎస్ఈసీ ప్రకటించిన మరుసటి రోజే టీఆర్‌ఎస్ నాయకులు దౌర్జన్యానికి ఒడిగట్టారు. సర్పంచ్‌గా పోటీ చేయాలనుకున్న వ్యక్తిపై దాడి చేసి నామినేషన్ వేయకుండా అడ్డుకున్నారు. అక్కడ్నుంచి సదరు వ్యక్తిని బలవంతంగా ఈడ్చుకెళ్లారు. ఇదంతా మున్సిపల్ చైర్‌పర్సన్ సమక్షంలోనే చోటుచేసుకోగా.. అక్కడే ఉన్న పోలీసులు కూడా మిన్నకుండిపోవడం గమనార్హం. జనగామ జిల్లా జనగామ మండలంలోని చిత కోడూరు గ్రామ సర్పంచ్‌గా పోటీ చేయాలనుకున్న రావుల రాజేష్‌గౌడ్ వడ్లకొండకు నామినేషన్ వేసేందుకు బుధవారం వెళ్లాడు. అప్పటికే మున్సిపల్ చైర్‌పర్సన్ ప్రేమలతారెడ్డి ఆ గ్రామంలో ఏకగ్రీవం చేసేందుకు యత్నిస్తున్నారు. ఈ నేపథ్యంలో రాజేష్‌గౌడ్ నామినేషన్ వేసేందుకు కేంద్రానికి వెళ్లగా స్వయంగా మున్సిపల్ చైర్‌పర్సన్ అక్కడికి చేరుకున్నారు. ఆమె సమక్షంలోనే టీఆర్‌ఎస్ నాయకులు రాజేష్‌ను అడ్డుకున్నారు. ఒకవైపు పోలీసులు చూస్తున్నప్పటికీ పట్టించుకోలేదు. ఈ క్రమంలో ఆమె అనుచరులతో కలిసి రాజేష్‌గౌడ్ నామినేషన్ వేయకుండా బయటకు లాక్కొచ్చారు. సమయం కూడా ముగిసిపోవడంతో నామినేషన్ కూడా వేయలేకపో యాడు. దీనిపై కాంగ్రెస్ నాయకులు తీవ్రంగా ఆగ్రహం వ్యక్తం చేశారు. టీఆర్‌ఎస్ నాయకులు అక్రమంగా గెలుపొందేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. ఇలాంటి ఘటనలు అనేక గ్రామాల్లో చోటుచేసుకుంటున్నాయనీ, అయినా ఎన్నికల అధికారులుగానీ, పోలీసులుగానీ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.



ఢిల్లీ, హర్యానా తరహాలో..

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పార్లమెంటరీ కార్యదర్శులపై సీఎం యోచన

- ఆర్డినెన్స్ కాదు.. చట్టమేనంటున్న టీఆర్‌ఎస్ వర్గాలు

ఢిల్లీ, హర్యానా తరహాలో రాష్ట్రంలో కూడా పార్లమెంటరీ కార్యదర్శులను నియమించాలని.. అక్కడున్న నియమ నిబంధనలనే ఇక్కడా పాటించాలని సీఎం కేసీఆర్ భావిస్తున్నారు. ఈ క్రమంలో వారి కోసం ఆర్డినెన్స్ కాకుండా శాసనసభలో చట్టం చేసేందుకు ఆయన యోచిస్తున్నట్టు సమాచారం. టీఆర్‌ఎస్ తొలి ప్రభుత్వంలో కూడా పార్లమెంటు కార్యదర్శులను నియమించిన సంగతి విదితమే. ఈ నియామకాలను హైకోర్టు కొట్టేయటంతో అప్పట్లో ఆ పదవులన్నీ రద్దయ్యాయి. ఇప్పుడు రెండోసారి ప్రభుత్వంలో మాత్రం కచ్చితంగా పార్లమెంటు కార్యదర్శులను నియమించటం ద్వారా మంత్రి పదవులు రాని వారిని సంతృప్తి పరచాలని టీఆర్‌ఎస్ అధినేత భావిస్తున్నారు. అయితే వారికి క్యాబినెట్‌తో హోదాతో సమాన హోదా కల్పిస్తారా..? లేదే అనే అంశంపై మాత్రం ఇంకా క్లారిటీ రాలేదని తెలిసింది. ఒకవేళ హోదా రాకపోయినా క్యాబినెట్ ర్యాంకు వర్తించే ఇతర అన్ని సదుపాయాలు, అలవెన్సులు వర్తించే విధంగా చట్టంలో పొందు పరచనున్నారని సమాచారం. ఇదే సమయంలో పార్లమెంటు కార్యదర్శులనగానే అవేవో అధికారిక పదవులు తప్ప రాజకీయ పరమైనవి కావనే అభిప్రాయం కూడా వ్యక్తమయ్యే అవకాశముంది. అందుకని ఆ పేరుతో కాకుండా మరో పేరుతో నియామకాలు చేపట్టే అవకాశం కూడా లేకపోలేదని అధికార పార్టీ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. మరోవైపు ఈనెల 16 నుంచి ప్రారంభమయ్యే శాసనసభ సమావేశాల్లోనే ఈ చట్టాన్ని రూపొందిస్తారా..? లేక తర్వాత ప్రత్యేకంగా అసెంబ్లీని నిర్వహిస్తారా..? అనేది వేచి చూడాల్సిన అంశంగా మారింది.

డిగ్రీలో కొత్త కోర్సులు

(మొదటిపేజీ తరువాయి)

సలహాలు, సూచనలు స్వీకరించే అవకాశమున్నది. ఇంకోవైపు ప్రయివేటు డిగ్రీ కాలేజీల్లో డిమాండ్ ఉన్న కోర్సులకు అనుమతి ఇవ్వాలని ఉన్నత విద్యామండలి సమాలోచన చేస్తున్నది. ఇప్పటికే డిమాండ్ ఉన్న కోర్సులకు అదనపు సెక్షన్లు కావాలన్నా ఇచ్చే దిశగా ఆలోచన చేస్తున్నది. 2019-20 విద్యాసంవత్సరంలో డిమాండ్ ఉన్న కోర్సులను అడిగిన కాలేజీలకు అనుమతులు ఇవ్వాలని భావిస్తున్నది. డిగ్రీలో బీఎస్సీ కంప్యూటర్స్, బీకాం జనరల్, బీకాం కంప్యూటర్ కోర్సులకు డిమాండ్ ఉన్నది. బీఏ, బీకాం, బీఎస్సీ కోర్సులను నిర్వహిస్తున్న కాలేజీల్లో డిమాండ్ ఉన్న కోర్సులను ప్రవేశపెట్టడం అవసరమని ఉన్నత విద్యామండలి గుర్తించింది. డిమాండ్ ఉన్న కోర్సులు కావాలని దరఖాస్తు చేసుకుంటే అనుమతులు ఇచ్చే అవకాశమున్నది. అదనపు సెక్షన్లు, అదనపు కోర్సులు అనుమతులు కావాలని కోరే కాలేజీ యాజమాన్యాలు అందుకు తగిన మౌలిక వసతి, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, బోధన, బోధనేతర సిబ్బంది ఉంటేనే అనుమతి ఇవ్వాలని ఉన్నత విద్యామండలి నిర్ణయించింది.

ఈబీసీ బిల్లుకు లైన్ క్లియర్

(మొదటిపేజీ తరువాయి)

సభ్యులు, వ్యతిరేకంగా ఏడుగురు సభ్యులు ఓటు వేశారు. బిల్లును సెలెక్టు కమిటీకి పంపాలన్న సవరణ ప్రతిపాదనకు అనుకూలంగా 18 మంది సభ్యులు, వ్యతిరేకంగా 155 మంది సభ్యులు ఓటు వేశారు. అంతకు ముందు కేంద్ర సామాజిక, న్యాయశాఖమంత్రి థావర్‌చంద్ గెహ్లాట్ మాట్లాడుతూ... ఈబీసీలకు న్యాయం చేయాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ ప్రధాని మోడీ ఈ బిల్లు తెస్తున్నారని చెప్పారు. ఆర్థికంగా వెనుకబడిన వారి చేయూతకు ఇంతకన్నా మంచి ఉపాయమేమైనా ఉన్నదా అని అన్నారు. రెండు, మూడు పార్టీలు తప్ప అన్ని రాజకీయ పక్షాలు బిల్లుకు మద్దతిస్తున్నాయని తెలిపారు. చరిత్రాత్మక బిల్లులో భాగస్వాములైనందుకు అందరికీ ఆయన ధన్యవాదాలు తెలిపారు.

ఇక ఎంపీ రేసు

(మొదటిపేజీ తరువాయి)

అంటున్నాయి అధికార పార్టీ వర్గాలు. సామాజిక సమీకరణాలతోపాటు విద్యాధికులు అధికంగా ఉండే మల్కాజిగిరి నుంచి రాజీవ్ శర్మను పోటీకి దించితే గెలుపు సునాయసమవుతుందని సీఎం భావిస్తున్నట్టు వినికిడి. సీనియర్ ఐఏఎస్ అయిన ఆయన.. గతంలో కేంద్ర ప్రభుత్వంలో పనిచేశారు. ఆయనకు ఢిల్లీలో ఉన్న పరిచయాలు.. పార్టీకి బాగా ఉపయోగపడతాయని కేసీఆర్ భావిస్తున్నట్టు తెలిసింది. ఈ విధంగా ఒకవైపు టీఆర్‌ఎస్ అధినేత.. ఎంపీ సీట్లపై లెక్కలేసుకుంటుంటే, మరోవైపు పార్లమెంటు బరిలోకి దిగేందుకు ఆ పార్టీలో ఆశావహుల సంఖ్య రోజురోజుకీ పెరుగుతున్నది. లోక్‌సభకు పోటీ చేసేందుకు గులాబీ నేతలు పోటీపడుతున్నారు. పలువురు సిట్టింగులకు ఈ దఫా ఉద్వాసన తప్పదని తేలడంతో ఆయా స్థానాల మీద చాలా మంది ఆశలు పెట్టుకున్నారు. దీంతో వారు సీఎం దృష్టిలో పడేందుకు తహతహలాడుతున్నారు. ఫిబ్రవరిలో లోక్‌సభ ఎన్నికలకు షెడ్యూల్ విడుదల కానుందన్న వార్తల నేపథ్యంలో వారు ఇప్పటి నుంచే అలర్ట్ అవుతున్నారు. టికెట్లు దక్కించుకునేందుకు తమ వంతు ప్రయత్నాలను మొదలుపెట్టారు. శాసనసభ ఎన్నికల్లో ఓటమి పాలైన ప్రముఖులతోపాటు చివరి నిమిషంలో టికెట్లు దక్కని వారు సైతం పార్లమెంటుకు పోటి చేయాలని భావిస్తున్నారు.

సిట్టింగుల్లో అత్యధిక మందికి సీట్లు ఇస్తామంటూ కేసీఆర్ చెబుతున్నప్పటికీ.. కనీసం ఐదు స్థానాల్లో అభ్యర్థులను మార్చనున్నారని తెలిసింది. చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి పార్టీ మారడంతో అక్కడ కొత్త వారిని బరిలో దింపనున్నారు. ఈ క్రమంలో మండలి చైర్మెన్ స్వామిగౌడ్ పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. ఆయన ఎమ్మెల్సీ పదవీకాలం మరో రెణ్నెల్లలో ముగియనుంది. దీంతో చేవెళ్లకు స్థానికుడైన స్వామిగౌడ్‌ను అక్కడి నుంచి బరిలోకి దింపే అవకాశముంది. పంచాయతీ రిజర్వేషన్లను రాష్ట్ర ప్రభుత్వం కుదించిన నేపథ్యంలో.. టీఆర్‌ఎస్‌పై గుర్రుగా ఉన్న బీసీలను మచ్చిక చేసుకునేందుకు ఇది బాగా ఉపయోగపడుతుందని గులాబీ బాస్ భావిస్తున్నారు. అయితే ఇదే టికెట్ కోసం మాజీ మంత్రి మహేందర్‌రెడ్డి సైతం ముమ్మర ప్రయత్నాలు కొనసాగిస్తున్నారని తెలిసింది. తాండూరు నుంచి ఓటమి పాలైన ఆయన.. ఈసారి ఎంపీగా గెలవటం ద్వారా తన సత్తా చాటాలని భావిస్తున్నారు. గత ఎన్నికల్లో మల్కాజ్‌గిరి ఎంపీగా గెలిచిన మల్లారెడ్డి.. ఇప్పుడు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. దీంతో అక్కడి నుంచి రాజీవ్‌శర్మను బరిలోకి దింపేందుకు కేసీఆర్ యోచిస్తున్నారు. ఇదే సీటుపై కేంద్ర మాజీ మంత్రి సముద్రాల వేణుగోపాలాచారి కూడా ఆశలు పెట్టుకున్నారు. మరోవైపు ఉప్పల్ ఎమ్మెల్యే సీటును ఆశించి భంగపడ్డ హైదరాబాద్ నగర మేయర్ బొంతు రామ్మోహన్ సైతం మల్కాజ్‌గిరి నుంచి ఎంపీగా పోటీ చేయాలని భావిస్తున్నారు. టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ద్వారా టికెట్ దక్కించుకోవచ్చన్న ఆశతో ఆయన ఉన్నారు.

దీంతోపాటు పెద్దపల్లి స్థానానికి తీవ్ర పోటీ నెలకొన్నట్టు తెలిసింది. చెన్నూరు నుంచి ఎమ్మెల్యేగా బాల్క సుమన్ ఎన్నిక కావడంతో ఆ సీటు మాజీ ఎంపీ వివేక్‌కు దక్కడం ఖాయమని అందరూ భావించారు. కానీ అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా వివేక్ పలు నియోజకవర్గాల్లో టీఆర్‌ఎస్ అభ్యర్థులకు వ్యతిరేకంగా పనిచేశారన్న ఫిర్యాదులు వెల్లువెత్తాయి. దీంతో ఆయనకు కాకుండా మరొకరికి టికెట్ కేటాయిస్తారనే ప్రచారం ఊపందుకున్నది. మాజీ ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరిని ఇక్కడి నుంచి బరిలో దింపొచ్చనే టాక్ వినబడుతున్నది. ఆయనతోపాటు బుద్ధవనం ప్రాజెక్టు స్పెషల్ ఆఫీసర్‌గా ఉన్న మల్లేపల్లి లక్ష్మయ్య, పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మెన్‌గా ఉన్న ఘంటా చక్రపాణి పేర్లు కూడా పరిశీలనలో ఉన్నట్టు తెలిసింది. వీరుగాకుండా చివరి నిమిషంలో కొత్త పేర్లు తెరపైకి వచ్చినా ఆశ్చర్యపోనక్కర్లేదని టీఆర్‌ఎస్ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

ఖమ్మం ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డికి ఈ దఫా టికెట్ దక్కకపోవచ్చు. మొన్నటి ఎన్నికల్లో ఆ జిల్లాలో టీఆర్‌ఎస్ ఘోర ఓటమికి పొంగులేటే కారణమంటూ పార్టీ అభ్యర్థులంతా ఆగ్రహం వ్యక్తం చేసిన సంగతి విదితమే. అయితే పొంగులేటి మాత్రం ...కేటీఆర్ ద్వారా టికెట్ దక్కించుకునేందుకు శతవిధాలా ప్రయత్నిస్తున్నట్టు సమాచారం. ఒకవేళ ఆయనకు టికెట్ ఇవ్వకపోతే.. మాజీ మంత్రి తుమ్మలగానీ, జలగం కుటుంబ సభ్యుల్లోంచి ఒకరికిగానీ టికెట్ దక్కే అవకాశాలున్నాయి. ఇక మహబూబ్‌నగర్ ఎంపీ జితేందర్‌రెడ్డి పరిస్థితి కూడా ఇదే మాదిరిగా ఉంది. శాసనసభ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల ఓటమికి ఆయనే కారణమనే వాదనలు వినపడుతున్నాయి. అందువల్ల ఈసారి జితేందర్‌కు టికెట్ కష్టమనే ప్రచారం కొనసాగుతున్నది. ఈ నేపథ్యంలో మహబూబ్‌నగర్ నుంచి మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు పోటీ చేసే అవకాశాలు కనబడుతున్నాయి. ఆ జిల్లాకు చెందిన కాంగ్రెస్ సీనియర్ నేత ఒకరు టీఆర్‌ఎస్‌లో చేరే అవకాశమున్న దరిమిలా సదరు నేతకు టికెట్ ఇచ్చినా ఆశ్చర్యపోనక్కర్లేదని అధికార పార్టీ నేతలు వ్యాఖ్యానిస్తున్నారు. ఏదేమైనా ఇలాంటి అంశాలన్నింటిపై క్లారిటీ రావాలంటే మరింత సమయం పడుతుందటున్నారు విశ్లేషకులు.

సంక్రాంతికి ధర పోటు

(మొదటిపేజీ తరువాయి)

చేస్తున్నారు. ఇక గుడ్డు రూ.5 పలుకుతోంది. కూరగాయల ధరల పరిస్థితీ అలాగే ఉంది.

ప్రత్యామ్నాయం చూపని ప్రభుత్వాలు

గతంలో పండుగ సమయాల్లో రేషన్ షాపుల ద్వారా ప్రభుత్వం కొన్ని వస్తువులు పంపిణీ చేసేది. ప్రస్తుతం అదీ లేదు. కేవలం బియ్యం, గోధుమలు మాత్రమే ఇస్తున్నారు. పండుగకు కావాల్సిన పిండి, నూనె, పప్పులు, ఇతర వస్తువులేమీ సబ్సిడీ రూపంలో అందించడం లేదు.

నగర మార్కెట్లో ధరలు ఇలా ఉన్నాయి..

సరుకులు	డిసెంబర్	జనవరి
మినపప్పు	రూ.65	రూ.90
శనగపప్పు	రూ.60	రూ.70
కందిపప్పు	రూ.65	రూ.75
పెసరపప్పు	రూ.70	రూ.80
ఎర్రపప్పు	రూ.60	రూ.55
పల్లీలు	రూ.70	రూ.90
శనగ పిండి	రూ.60	రూ.70

ప్రస్తుతం కూరగాయల ధరలు మార్కెట్లో (కిలో చొప్పున)

టమాటా	రూ.30
అలుగడ్డ	రూ 25
దొండకాయ	రూ.35
బీన్స్	రూ.35
పచ్చిమిర్చి	రూ.40
క్యాబేజీ	రూ.40
చింత పండు	రూ.120
పసుపు	రూ.150

రాహుల్, సోనియాలకు ఐటీ షాక్

(మొదటిపేజీ తరువాయి)

జర్నల్ లిమిటెడ్(ఏజేఎల్)కు సంబధించిన రీఅసెస్‌మెంట్‌లో వారి ఆదాయం విషయంలో రూ. 100 కోట్ల ట్యాక్స్ నోటీసును పంపించింది. 2011-12లో సోనియా రూ. 155.4 కోట్లు, రాహుల్ రూ.150 కోట్ల ఆదాయానికి సంబంధించిన పన్నును 'తప్పించుకున్నారు' అని ఐటీ శాఖ నివేదికలో పేర్కొన్నది. అయితే ఆ సమయంలో వారు తమ ఆదాయాన్ని తక్కువ చేసి చూపించారని తెలిపింది. ఇందులో భాగంగా రాహుల్‌గాంధీ తన ఇన్‌కం రిటర్న్‌ను రూ.68.1 లక్షలుగా ప్రకటించి అంతమేరకే పన్ను చెల్లించారని తెలిపింది. దీంతో వారికి నోటీసు జారీ చేసిన ఐటీ శాఖ.. రూ.100 కోట్ల ఆదాయపు పన్ను చెల్లించాలని పేర్కొన్నది. రాహుల్, సోనియాల ఆదాయ పన్ను బకాయిల విషయంలో రీఅసెస్‌మెంటు కోసం ఐటీ శాఖకు సుప్రీంకోర్టు గతనెల అనుమతినిచ్చిన విషయం తెలిసిందే.

నిర్ణయానికి ముందే..

(మొదటిపేజీ తరువాయి)

విశేషం. ప్రధాని నరేంద్రమోడీ నేతృత్వంలోని ఈ కమిటీలో తనకు బదులుగా మరో న్యాయమూర్తి ఎకె సిక్రీని నామినేట్ చేశారు. సీబీఐ అధినేతగా పరిమిత స్థాయి అధికారాలతో మళ్లీ నియమితులైన అలోక్ వర్మ బుధవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. కాగా వర్మ నియామకం విషయంలో వారం రోజుల్లోగా ఒక నిర్ణయం తీసుకోవాలని సుప్రీంకోర్టు ఈ ఎంపిక కమిటీని కోరిన విషయం తెలిసిందే. ఈ నెల 31న పదవీ విరమణ చేయనున్న అలోక్‌వర్మ స్థానంలో తదుపరి సీబీఐ చీఫ్‌ను ఎంపిక చేసేందుకు ప్రధాని నరేంద్రమోడీ, ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖార్గే, న్యాయమూర్తి సిక్రీలు త్వరలోనే భేటీ కానున్నట్టు తెలుస్తోంది. గత అక్టోబర్ 23న అర్ధరాత్రి ఆదేశాలతో కేంద్రం అప్పటి సీబీఐ డైరెక్టర్ అలోక్ వర్మను నిర్బంధ సెలవుపై పంపి ఆయన స్థానంలో తాత్కాలిక డైరెక్టర్‌గా నాగేశ్వరరావును నియమించిన విషయం తెలిసిందే. ఈ చర్యను అలోక్ వర్మ సుప్రీంకోర్టులో సవాలు చేస్తూ సీబీఐ డైరెక్టర్‌కు రెండేండ్ల నిర్ణీత పదవీ కాలం ఉంటుందని, కేవలం ప్రధాని నేతృత్వంలోని ఎంపిక కమిటీ మాత్రమే తనను తొలగించాల్సి వుంటుందని ఆయన తన పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ వాదనను అంగీకరించిన కోర్టు.. ఆయన్ను మరోసారి బాస్‌గా నియమించటంతో పాటు వారం రోజుల్లో ఆయనపై ఒక నిర్ణయం తీసుకోవాలని ఎంపిక కమిటీకి సూచించింది. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు మూడు నెలల తరువాత తొలిసారిగా బుధవారం తన కార్యాలయానికి వచ్చిన వర్మకు ప్రస్తుత తాత్కాలిక డైరెక్టర్ నాగేశ్వరరావు స్వాగతం పలికారు. పరస్పరం అవినీతి అభియోగాలకు దిగిన సీబీఐ డైరెక్టర్ అలోక్ వర్మ, ఆయన డిప్యూటి స్పెషల్ డైరెక్టర్ రాకేష్ అస్తానాలను విధుల నుంచి తొలగిస్తూ సెలవుపై పంపింది. సీబీఐ చరిత్రలోనే ఇటువంటి సంఘటన జరగడం ఇదే తొలిసారి. సీబీఐ డైరెక్టర్‌గా నియమింపబడిన వ్యక్తి రెండేండ్ల పాటు ఆ పదవిలో కొనసాగుతాడు. ఈ రెండేండ్ల కాలంలో ఎటువంటి రాజకీయ జోక్యం లేకుండా ఆయనకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే. కానీ ఈ విషయాన్ని విస్మరించిన మోడీ ప్రభుత్వం అలోక్ వర్మను బలవంతంగా సెలవుపై పంపింది. అంతేకాక తాను తీసుకున్న ఈ నిర్ణయాన్ని ప్రభుత్వం సమర్థించుకునే ప్రయత్నం చేసింది.

ఆ బిల్లు తెస్తే నిరవధిక సమ్మెలోకి వెళ్తాం..

- విద్యుత్ సౌధ వద్ద ధర్నాలో ఉద్యోగులు, ఇంజనీర్లు
- ట్రాన్స్‌కో సీఎమ్‌డీకి వినతిపత్రం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్



'విద్యుత్ సవరణల బిల్లు-2018'ని కేంద్రం పార్లమెంటులో ప్రవేశపెట్టేందుకు యోచిస్తున్నదని పలు కార్మిక సంఘాలకు చెందిన నేతలు తెలిపారు. ఇది అత్యంత ప్రమాదకరమైన, నష్టదాయకమైన బిల్లని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ బిల్లును కేంద్రం తీసుకొస్తే.. తక్షణం నిరవధిక సమ్మెలోకి వెళతామని వారు హెచ్చరించారు. దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా బుధవారం హైదరాబాద్‌లో ని విద్యుత్ సౌధ వద్ద మహాధర్నా నిర్వహించారు. జాతీయ విద్యుత్ ఉద్యోగుల, ఇంజనీర్ల సమన్వయ కమిటీ రాష్ట్రశాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కమిటీ కన్వీనర్ రత్నాకరరావు మాట్లాడుతూ... విద్యుత్ సవరణ బిల్లు-2018ని తీసుకురావటమంటే వినియోగదారుల మెడపై కత్తి పెట్టటమేనని అన్నారు. దీనివల్ల సబ్సిడీపై రైతులకు సరఫరా చేసే విద్యుత్‌ను పూర్తిగా రద్దు చేస్తారని ఆందోళన వ్యక్తం చేశారు. గృహ వినియోగదారులపై కూడా భారాలు పెరుగుతాయని తెలిపారు. ఇప్పటికే ముక్కలు, చెక్కలుగా ఉన్న ప్రభుత్వ విద్యుత్ సంస్థలకు ఈ బిల్లు గొడ్డలిపెట్టు వంటిదని చెప్పారు. ట్రాన్స్‌కో, జెన్‌కో, డిస్కామ్‌లన్నింటినీ గతంలో మాదిరిగా ఒకే గొడుగు కిందికి తీసుకురావాలని ఆయన ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. కేరళలో ఇదే తరహాలో ఒకే గొడుగు కింద విద్యుత్ సంస్థలున్నాయని గుర్తుచేశారు. ధర్నా అనంతరం విద్యుత్ ఉద్యోగ, ఇంజనీర్ల సంఘాల ప్రతినిధులు ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎమ్‌డీ డి.ప్రభాకరావుకు వినతిపత్రం సమర్పించారు. ధర్నాలో తెలంగాణ స్టేట్ యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర అధ్యక్షులు కుమారాచారి, ఇతర సంఘాల నేతలు పి.సదానందం, సాయిబాబా, శ్రీధర్, బిసిరెడ్డి, వజీర్, రాజేంద్రప్రసాద్, అనిల్, కరుణాకర్‌రెడ్డి, కిరణ్, రమేశ్, వెంకన్నగౌడ్, తులసి, భానుప్రకాశ్, రామ్‌జీ తదితరులు పాల్గొన్నారు.

భారత ఆర్థిక ప్రగతికి గండి

(మొదటిపేజీ తరువాయి)

ఆర్థిక సంవత్సరాంతానికి భారత్ స్థూల దేశీయ ఉత్పాదకత (జీడీపీ) 7.3 శాతం వృద్ధి రేటును నమోదు చేసుకుంటుందని ప్రపంచ బ్యాంకు అంచనా వేస్తోంది. రానున్న రెండేండ్లలో ఇది 7.5శాతానికి పెరిగే అవకాశాలున్నాయని ప్రపంచ బ్యాంకు తన ముందస్తు అంచనాలలో వెల్లడించింది. చైనా ఆర్థిక ప్రగతి 2019, 2020లో 6.2 శాతం 2021లో 6 శాతం మేర నమోదవుతుందని ప్రపంచబ్యాంకు అంచనావేసింది. దేశంలో పెరుగుతున్న వినియోగం, పెట్టుబడులతో జీడీపీ కూడా సానుకూల వృద్ధి రేటు నమోదు చేసుకుంటోందని, ప్రపంచంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థగా భారత్ దూసుకుపోతోందని ప్రపంచ బ్యాంకు వ్యాఖ్యానించింది. భారత ఆర్థిక ప్రగతి ఇప్పటికీ వేగవంతంగానే వున్నదని, ఇప్పుడు కూడా భారత్ వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థేనని ప్రపంచ బ్యాంక్ ప్రాస్పెక్ట్స్ గ్రూప్ డైరెక్టర్ అయిహాన్ కోస్ ఒక మీడియా సంస్థకిచ్చిన ఇంటర్వ్యూలో స్పష్టం చేశారు.

సెన్సెక్స్ ▲231
36,213

నిఫ్టీ ▲ 53
10,855

డాలరుకు రూపాయి విలువ
70.46


బంగారం (10.గ్రా)
రూ. 31,918


వెండి (కేజీ)
రూ. 39,223


కోడిగుడ్లు (వందకి)			
హైదరాబాద్	418	విజయవాడ	423
ఒక్కగుడ్డుకు	4.70	చెన్నై	455
వరంగల్	420	ముంబయి	473



సార్వత్రిక సమ్మెతో స్తంభించిన బ్యాంకింగ్



చెన్నై: కేంద్ర ప్రభుత్వపు ప్రజా వ్యతిరేక నిర్ణయాలను నిరసిస్తూ ట్రేడ్ యూనియన్లు చేపట్టిన సార్వత్రిక సమ్మె ఆర్థిక వ్యవస్థపై పెను ప్రభావాన్ని కనబరిచింది. బ్యాంకుల ఉద్యోగుల సమ్మె కారణంగా దాదాపు రూ.20,000 కోట్ల విలువైన చెక్కుల క్లియరెన్స్ నిలిచిపోయిందని 'ఆల్ ఇండియా బ్యాంక్ ఎంప్లాయిస్ అసోసియేషన్' (ఏఐబీఈఏ) వెల్లడించింది. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తోన్న విధానాలను వ్యతిరేకిస్తూ మంగళ, బుధవారాల్లో (జనవరి 8, 9 తేదీల్లో)ఉద్యోగులు ఈ సమ్మెను తలపెట్టారు. దేశవ్యాప్తంగా ఉన్న క్లియరింగ్ హౌస్‌లలో రూ. 20 వేల కోట్ల చెక్కుల లావాదేవీలు నిలిచిపోయాయని ఓ ప్రకటనలో ఏఐబీఈఏ వెల్లడించింది. 'బ్యాంకు అధికారులు సమ్మెలో పాల్గొనకపోయినా మాకు మద్దతు తెలిపారు. దాంతో బ్యాంకులు తెరిచి ఉన్నా..నగదు లావాదేవీలు, చెక్కుల క్లియరెన్సులు, గవర్నమెంటు ట్రెజరీ ఆపరేషన్లు, విదేశీ మారక లావాదేవీలు వంటి తదితర సేవల మీద ప్రభావం పడింది' అని తెలిపింది. రూ.13లక్షల కోట్ల మొండి బకాయిలే బ్యాంకులకు అతిపెద్ద సమస్య అని ఆ యూనియన్ వెల్లడించింది. 21 బ్యాంకుల్లో 19 బ్యాంకులు నెట్ లాసెస్‌తో ఇబ్బంది పడుతున్నాయని సంఘం తెలిపింది. ప్రభుత్వ ఇప్పటికైన మేలుకొని ప్రజా సమ్మతి మేరకు చర్యలు చేపడుతూ ముందుకు సాగాలని ఏఐబీఈఏ సూచించింది.

కన్జ్యూమర్ ప్రొడక్ట్స్‌లోకి హీరో..

న్యూఢిల్లీ : హీరో గ్రూపునకు చెందిన ఎలక్ట్రానిక్స్, టెక్నలాజీ ఉత్పత్తుల సంస్థ హీరో ఎలక్ట్రానిక్స్ తాజాగా కన్జ్యూమర్ ప్రొడక్ట్స్ సెగ్మెంట్‌లోకి ప్రవేశిస్తున్నట్లు వెల్లడించింది. ఈ సెగ్మెంట్‌లో వచ్చే ఐదేళ్లలో ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్సీ (ఎఐ) ఆధారిత 10 ఉత్పత్తులను ఆవిష్కరించనున్నట్లు హీరో ఎలక్ట్రానిక్స్ ఫౌండర్, డైరెక్టర్ ఉజ్జ్వల్ ముంజల్ తెలిపారు. ఇందులో హోమ్ ఆటోమేషన్, ఆటోమోటివ్, వైద్య, ఎంటర్‌టైన్‌మెంట్ డొమైన్లకు సంబంధించిన ఉత్పత్తులు ఉంటాయన్నారు. లాస్‌వేగస్‌లో సెస్ 2019లో ప్రదర్శిస్తున్నట్లు తెలిపారు. గ్లోబల్ టెక్నలాజీ సంస్థలు అమెజాన్, క్వాల్‌కోమ్‌ల భాగస్వామ్యంతో వీటిని అందుబాటులోకి తెస్తున్నామన్నారు.

36,000 మార్క్‌ను దాటిన సెన్సెక్స్



ముంబయిల: వరుసగా నాలుగో రోజూ మార్కెట్లు లాభపడ్డాయి. అంతర్జాతీయ మార్కెట్లలో సానుకూల పరిణామాలకు తోడు అమెరికా-చైనా మధ్య నెలకొన్న వాణిజ్య యుద్ధపు భయాలు తేలికవుతున్న నేపథ్యంలో మదుపర్లు కొనుగోళ్లకు మొగ్గు చూపారు. మరోవైపు డిసెంబర్‌తో ముగిసిన మూడో త్రైమాసికంలో కార్పొరేట్ కంపెనీల ఆర్థిక ఫలితాలు మెరుగ్గా ఉండొచ్చనే అంచనాలు మార్కెట్లలో విశ్వాసాన్ని పెంచాయి. భారత వృద్ధి రేటు పెరగనుందన్న ప్రపంచ బ్యాంకు రిపోర్టు తదితర పరిణామాల మధ్య బుధవారం బీఎస్ఈ సెన్సెక్స్ 231 పాయింట్లు లాభపడి 36 వేల మ్యాజిక్ మార్క్‌ను దాటి 36,213 పాయింట్లకు చేరింది. ఎన్ఎస్ఈ సూచీ నిఫ్టీ 53 పాయింట్లు రాణించి 10,855 వద్ద ముగిసింది.

అమెరికాను అధిగమించనున్న భారత్

- 2030 నాటికి రెండో మేటి ఆర్థిక వ్యవస్థగా అవతరణ.. ● ఇండియాకు కలిసి రానున్న 'యువశక్తి'
- యూత్ కారణంగా ఉద్యోగాలకు భారీ డిమాండ్ ● అసమానతలు తగ్గించేలా సంస్కరణలుండాలి
- దేశ శ్రమశక్తిలో మహిళల ప్రాతినిధ్యం పెంచాలి: స్టాండర్డ్ చార్టర్డ్ బ్యాంక్ దీర్ఘకాలిక జీడీపీ నివేదిక

వాషింగ్టన్: భారత్‌తో సహా ప్రస్తుతం వర్ధమాన ఆర్థిక వ్యవస్థలుగా రాణిస్తున్న వివిధ దేశాలు 2030 నాటికి ప్రపంచంలోని మేటి ఆర్థిక వ్యవస్థలుగా వెలుగొందనున్నాయని బ్రిటన్‌కు చెందిన బ్యాంకింగ్ సంస్థ స్టాండర్డ్ చార్టర్డ్ తాజా నివేదికలో అంచనా కట్టింది. 2030 నాటికి ప్రపంచంలోని మేటి 10 ఆర్థిక వ్యవస్థల జాబితాలో ఏడు వర్ధమాన దేశాలే చోటు సంపాదించుకోనున్నాయని.. దీర్ఘకాలిక జీడీపీ ర్యాంకింగ్ నివేదిక విశ్లేషించింది. 2020 నాటికే మేటి కొనుగోలు శక్తి తత్సమానమైన మారకపు విలువల దన్నుతో చైనా ఆర్థిక వ్యవస్థ ప్రపంచంలోనే నెంబర్ వన్‌గా ఆవిష్కరించబడనుందని నివేదిక తెలిపింది. ఇదే సమయంలో భారత వృద్ధి రేటు 7.8 శాతానికి పెరిగే అవకాశం ఉందని ఈ నివేదిక వెల్లడించింది. అదే మాదిరిగా 2030 నాటికి భారత్, అగ్రరాజ్యం అమెరికాను వెనక్కి నెట్టి ప్రపంచంలోనే రెండో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మారనుందని ఈ నివేదిక విశ్లేషించింది. భారత్ చైనా దేశాల వృద్ధి రేటుకు సంబంధించి 2013లో వెల్లడించిన అంచనాలను స్టాండర్డ్ చార్టర్స్ బ్యాంక్ సవరించింది. భారత్‌లో సంస్కరణల పర్వం వేగం పెరగడం, వస్తుసేవల పన్ను, భారత దివాలా చట్టం వంటి సంస్కరణల కారణంగా భారత్ 7.8 శాతం వృద్ధిని అందిపుచ్చుకొనే అవకాశం ఉన్నట్టుగా బ్యాంక్ అంచనా కట్టింది. దామాషా ప్రకారం అప్పటికి పెరగనున్న కరెన్సీ విలువ ప్రకారం 2030 నాటికి చైనా 64.2 ట్రిలియన్ డాలర్ల జీడీపీతో ప్రపంచంలోనే మేటి ఆర్థిక వ్యవస్థగా అవతరించనుండగా.. ఆ తరువాత తొమ్మిది స్థానాల్లో వరుసగా భారత్ (46.3 ట్రిలియన్ డాలర్లు), అమెరికా (31.01), ఇండోనేషియా (10.1), టర్కీ (9.01), బ్రెజిల్ (8.6), ఈజిప్ట్ (8.2), రష్యా (7.9), జపాన్ (7.2), జర్మనీలు (6.9) నిలువనున్నట్టుగా నివేదిక తెలిపింది. రానున్న రోజుల్లో ప్రపంచ వృద్ధిలో ఆసియా దేశాలే ప్రముఖ పాత్ర పోషించనున్నట్టుగా స్టాండర్డ్ చార్టర్డ్ తెలిపింది. మొత్తం ప్రపంచ జీడీపీలో ఆసియా వాటా 20 శాతంగా ఉండగా.. 2020 నాటికి ఇది 28 శాతానికి చేరొచ్చని వివరించింది. దీనికి కొనసాగింపుగా 2030 నాటికి ప్రపంచ



జీడీపీలో ఆసియా వాటా 35 శాతానికి చేరొచ్చని అంచనా కట్టింది.

10 కోట్ల ఉద్యోగాలను సృష్టించాలి..

పెరుగుతున్న ఆయుర్దాయం కారణంగా ప్రపంచంలోని అన్ని ప్రధాన ఆర్థిక వ్యవస్థలు రానున్న రోజుల్లో పెద్ద వయస్కుల సమస్యను ఎదుర్కోవచ్చని నివేదిక వివరించింది. అయితే భారత్‌లో మాత్రం ఇందుకు భిన్నంగా అత్యధిక యువ జనాభాతో రాణించనుందని తెలిపింది. రానున్న రోజుల్లో సంగం వరకు భారత జనాభా 25 ఏండ్ల వయస్సు వారే ఉండనున్నారని నివేదిక తెలిపింది. యువతలో పెరుగుతోన్న ఆకాంక్షల కారణంగా భారత్‌లో వినియోగదారులవాదం మరింతగా విస్తరించనుందని.. ఇది ఆర్థిక వ్యవస్థకు మేలు చేయనుందని స్టాండర్డ్ చార్టర్డ్ తెలిపింది. అయితే ఇదే సమయంలో యువత నుంచి భారీ స్థాయిలో ఉపాధి కోసం డిమాండ్ ఏర్పడనుందని.. దీనిని తట్టుకొనేందుకు గాను భారత్ 2030 నాటికి తయారీ, సేవల రంగంలో 10 కోట్ల ఉద్యోగాలను సృష్టించాల్సి ఉంటుందని తెలిపింది. దీనిని అందుకొనేందుకు గాను ప్రభుత్వ పెద్ద ఎత్తున్న నైపుణ్యత లోపాలను సరిదిద్దే కార్యక్రమాలను చేపట్టాలని, శ్రమశక్తిలో మహిళల ప్రాతినిధ్యాన్ని పెంచడంతో పాటు కార్మిక చట్టాలను మరింతగా సరళీకరించాల్సి ఉంటుందని నివేదిక సూచించింది. రానున్న రోజుల్లో భారత్ సంవత్సరానికి కోటి మందికి శిక్షణనివ్వాల్సి ఉంటుందని, అయితే ప్రస్తుతం ఆ దేశం కేవలం 45 లక్షల వరకు మాత్రమే శిక్షణనిచ్చే స్థాయిలో ఉన్నట్టుగా తెలిపింది. దేశంలో పెరుగుతోన్న ఆర్థిక అసమానతలను తగ్గించేందుకు, మౌలిక రంగంలో వ్యయం మరింతగా పెరిగేందుకు గాను భారత ప్రభుత్వం మరిన్ని సంస్కరణలను చేపట్టాల్సిన అవశ్యకత ఎంతైనా ఉందని నివేదిక తెలిపింది.

మూడో అతిపెద్ద మార్కెట్‌గా..



ప్రపంచంలోనే భారత్ మూడో అతిపెద్ద వినియోగదారు మార్కెట్‌గా అవతరించనుందని వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ (డబ్ల్యుఈఎఫ్) అంచనా కట్టింది. 2030 నాటికి భారత్ మేటి వినియోగదారు డిమాండ్‌తో అమెరికా, చైనాల సరసన మూడో స్థానంలో నిలువనుందని డబ్ల్యుఈఎఫ్ తాజా నివేదికలో తెలిపింది. ప్రస్తుతం 1.5 లక్షల కోట్ల డాలర్లుగా ఉన్న భారత్ వినియోగదారు వ్యయం 2030 నాటికి 6 లక్షల కోట్ల డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మారనుంది తెలిపింది. 7.5 శాతం వార్షిక వృద్ధి రేటుతో భారత్ ప్రస్తుతం ఆరో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉందని డబ్ల్యుఈఎఫ్ తెలిపింది. 2030 భారత్‌కు దేశీయ ప్రయివేటు డిమాండ్ పెద్ద ఆసరాగా నిలువనుందని వివరించింది. దేశ జీడీపీలో దీని వాటా 60 శాతం వరకు ఉండనుందని గ్లోబల్ సంస్థ అభిప్రాయపడింది. 'ఫ్యూచర్ ఆఫ్ కంజప్షన్ ఇన్ ఫాస్ట్-గ్రోత్ కన్జ్యూమర్ మార్కెట్-ఇండియా' నివేదికలో డబ్ల్యుఈఎఫ్ తెలిపింది. ఈ వృద్ధి కారణంగా దాదాపు 2.5 కోట్ల మంది భారతీయులు పెదరికం నుంచి బయటపడే అవకాశం ఉందని డబ్ల్యుఈఎఫ్ విశ్లేషించింది.

విభజించు.. విక్రయించు..

- ఎయిరిండియాపై మోడీ ప్రభుత్వం కొత్త వ్యూహం

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగంలోని ఎయిరిండియా (ఏఐ) ఆస్తులను విభజించి విక్రయించడానికి కావాల్సిన ప్రణాళికలను మోడీ సర్కార్ వేగవంతం చేసినట్లు తెలుస్తోంది. వచ్చే ఆర్థిక సంవత్సరం (2019-20)లో ఎఐకి చెందిన రూ.7,000 కోట్ల ఆస్తులను విక్రయించనున్నట్లు ప్రభుత్వ ఉన్నతాధికారి ఒక్కరు వెల్లడించారు. ఏఐకి చెందిన అనుబంధ సంస్థల్లోని వాటాలను వచ్చే ఆర్థిక సంవత్సరం ద్వితీయార్థంలో ఉపసంహరించుకోవడానికి కసరత్తు జరుగుతుందన్నారు. ఎఐ ప్రస్తుతం రూ.55,000 కోట్ల అప్పుల్లో ఉంది. గతంలో రెండుసార్లు ఆస్తుల విక్రయానికి సిద్ధమై విఫలమైన విషయం తెలిసిందే. ఇందులోని 76 శాతం వాటాను విక్రయించడం ద్వారా ప్రయివేటు కంపెనీలకు దీన్ని కట్టబెట్టాలని ఆ సమయంలో ప్రయత్నించారు. కాగా ఇప్పటికే ముంబయిలోని ఎయిర్‌లైన్స్ హౌస్, ఢిల్లీ, వసంత్‌విహార్, బాబా ఖరక్‌సింగ్



మార్గ్, కన్నాట్ ప్రాంతాల్లోని ఆస్తులను విక్రయించడానికి మంత్రివర్గ ఉపసంఘం ఆమోదం తెలిపింది. అదే విధంగా దేశవ్యాప్తంగా 70 నివాస, వాణిజ్య స్థలాల విక్రయం ద్వారా రూ. 700-800 కోట్ల సమీకరించేందుకు ఏఐ యోచనగా ఉంది. తొలుత ఎయిరిండియాకు చెందిన సబ్సీడరీ ఎయిరిండియా ఎయిర్ ట్రాన్స్‌పోర్టు సర్వీసెస్ లిమిటెడ్ (ఏఐఏటీఎస్ఎల్)లో వాటా విక్రయానికి పెట్టనున్నట్లు తెలుస్తోంది. ఏఐఏటీఎస్ఎల్‌లో 100 శాతం వాటాలను ఉపసంహరించుకోవాలని మంత్రుల బృందం నిర్ణయం తీసుకుంది. 2016-17లో ఈ సబ్సీడరీ రూ.61.66 కోట్ల లాభాలు సాధించింది. కాగా ఎయిరిండియాకు పునర్వైభవం కల్పిస్తామని డిసెంబర్ 27న పౌర విమానయాన మంత్రిత్వ శాఖ పార్లమెంట్‌కు తెలిపింది. ఈ ప్రకటనకు భిన్నంగా ఎఐలో వాటాల ఉపసంహరణను మళ్లీ తెరపైకి తేవడం గమనార్హం.

రూ.33వేల చేరువలో పసిడి..



న్యూఢిల్లీ : దేశంలో పెళ్లిళ్ల సీజన్ దగ్గర పడుతున్న నేపథ్యంలో బంగారానికి డిమాండ్ పెరుగుతోంది. దీంతో ముందు జాగ్రత్తగా అభరణాల వర్తకులు కొనుగోళ్లకు మొగ్గు చూపడంతో వరుసగా మూడు సెషన్‌లోనూ పసిడి ధర పెరిగి రూ.33వేల చేరువలో నమోదయ్యింది. అదే విధంగా పారిశ్రామిక వర్గాలు వెండి కొనుగోళ్లకు మొగ్గు చూపడంతో కిలో లోహం ధర రూ.40వేలకు చేరింది. బుధవారం న్యూఢిల్లీ బులియన్ మార్కెట్‌లో 99.9 శాతం, 99.5 శాతం స్వచ్ఛత కలిగిన 10 గ్రాముల బంగారంపై రూ.110 పెరిగి వరుసగా రూ.32,800, రూ.32,650కి ఎగిసింది. ఇంతక్రితం రెండు సెషన్లలో బంగారం ధర రూ.190 పెరిగింది. గ్లోబల్‌గా న్యూయార్క్ మార్కెట్‌లో ఒక్క ఔన్స్ పసిడి 0.26 శాతం తగ్గి 1,283.20 నమోదయ్యింది. పసిడి బాటలోనే కిలో వెండిపై రూ.300 ప్రియమై రూ.40,100గా పలికింది. 100 వెండి నాణేలపై రూ.1000 ప్రియమై రూ.77,000గా నమోదయ్యింది.

నిరుద్యోగ యువతకు సింగరేణి ఆసరా

- ఉచిత రెసిడెన్షియల్ తరహా శిక్షణకు సంసిద్ధం
- సీఎమ్‌డీ ఆదేశాలతో సేవా సమితి సన్నాహాలు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సింగరేణి ప్రాంతంలోని నిరుద్యోగులకు పెద్ద ఎత్తున ఉద్యోగ, ఉపాధి శిక్షణ కార్యక్రమాలు చేపట్టాలని సింగరేణి సేవా సమితి నిర్ణయించింది. ఈ క్రమంలో సంస్థ సీఎమ్‌డీ ఎన్.శ్రీధర్ ఆదేశాల మేరకు కార్యాచరణ రూపొందించి అమలు చేస్తున్నది. గతానికి భిన్నంగా ఈ ఏడాది ఉద్యోగావకాశాలు ఎక్కువగా ఉన్న కోర్సుల్లో నిరుద్యోగ యువతకు శిక్షణ ఇప్పించాలని నిర్ణయించింది. ఉచిత భోజన, వసతులు కల్పించాలని నిర్ణయించింది. సింగరేణి ప్రాంతంలోని యువత ఇష్టపడే వత్తికి సంబంధించిన శిక్షణలను ఇప్పించాలని సేవాసమితి నిర్ణయం తీసుకుంది. ఆర్మీ, పోలీసు రిక్రూట్మెంటు, హెవీమోటార్ వెహికల్ డ్రైవింగ్, సోలార్ పవర్ టెక్నాజీ, ఐ.టి., మెడికల్, నిర్మాణ విభాగాల్లో అందుబాటులో ఉన్న అనేక ఉద్యోగావకాశాలకు ఉచిత శిక్షణలు అందించాలని నిర్ణయించింది. హైద్రాబాద్ కేంద్రంగా పలు ప్రముఖ ప్రభుత్వ, ప్రయివేటు శిక్షణా సంస్థలతో సంప్రదించి, రెసిడెన్షియల్ తరహాలో నిరుద్యోగ యువతకు శిక్షణ ఇప్పించడానికి కార్యచరణ రూపొందించింది.

హకీంపేటలో...

హైదరాబాద్‌లోని హకీంపేటలో ఉన్న తెలంగాణా ఆర్టీసీ డ్రైవింగ్ శిక్షణ సంస్థలో రెసిడెన్షియల్ పద్ధతిలో సింగరేణి యువతకు శిక్షణ ఇప్పించడానికి రంగం సిద్ధం చేశారు. 40 రోజులపాటు ఇక్కడ హెవీ మోటార్ డ్రైవింగ్‌లో శిక్షణనిప్పిస్తారు. ఉచిత బోజన, వసతి సౌకర్యాలను కల్పిస్తూ శిక్షణిస్తారు. సింగరేణి ప్రాంతంలో గల కార్మికుల పిల్లలు, రిటైర్డు కార్మికుల పిల్లలతో పాటు ప్రాజెక్టు ప్రభావిత, భూములు కోల్పోయిన కుటుంబాలకు చెందిన యువత ఎవరైనా సరే ఈ శిక్షణకు అర్హులేనని సంస్థ తెలిపింది. కనీసం 8వ తరగతి చదివి లెర్నింగు లైసెన్సు కలిగున్న ప్రతి ఒక్కరూ దీనికి అర్హులేనని తెలిపింది. 18-35 సంవత్సరాల వయస్సు కలిగి డ్రైవింగును తమ వత్తిగా ఎంచుకోవటానికి ఆసక్తి చూపే యువకులు తమ దరఖాస్తులను సంబంధిత ఏరియా పర్సనల్ విభాగంలో వెంటనే అందజేయాలని సింగరేణి సేవా సమితి సూచించింది.

జీఎమ్ఆర్ వరలక్ష్మీ ఫౌండేషన్ ద్వారా...

విమానాశ్రమాలు, హైవేలువంటి మౌలిక సదుపాయాల నిర్మాణ సంస్థ అయిన జీఎమ్ఆర్ కంపెనీవారు వివిధ రకాల ఉపాధి అవకాశ శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. సింగరేణి సేవా సమితి అభ్యర్ధన మేరకు ఆ సంస్థ వారు సింగరేణి ప్రాంత నిరుద్యోగ యువతకు కూడా వివిధ రకాల ఉద్యోగావకాశ శిక్షణలు ఇవ్వడానికి అంగీకరించారు. వీటితోపాటు ఎస్సీ కార్పొరేషన్ కూడా 38 రకాల అంశాల్లో శిక్షణ నిస్తున్నది. ఆర్మీలో ఎంపికకు ఈ ఏడాది రెసిడెన్షియల్ తరహా శిక్షణ నిచ్చేందుకు కూడా సింగరేణి సేవా సమితి యోచిస్తున్నది. ఇలాంటి అంశాలన్నింటిపై సమగ్ర వివరాల కోసం సమితి సహాయకులు శివకుమార్‌ను (మొబైల్ 9440484894)ను సంప్రదించాలని ఆ సంస్థ ఉపాధ్యక్షులు ఆంథోనిరాజా ఒక ప్రకటనలో తెలిపారు.

బిల్లుపై భిన్న వాదనలు

అగ్రవర్ణ పేదలకు రిజర్వేషన్లపై రాజ్యసభలో చర్చ

- బీజేపీ తీరును తప్పుబట్టిన ప్రతిపక్షాలు

నవ తెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

అగ్రవర్ణ పేదలకు రిజర్వేషన్లపై రాజ్యసభలో భిన్న వాదనలు వెల్లడి అయ్యాయి. మంగళవారం లోక్‌సభ ఆమోదించిన ఆర్థికంగా వెనుకబడి వర్గాలకు పది శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ 124వ రాజ్యాంగ సవరణ బిల్లును బుధవారం కేంద్ర సామాజిక న్యాయ శాఖ మంత్రి థావర్ చంద్ గెహ్లాట్ రాజ్యసభలో ప్రవేశపెట్టారు. బిల్లును పూర్తిగా పరిశీలించాల్సిన అవసరం ఉన్నదని, బిల్లును పార్లమెంట్ సెలెక్ట్ కమిటీకి పంపాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేశాయి. కీలకమైన బిల్లుపై చర్చించేందుకు తగిన సమయం లేదని, ఇంత హడావిడిగా ప్రవేశపెట్టాల్సిన అవసరం ఏంటని ప్రశ్నించాయి. రాజకీయ లబ్ధికోసమే బీజేపీ ప్రభుత్వం ఇప్పుడు బిల్లును తీసుకువచ్చిందని ప్రతిపక్ష సభ్యులు పోడియం ముందు ఆందోళనకు దిగారు. బిల్లుపై చర్చించిన సీపీఐ(ఎం) సభ్యుడు టీకే రంగరాజన్, డీఎంకే ఎంపీ కనిమొళి పలు సవరణలు కోరారు. ఈ బిల్లుపై కేంద్ర మంత్రి గెహ్లాట్ మాట్లాడుతూ సామాజిక సమనత్వం కోసమే ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని అన్నారు. బిల్లును తాము తప్పు పట్టడం లేదని, కానీ హఠాత్తుగా ఎందుకు తెచ్చారన్నదే తమ ప్రశ్న అంటూ రంగరాజన్ బదులిచ్చారు. దాంతోపాటు, ఈ బిల్లు రాజ్యాంగంలోని ఆర్టికల్ 15, 16లకు వ్యతిరేకంగా ఉందని అన్నారు. అనంతరం, కాంగ్రెస్ పక్ష ఉపనేత ఆనంద్ శర్మ మాట్లాడుతూ మూడు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలు బీజేపీకి గుణపాఠం నేర్పాయని, కొద్ది



నెలల్లోనే సార్వత్రిక ఎన్నికలు జరగనున్న తరుణంలో బిల్లును హడావిడిగా తీసుకొచ్చారని ఎద్దేవా చేశారు. బీజేపీ మైండ్‌సెట్ మారాలన్నారు. రకరకాల టోపీలతో, వస్త్రధారణతో మోడీ బయట కనిపిస్తారని, కానీ సభలో మాత్రం ఉండరని వ్యంగ్యంగా అన్నారు. ఈబీసీల కోసం 2006లో కమిషన్ వేశామని, 2014లో మ్యానిఫెస్టోలో పెట్టామన్నారు. సాంఘిక, రాజకీయ సమాన అవకాశాలు కల్పించాలని ఆనాడే జవహర్ లాల్ నెహ్రూ చెప్పారని, స్వతంత్ర భారతంలో ప్రజలందరికీ భద్రత ఉండాలన్నారని ఆనంద్‌శర్మ గుర్తు చేశారు. మోడీ ఎన్నికల ముందు... అచ్ఛేదిన్ అన్నారని, ఆ అచ్ఛేదిన్ ఎప్పుడొస్తుందో దేశమంతా ఎదురుచూస్తున్నదని వ్యాఖ్యానించారు. రూ.8 లక్షల లోపు ఆదాయం ఉన్నవారికి రిజర్వేషన్లను వర్తింపజేస్తామంటున్నారని, మరి వార్షికాదాయం రూ.8లక్షలు లోపు ఉన్నవారి గణాంకాలు ప్రభుత్వం వద్ద ఉన్నాయా? అని ఆనంద్ శర్మ ప్రశ్నించారు. మోడీ హయాంలో దేశంలో మిలియన్ల ఉద్యోగాలకు కోతపడిందని ఆరోపించారు. ప్రభుత్వ రంగ సంస్థల్లో ఉద్యోగాలు ఏటికేడు తగ్గిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. పెద్ద నోట్ల రద్దు తర్వాత ప్రభుత్వ, ప్రయివేట్ రంగ ఉద్యోగాల్లో భారీగా కోతపడిందన్నారు. ఈ అంశంపై విస్తృతంగా చర్చ జరగాల్సిందేనని, లేకపోతే రాజ్యాంగపరంగా ఇబ్బందులు వస్తాయని అన్నారు. ప్రస్తుతం రిజర్వేషన్ల అమలు ఎలా ఉందని, ఆ ఫలాలు ఎలా అందుతున్నాయనే అంశంపై చర్చించాలన్నారు. ఒకరోజు ఆ సభలో, ఒకరోజు ఈ సభలో బిల్లు ఆమోదంతో ప్రయోజనం లేదన్నారు.

మూడేండ్ల కిందటే బిల్లు తేవాల్సింది: రాంగోపాల్ యాదవ్, ఎస్పీ

దేశంలో ఉద్యోగాల కల్పనే లేనప్పుడు రిజర్వేషన్లు ఇచ్చి ప్రయోజనమేంటని సమాజ్‌వాదీ పార్టీ ఎంపీ రాంగోపాల్ యాదవ్ అన్నారు. "దేశంలో ప్రజా ప్రయోజనాల వ్యాజ్యాల సంఖ్య పెరుగుతోంది. ఈబీసీ రిజర్వేషన్లపైనా చాలామంది సుప్రీం కోర్టుకు వెళ్లే అవకాశం ఉన్నది. ఇప్పటికే ఉన్న ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ రిజర్వేషన్లనే సక్రమంగా అమలుచేయడంలేదు. ఏ స్థాయిలో ఉద్యోగ నియామకాలు చూసినా సామాజిక సమతూకం లేదు.

సెలెక్ట్ కమిటీకి పంపాలి: ఎలమరం కరీం, సీపీఐ(ఎం)

బిల్లును సెలెక్ట్ కమిటీకి పంపాలని సీపీఐ(ఎం) ఎంపీ ఎల్లమరం కరీం డిమాండ్ చేశారు. ఈ బిల్లు ఎన్నికల స్టంటేనని ఆయన అభిప్రాయపడ్డారు. ఆర్థికంగా వెనుకబడిన పేదలకు రిజర్వేషన్లను కల్పించడం పేరుతో మరొక కొత్త నాటకానికి మోడీ సర్కార్ తెరలేపిందని విమ ర్శించారు. ఇటీవల ఎన్నికలు జరిగిన రాష్ట్రాల్లో ఓటమి చెందిన తర్వాతే, మోడీ సర్కారు అగ్రవర్ణ పేదలపై మొసలీ కన్నీరు కారుస్తుందని ఎద్దేవా చేశారు. మండల్ కమిషన్‌ను పూర్తిగా వ్యతిరేకించిన బీజేపీ, ప్రస్తుతం రిజర్వేషన్ల గురించి మాట్లాడటం ఓట్ల రాజకీయం తప్ప మరొకటి కాదని తెలిపారు. జనరల్ క్యాటగిరీలో ఉన్నటువంటి పేదలకు 10 రిజర్వేషన్లను ఇవ్వడంలో తమకు ఎటువంటి అభ్యంతరం లేదని, తాము మండల్ కమిషన్ ఇచ్చిన సిఫారసులను మద్దతు తెలిపామని గుర్తు చేశారు. అయితే, ఆ బిల్లు సంబంధిత కమిటీల్లో చర్చ చేయకుండా వేగంగా అడుగులు వేయడం నిబంధనలకు విరుద్ధంగా ఉన్నదన్నారు. ఎవ్వరితో సంప్రదించకుండా ఇలాంటి నిర్ణయాలు చేయడాన్ని ప్రశ్నించారు. ఒక్కో నగరానికి ఒక్కో విధంగా ఆదాయ, వ్యయాలుంటాయని గుర్తు చేశారు. ఇటువంటి కీలకమైన విషయాలు ఎవరిని అడిగి నిర్ణయించారని కేంద్రాన్ని నిలదీశారు. దాంతోపాటు ఇదివరకే ఉన్నటువంటి ఎస్సీ, ఎస్టీ, ఒబిసి రిజర్వేషన్లను చిత్తశుద్ధితో ప్రభుత్వాలు అమలు చేయడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రయివేటీకరణ వల్ల ఆయా వర్గాలకు వచ్చే ఉద్యోగాలే రావడం లేదని, కొత్తగా రిజర్వేషన్లు కల్పించేవారికి ఏం ఇస్తారని ప్రశ్నించారు. సరళీకృత ఆర్థిక విధానాల కారణంగా దేశంలోని యువతకు ఉపాధికి గండి పడిందన్నారు.

31 నుంచి బడ్జెట్ సమావేశాలు షురూ!

- ఫిబ్రవరి 1న లోక్‌సభలో బడ్జెట్.. 13న ముగింపు

నవతెలంగాణ - న్యూఢిల్లీ బ్యూరో

పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు 31 నుంచి ఫిబ్రవరి 13 వరకు జరగనున్నాయి. కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ ఫిబ్రవరి 1న తాత్కాలిక బడ్జెట్‌ను లోక్‌సభలో ప్రవేశపెడతారు. పూర్తి స్థాయి బడ్జెట్‌ను మాత్రం ఎన్నికల అనంతరం ఏర్పాటయ్యే కొత్త ప్రభుత్వం ప్రవేశపెడుతుంది. బుధవారం పార్లమెంటరీ వ్యవహారాల క్యాబినెట్ కమిటీ (సీసీపీఏ) సమావేశమైంది. ఈ మేరకు పార్లమెంటు బడ్జెట్ సమావేశాలు జనవరి 31 నుంచి ఫిబ్రవరి 13 వరకూ నిర్వహించాలని నిర్ణయించింది. ప్రస్తుతం బీజేపీ సారథ్యంలోని ఎన్డీఏ ప్రభుత్వానికి సార్వత్రిక ఎన్నికల ముందు ఇదే చివరి బడ్జెట్ అవుతుంది. కాగా, 2014లో అప్పటి ఆర్థిక మంత్రి చిదంబరం తాత్కాలిక బడ్జెట్‌ను లోక్‌సభలో ప్రవేశపెట్టారు. ఎన్నికల అనంతరం బీజేపీ నేతృత్వంలో ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఆర్థిక మంత్రిగా పగ్గాలు చేపట్టిన జైట్లీ 2014 జూలైలో పూర్తి స్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు.

రాజ్యసభ పొడిగింపుపై ప్రతిపక్షాల ఆందోళన

రాజ్యసభను మరోరోజు పొడిగించడంపై ప్రతిపక్షాలు ఆందోళన వ్యక్తం చేశాయి. ముందస్తు సమాచారం లేకుండా సభను ఎలా పొడగిస్తారంటూ సభలో ఆందోళన చేపట్టారు. పొడిగింపుపై ఏకగ్రీవ తీర్మానం లేకుండా ఎలా కొనసాగిస్తారని కాంగ్రెస్ సీనియర్ నేత ఆనంద్ శర్మ ప్రశ్నించారు. రాజ్యసభలో ఇప్పటి వరకూ రాఫెల్ సహా తాము డిమాండ్ చేస్తున్న అంశాలపై ఇంతవరకూ చర్చ జరగలేదని అన్నారు. అయితే బీఏసీ సమావేశంలోనే రాజ్యసభ పొడిగింపుపై నిర్ణయం తీసుకున్నామని, ఈ సమావేశానికి చాలా మంది ప్రతిపక్ష సభ్యులు హాజరయ్యారని, డిప్యూటీ చైర్మెన్ హరివంశ్ నారాయణ్ సింగ్ స్పష్టం చేశారు. అగ్రవర్ణాల పేదలకు రిజర్వేషన్లు కల్పించేందుకు వీలు కల్పించే రాజ్యాంగ సవరణ బిల్లు, ముమ్మారు తలాక్ బిల్లు వంటి కీలక బిల్లులు ఆమోదం పొందాల్సి ఉన్నందునే సభను పొడిగించామని కేంద్ర మంత్రి విజయ్ గోయల్ చెప్పారు. సభ పొడిగించడాన్ని దేశం మొత్తం కోరుకుంటోందని ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ అన్నారు. ఇదే అంశంపై రాజ్యసభ ప్రారంభానికి ముందు ప్రతి పక్షాలన్ని భేటీ అయ్యాయి.

కేసీఆర్‌తో కలిసి'హోదా' తెస్తా

- రైతులకు పగలు 9 గంటలు ఉచిత విద్యుత్
- ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఎన్నికల భయం : జగన్



శ్రీకాకుళం : రాష్ట్ర రూపురేఖలను మార్చే ప్రత్యేక హోదా సాధించడంలో చంద్రబాబు విఫలమయ్యారని ప్రతిపక్ష నేత వైఎస్ జగన్ అన్నారు. తాను తెలంగాణా సీఎం కేసీఆర్‌తో కలిసి ప్రత్యేక హోదా సాధిస్తానని అన్నారు. రానున్న ఎన్నికల్లో తనకు రాష్ట్రంలో అధికారంతోపాటు ఎంపీ సీట్లన్నింటినీ గెలిపిస్తే ఇది సాధ్యమౌతుందని చెప్పారు. ఎన్నికలు సమీపిస్తుండటంతో ముఖ్యమంత్రి చంద్రబాబుకు భయం పట్టుకుందని అన్నారు. ప్రజా సంకల్పయాత్ర ముగింపు సందర్భంగా ఎన్‌డీటీవీకి ఇచ్చిన ఇంటర్వ్యూలో అన్నారు. శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం పాతబస్టాండ్ కూడలిలో వైసీపీ నాయకులు ఉమ్మారెడ్డి వెంక టేశ్వర్లు అధ్యక్షతన నిర్వహించిన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. తాము అధికారంలోకి వస్తే వ్యవస్థను ప్రక్షాళన చేస్తామని జగన్ అన్నారు. 13 జిల్లాల ఆంధ్రప్రదేశ్‌ను 25 జిల్లాల ఆంధ్రప్రదేశ్‌గా మారుస్తామని ప్రకటించారు. ఎన్నికలు వస్తుండటంతో పేదలకు కొత్త ఇండ్లు, రేషన్‌కార్డులు, పింఛన్లు అంటూ సీఎం చంద్రబాబు నాటకాలాడుతూ సినిమా చూపిస్తున్నారని విమర్శించారు. రెండు, మూడు నెలలుగా చంద్రబాబు నాయుడు రాష్ట్ర సమస్యల గురించి మాట్లాడటం లేదన్నారు. నాలుగున్నరేండ్లలో చంద్రబాబు ఏమి చేయకపోయినా ఏదో చేసినట్టు అనుకూల పత్రికలు, ఛానెళ్ల ద్వారా ప్రచారం చేసుకుంటున్నారని విమర్శించారు. తాము అధికారంలోకి వస్తే వ్యవస్థను ప్రక్షాళన చేస్తామని జగన్ అన్నారు. ప్రతి పార్లమెంట్ నియోజకవర్గాన్నీ ఒక జిల్లాగా మార్చి, జవాబుదారీతనం పెంచుతామన్నారు. కలెక్టర్ల వ్యవస్థను ప్రజలకు మరింత చేరువ చేస్తామని, ప్రతి గ్రామంలోనూ గ్రామ సచివాలయం ఏర్పాటు చేసి పదిమంది స్థానికులకు ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. పార్టీలకతీతంగా ప్రతి ఇంటికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు చేరేలా ప్రతి 50 కుటుంబాలకూ ఒక వలంటీర్‌ను నియమిస్తామన్నారు. వారికి నెలకు రూ.ఐదు వేల చొప్పున జీతం చెల్లిస్తామని ప్రకటించారు. నాలుగేండ్లూ ప్రత్యేక హోదాను చంద్రబాబు ఖూనీ చేశారని విమర్శించారు. అసెంబ్లీలో ప్రత్యేక హోదా కోసం పోరాడితే వెటకారంగా మాట్లాడారని, జైల్లో పెడతామన్నారని గుర్తు చేశారు.



బెంగలేని బెండ

మన రాష్ట్రంలో బెండ సుమారుగా 78949 హెక్టార్ల విస్తీర్ణంలో 1184239 టన్నుల ఉత్పత్తితో రైతులు సాగు చేస్తున్నారు. కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే బెండ పంటతో బోలెడు లాభం పొందవచ్చు. మరి బెండ పండించాలనుకునే రైతులు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో ఈ వారం కిసాన్‌లో తెలుసుకుందాం.



వాతావరణం : వేడి వాతావరణం అనుకూలం. అతి చల్లని వాతావరణం పంట పెరుగుదలకు అనుకూలం. అందువల్ల ఈ పంట వర్షాకాలం, వేసవి కాలంలో పండించడానికి అనువైనది.

నేలలు : సారవంతమైన తేలికపాటి నేలలు. మురుగు నీరు పోయే సౌకర్యం గల నల్లరేగడి నేలలు అనుకూలం.

విత్తే సమయం : వేసవి పంటగా జనవరి రెండో పక్షం నుండి ఫిబ్రవరి నెలాఖరు వరకు విత్తుకోవచ్చు.

విత్తన మోతాదు : ఎకరానికి 7నుంచి 8 కిలోలు, సంకర జాతి రకాలకు 2-2.5 కిలోల విత్తనం అవసరం.

రకాలు

పర్భని క్రాంతి : కొమ్మలు వేయకుండా బలంగా పెరిగే మొక్క. ఆకులు ముదురాకుపచ్చ రంగులో ఉంటాయి. ఎకరానికి 4 నుంచి 5 టన్నుల దిగుబడి వస్తుంది.

అర్క అనామిక : విత్తిన 55 రోజుల్లో కాపుకొస్తుంది. శంఖు రోగాన్ని కొంత మేరకు తట్టుకుంటుంది. కాయలు ముదురాకు పచ్చగా ఉండి మధ్యస్థంగా ఉంటాయి. ఎకరానికి 4 నుంచి 5 టన్నుల దిగుబడి వస్తుంది.

అర్క అభయ : అర్క అనామిక రకాన్ని పోలి ఉండి, శంఖు రోగాన్ని బాగా తట్టుకుంటుంది. ఎకరానికి 5 టన్నుల వరకు దిగుబడి వస్తుంది. పై రకాలన్నీ 85 నుంచి 90 రోజుల పంట కాలాన్ని కలిగి ఉంటాయి. సంకర జాతి కోవకు చెందిన వర్ష, విజయ్, విశాల్, నాథ్‌శోభ, మహికో హైబ్రీడ్ నెం. 10, 64 ప్రియ, అవంతిక, సుప్రియ, ఐశ్వర్య, మిస్టిక్, యుఎస్ 7109, తులసి రకాలు ఎగుమతికి అనువైనవి. పంజాబ్ పద్మిని, వర్ష విశాల్, నాథ్‌శోభ రకాలను కూడా సాగు చేసుకోవచ్చు.

విత్తనం - విత్తే పద్ధతి : నేలను నాలుగైదుసార్లు బాగా దున్నాలి. వర్షాకాలపు పంటను 60 సెం.మీ ఎడంతో బోదెల మీద 30 సెం.మీ దూరంలో విత్తుకోవాలి. వేసవి కాలపు పంటను, నేలను మళ్లుగా చేసి వరుసల మధ్య 45 సెం.మీ మొక్కల మధ్య 15 నుంచి 20 సెం.మీ దూరం ఉండేటట్టు విత్తుకోవాలి. విత్తిన వెంటనే నీరుపెట్టి తర్వాత నాలుగైదు రోజులకు రెండో తడి ఇవ్వాలి. పాదుకు ఒక మొక్క ఉంచి మిగిలినవి తీసేయాలి.

విత్తనశుద్ధి : కిలో విత్తనానికి 5 గ్రా. ఇమిడాక్లోప్రిడ్‌తో తర్వాత 4 గ్రా. ట్రైకోడెర్మా విరిడితో కలిపి విత్తనశుద్ధి చేయాలి.

ఎరువులు : చివరి దుక్కిలో ఎకరానికి 6 నుంచి 8 టన్నుల పశువుల ఎరువును వేసి బాగా కలియదున్నాలి. 24 కిలోల భాస్వరం, పొటాష్‌నిచ్చే ఎరువులను కూడా ఆఖరి దుక్కిలో వేయాలి. 48 కిలోలనిచ్చే నత్రజని ఎరువును మూడు సమభాగాలుగా చేసి 1/3వ వంతు ఆఖరి దుక్కిలో, మిగిలిన 2/3వ వంతును రెండు భాగాలుగా విత్తిన 30, 45వ రోజు వేయాలి. సంకర జాతి రకాలకు ఎరువుల మోతాదు సుమారు 50 శాతం పెంచి వేయాలి.

కలుపు నివారణ - అంతర కృషి : పెండిమిథాలిన్ 30 శాతం ఎకరానికి 1.2 లీ. చొప్పున విత్తిన వెంటనే గాని మరుసటి రోజుగాని పిచికారి చేయాలి. విత్తిన 25 నుంచి 30 రోజులప్పుడు గొర్రు లేదా గుంటకతో అంతరకృషి చేయాలి. వర్షాకాలంలో మట్టిన ఎగదోసి బోదెలు సరిచేయాలి. పంట పూత దశలో లీటరు నీటికి 10గ్రా. యూరియా కలిపి పిచికారి చేయడం ద్వారా 20 నుంచి 25 శాతం నత్రజని ఆదాతోపాటు అధిక దిగుబడి సాధించవచ్చు. అదే విధంగా లీటరు నీటికి 5 మి.గ్రా సూక్ష్మపోషక పదార్థాల మిశ్రమాన్ని కలిపి పిచికారి చేయడం ద్వారా కూడా అధిక దిగుబడి సాధ్యం.

నీటి యాజమాన్యం : వేసవి కాలం పంట గనుక వర్షాలుండనందున వారానికోసారి నీరు పెట్టినా సరిపోతుంది.

సస్యరక్షణ - పురుగులు :

మొవ్వు, కాయతొలుచు పురుగు : ఈ పురుగు విత్తిన 30 రోజుల నుండి కోతదశ వరకు ఆశిస్తుంది. మొక్క పెరుగుదల దశలో మొవ్వును, పూత, కాతదశలో కాయలను తొలిచి నష్టం కలిగిస్తుంది. దీని నివారణకు పురుగు ఆశించిన కొమ్మలను పురుగు ఆశించిన ప్రాంతం నుండి ఒక అంగుళం కిందికి తుంచి నాశనం చేయాలి. లీటరు నీటికి కార్బరిల్ 3 గ్రా. లేదా క్వినాఫాస్ లేదా ప్రొఫెనోఫాస్ 2 మి.లీ కలిపి 10 రోజుల వ్యవధిలో రెండుసార్లు, కాయలు కోసిన తర్వాత పిచికారి చేయాలి. పంట కాపుకు రాని దశలో థయోడికార్బ్ 1 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

దీపపు పురుగులు : ఆకుపచ్చ రంగులో ఉండే చిన్న, పెద్ద పురుగులు ఆకుల అడుగు భాగన చేరి రసాన్ని పీల్చి పంటకు నష్టం కలుగచేస్తాయి. ఆకులు పైకి దోనె మాదిరిగా ముడుచుకొనిపోయి, పండుబారి రాలిపోతాయి. వీటి నివారణకు లీటరు నీటికి మిథైల్ డెమెటాస్ 2 మి.లీ లేదా డైమిథోయేట్ 2 మి.లీ లేదా ఫిప్రోనిల్ 2 మి.లీ కలిపి పిచికారి చేయాలి.

ఎర్రనల్లి : పంట చివరి దశలో చిన్న, సన్నని ఎర్ర పురుగులు ఆకులు అడుగు భాగాన చేరి, ఎక్కువ సంఖ్యలో రసాన్ని పీల్చి వేయడం వల్ల ఆకులు తెల్లగా పండుబారి రాలిపోతాయి. దీని నివారణకు లీటరు నీటికి నీటిలో కరిగే గంధకపు పొడి 3 గ్రా. లేదా డైకోఫాల్ 5 మి.లీ కలిపి పిచికారి చేయాలి.

తెల్లదోమ : పంటలో పూతకు ముందు చిన్న, పెద్ద పురుగుల ఆకుల అడుగు భాగాన చేరి రసాన్ని పీల్చివేయడం వల్ల ఆకులు పసుపు రంగులో మారుతాయి. ఇవి శంఖురోగాన్ని వ్యాప్తి చేస్తాయి. దీని నివారణకు లీటరు నీటికి డైమిథోయేట్ 2 మి.లీ కలిపి 10 రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారి చేయాలి. తీవ్రదశలో ఎసిఫేట్ 1.5 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. పొలంలో అక్కడక్కడ పపుసు రంగు డబ్బాలను గ్రీజుగానీ, ఆముదం గానీ పూసి తెల్లదోమలను ఆకర్షింపచేసి నాశనం చేయాలి.

తెగుళ్లు

బూడిద తెగులు : ఆకులపైన అడుగు భాగాన బూడిద వంటి పొడిచే కప్పబడి ఉంటాయి. తేమ తక్కువగా ఉండే పొడి వాతావరణంలో తెగులు తీవ్రత ఎక్కువగా ఉంటుంది. తెగులు ఉధృతి ఎక్కువైతే ఆకులు పచ్చబడి రాలిపోతాయి. దీని నివారణకు లీటరు నీటికి 3 గ్రా. నీటిలో కరిగే గంధకపు పొడిలేదా 1.మీ.లీ డైనోకాప్ లేదా 2 మి.లీ హెక్సాకోనజోల్ కలిపి పిచికారి చేయాలి.

శంఖు/పల్లాకు తెగులు (వైవిఎంవి): తెగులు సోకిన ఆకుల ఈనెలు పసుపు రంగుకు మారి కాయలు గిడసబారి, తెల్లగా మారిపోతాయి. దీని నివారణకు తెగులును తట్టుకునే అర్క అనామిక, అర్కఅభయ్ రకాలను విత్తుకోవాలి. లీటరు నీటికి 2 మి.లీ డైమిథోయేట్ లేదా 1.5 గ్రా. ఎసిఫేట్ కలిపి పిచికారి చేయడం ద్వారా తెగులను వ్యాప్తి చేసే తెల్లదోమను అరికట్టవచ్చు.

ఎండు తెగులు : గింజలు మొలకెత్తినప్పుడు మొదటి 15 రోజుల సమయంలోనే ఎండిపోయి, చనిపోతాయి. దీని నివారణకు విత్తనశుద్ధిలో చెప్పబడిన విధంగా విత్తనశుద్ధి చేయాలి. మొక్కల మొదళ్ల వద్ద కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రా.లీటరు నీటికి కలిపిన ద్రావణాన్ని పోయాలి. వేప పిండిని ఎకరానికి 100 కిలోల చొప్పున దుక్కిలో వేయాలి. పంట మార్పిడి పాటించాలి. వేసవి ప్రారంభంలో లోతు దుక్కులు చేయాలి. పచ్చిరొట్ట పైరును పెంచి భూమిలో కలియదున్నాలి.

పంటల వరుస క్రమం : బెండ- ఆలుగడ్డ- టమాట, బెండ-పాలకూర,-పుచ్చకాయ, బెండ-ముల్లంగి- కాలీఫ్లవర్- కీరదోస, బెండ-టమాట-తోటకూర, బెండ-ఆలుగడ్డ-సజ్జ క్రమంలో పంట మార్పిడి చేయాలి.

కోతకోయడం : విత్తిన 45 నుంచి 50 రోజులకు మొదటి కోతకొస్తుంది. తప్పనిసరిగా ప్రతి రెండుమూడు రోజులకోసారి కోతకోయాలి.

దిగుబడి : ఎకరానికి వేసవి పంట 2-2.3 టన్నుల దిగుబడి వస్తుంది.

బెండలో సమగ్ర సస్యరక్షణ : కిలో విత్తనానికి 5గ్రా.చొప్పున ఇమిడాక్లోప్రిడ్(గౌచ్) మందును వాడి విత్తనశుద్ధి చేయాలి. ఎకరానికి 100 కిలోల చొప్పున వేప పిండిని దుక్కిలో వేయాలి. కాయతొలుచు పురుగుల ఉనికిని గమనించేందుకు లింగాకర్షణ బుట్టలను ఎకరానికి నాలుగు చొప్పున అమర్చుకోవాలి. ఎకరానికి 20వేల చొప్పున ట్రైకోగ్రామా బదనికలను పూతదశలో వారానికి ఒకసారి చొప్పున నాలుగుసార్లు విడుదల చేయాలి. విడుదల సమయంలో పురుగు మందులు వాడరాదు. హెచ్‌ఎన్‌పివి,ఎస్ఎన్‌పివిని ఎకరానికి 250 లార్వాలకు సమానమైన ద్రావణం పిచికారి చేయాలి. రసం పీల్చే పురుగుల నివారణకు ఫాసలోన్,ఫిప్రోనిల్, డైమిథోయేట్ మందుల్లో ఏదైనా ఒక మందును లీటరు నీటికి 2 మి.లీ చొప్పున కలిపి పిచికారి చేయాలి. తెల్లదోమ నివారణకు 1.5 గ్రా.ఎసిఫేట్‌ను 1 లీ.నీటికి చొప్పున కలిపి పిచికారి చేయాలి. కాయతొలుచు పురుగుల నివారణకు కార్బరిల్ 3గ్రా. లేదా ప్రొఫెనోఫాస్ 2 మి.లీ ఒక లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

డాక్టర్. పిడిగం సైదయ్య
అసిస్టెంట్ ప్రొఫెసర్
శ్రీకొండా లక్ష్మణ్‌బాపూజీ హార్టికల్చర్ యూనివర్సిటీ
రాజేంద్రనగర్, హైదరాబాద్





వాతావరణంలో వస్తున్న మార్పులు, వర్షాలు లేకపోవడం, భూగర్భజలాలు అడుగంటిపోవడం, తెలంగాణలో బోరుబావులు ఎండిపోవడంతో రైతులకు సాగు భారమైంది. ఈ నేపథ్యంలో రైతులకు లాభాలనిచ్చే కొత్త పంటను వెలుగులోకి తీసుకొస్తున్నాం.

థాయ్‌లాండ్‌లో పుట్టి మహారాష్ట్రకు చేరుకున్న యాపిల్‌బెర్ 'తెలంగాణ యాపిల్' పంటను ఉద్యాన శాఖ పరిచయం చేస్తుంది. తక్కువ నీటి వసతి ఉండి, యాపిల్ కంటే అధిక పోషకాలు ఉండి, మార్కెట్ సౌకర్యం కలిగిన ఈ పంటతో రైతులు ఆర్థికంగా నిలదొక్కుకోవచ్చు. తెలంగాణలోని అన్ని జిల్లాల్లోనూ అనువైన పంట. ఒక్క సారి ఈ పంట వేస్తే 100 ఏండ్ల వరకు ఉంటుంది. కొమ్మలు కత్తిరించినా కొద్దీ ఎదిగే చెట్టు ఇది.

లాభాలు ఇచ్చే యాపిల్ బెర్

తెలంగాణలో ఈ పంటను పరిచయం చేస్తున్నందున 'తెలంగాణ యాపిల్' అనే పేరు పెట్టారు. ఈ పంటకు తక్కువ పెట్టుబడి తక్కువ శ్రమ, తక్కువ నీరు, రోగనిరోధక శక్తి అధికం, అధిక దిగుబడి, ఎక్కువ ఆదాయం వచ్చే ఈ పంటవైపు రైతులు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. యాపిల్ బెర్ పంట ఆశాజనకంగా ఉంటుంది. తక్కువ కాలంలో కాపుకు రావడమే కాకుండా పెట్టుబడి కూడా తక్కువే. ఈ పండ్లకు మార్కెట్‌లో మంచి గిరాకీ ఉండడంతో మహారాష్ట్రలో రైతులు ఆసక్తి చూపిస్తున్నారు. తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రంలో భారీ ఎత్తున ఈ పంటను సాగు చేయించేందుకు సన్నాహాలు చేస్తోంది. మెట్ట ప్రాంతంలోనూ సాగు చేసుకునేందుకు వీలుంటుంది. ఇతర పండ్లతో పోలిస్తే దిగబడి ఎక్కువగా వస్తుంది. కొత్త పంట కావడంతో చీడ, పీడల సమస్యలు కూడా తలెత్తడం లేదు.

స్థానికంగా రేగు అని పిలిచే పంట ఇది. ఉర్దూ పేరు బెర్. అలాగే గ్రీన్‌యాపిల్ కలర్ పోలి ఉంటాయి. అందుకే దీన్ని యాపిల్‌బెర్ అని అంటారు. అంటు నాటిన ఆరు నెలల్లో కాయ కోతకొస్తుంది. సంవత్సరంలో రెండు సార్లు కాపుకాస్తుంది. మొదటి సంవత్సరంలో ప్రతి చెట్టుకు 25కిలోల నుండి 30 కిలోల దిగుబడి వస్తే రెండో సంవత్సరంలో 40 నుండి 45 కిలోల దిగుబడి వస్తుంది. రేగు చెట్టుకున్నట్టు ముండ్లు కూడా ఉండవు. కాయల పరిమాణం పెద్దదిగా ఉంటుంది. కనుక తక్కువ సయంలోనే తోట నుండి కాయలు ఏరవచ్చు. సహజంగానే పరాగ సంపర్కం చెందుతుంది. కనుక ప్రత్యేకంగా ఆడ మొక్కలు, మగ మొక్కలను తోటలో సాగు చేయాల్సిన పని లేదు. స్వతహాగానే రేగు నీటి ఎద్దడిని తట్టుకుంటుంది. చీడపీడల సమస్య ఉండదు. కాయలను కూడా ఎక్కువ రోజులు నిల్వచేసుకోవచ్చు.

సాగు : ఒక ఎకరానికి 200 చెట్లు సాగు చేసుకోవచ్చు. మేలైన యాజమాన్య పద్ధతులు ఆచరిస్తే 100 సంవత్సరాల వరకు మంచి దిగుబడులు వస్తాయి. ఎరువులు, ఇతర సాగు విషయాలు రేగు తోటల మాదిరిగానే పాటించవచ్చు.

ఉద్యాన శాఖ ప్రోత్సాహం - రాయితీ

ఇప్పటికే ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో తెలంగాణలో ప్రయోగాత్మకంగా చేపట్టారు. తెలంగాణలో ఉండే వాతావరణాన్ని కూడా తట్టుకుంటుంది. రాష్ట్రంలో భారీ ఎత్తున ప్రోత్సహించేందుకు సబ్సిడీ ఇవ్వడానికి కూడా ప్రభుత్వం ముందుకొచ్చింది. ప్రస్తుతం 50 ఎకరాల్లో ఉన్న ఈ సాగు విస్తీర్ణం వెయ్యి ఎకరాలకు పెంచాలని నిర్ణయించారు. కలకత్త నుండి 3వేల యాపిల్ బెర్ అంట్లను తెప్పిస్తున్నారు. ఎకరానికి రూ.20వేల పెట్టుబడి అవుతుందని ఉద్యాన శాఖ అంచనా వేసింది. తొలుత 35శాతం (రూ. 7వేలు) సబ్సిడీ, రెండో సంవత్సరం, మూడో సంవత్సరం20 శాతం సబ్సిడీ ఇవ్వాలని సూత్రప్రాయంగా నిర్ణయం తీసుకున్నారు. సాంకేతిక కమిటీతో త్వరలో సమావేశమై యూనిట్ ధర రూ. 20వేలు ఉండే విధంగా నిర్ణయం తీసుకోబోతున్నారు. మహబూబ్‌నగర్, నల్లగొండ, మెదక్, ఆదిలాబాద్ జిల్లాలో ఉన్న అపారంగా ఉన్న మెట్ట ప్రాంతాల్లో, వర్షాధార ప్రాంతాల్లో యాపిల్‌బెర్ సాగు చేసుకోవచ్చు. పంట పెట్టుబడి తక్కువే, బిందు, తుంపర సేద్యాలు వాడితే దిగుబడులు ఇంకా పెరిగే అవకాశం ఉంది. నీటి ఎద్దడిని తట్టుకుంటుంది.

మొక్కల లభ్యం



ప్రస్తుతానికి ప్రభుత్వ సంస్థలు, విశ్వవిద్యాలయాల నుండి అందుబాటులో లేవు. ప్రైవేటు నర్సరీల నుంచి కొనుగోలు చేసుకోవచ్చు. రోగాలు లేని మంచి వృద్ధి, పెరుగుదల ఉన్న మొక్కలను ఎంపిక చేసుకోవాలి. అంటు మొత్తం భూమిలో ఉండే విధంగా నాటుకోవాలి. వచ్చే ఏడాది వరకు రూ. 16 ఒక మొక్క అందించాలని ఉద్యాన శాఖ ప్రయత్నిస్తుంది.

సాగు ఖర్చులు : ఒక్క మొక్కకు ప్రస్తుతం రూ. 60 అవుతుంది. ఎకరానికి 200 మొక్కలు అవసరం. రూ. 12వేల రూపాయలు అవుతుంది. ఎరువులు, కలుపు, యాజమాన్యం కలుపుకొని మొత్తం రూ. 25వేల వరకు ఖర్చవుతుంది. ఎకరానికి 4 టన్నుల దిగుబడి వస్తుంది. ప్రసుత్తం మార్కెట్‌లో కిలో రూ. 40వరకు పలుకుతుంది. ఈ లెక్క ప్రకారం లక్షా 60వేల ఆదాయం వస్తుంది. పెట్టుబడి ఖర్చులు పోనూ ఎకరానికి లక్ష చొప్పున ఆదాయం వస్తుంది.

యాపిల్ రేగు సాగు వివరాలు

మొక్కల మధ్య దూరం 15×15 అడుగులు. వేసవి కాలంలో గుంతలు తయారు చేసుకోవాలి. 1ఇంటు1 అడుగు గుంతల పరిమాణం ఉండాలి. రసాయన, సేంద్రియ ఎరువులతో ఈ మొక్కల గుంతలు నింపాలి. మొక్కలు నాటిన మొదటి మూడు నెలల తర్వాత 50గ్రా.ఫాస్పేట్, 50 గ్రా. పొటాష్150గ్రా. నత్రజని అందించాలి. మళ్లీ మూడు నెలల తర్వాత అదే మోతాదు ఎరువులో మరో దఫా అందించాలి. మరో మూడు నెలల తర్వాత ఎకరానికి రెండు కిలోల సూక్ష్మధాతు పోషకాలు, అందిస్తే రేగు కాయల రంగు, నాణ్యత పెరుగుదల బాగుంటుంది. అలాగే డ్రిప్ సౌకర్యం కల్పిస్తే దిగుబడులు ఇంకా పెరుగుతాయి. 15రోజులకొకసారి కలుపు నివారణ చర్యలు చేపట్టాలి.

చీడపీడలు

యాపిల్ రేగును ప్రధానంగా ఆశించి నష్టపరిచేవి పండుఈగ, దాసరి పురుగులు. ఇవి ఆశించకుండా ఉండేందుకు ముందుగా తోటలను పరిశుభ్రంగా ఉంచాలి. ఈగ ఆశిస్తే ఒక లీటరు నీటికి మలాథియాన్ 1మి.లీ లేదా కార్బరిల్ 3గ్రా. లేదా 5శాతం వేపగింజల కషాయం మొదటి దశగా గోలికాయ దశలో రెండో విడత 15 రోజుల తర్వాత కాయ పక్వానికి వచ్చిన తర్వాత మూడో దఫా పిచికారి చేయాలి. గొంగళిపురుగులు, పత్రహరితాన్ని గోకి తింటాయి. క్వినాల్‌ఫాస్ 2 మి.లీ లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. సాగులో ప్రధానమైంది కొమ్మల కత్తిరింపు చర్యలు. వేరు మూలంపై వచ్చే బిగుళ్లను ఎప్పటికప్పుడు కత్తిరించాలి. ఒక మీటరు పెరిగిన తర్వాత నాలుగైదు కొమ్మలు నాలుగు వైపులా పెరిగేటట్లు చూడాలి. మార్చి, ఏప్రిల్ నెలల్లో కత్తిరించాలి. కత్తిరించే ముందు 10గ్రా. పొటాషియం నైట్రేట్ లీటరు నీటిలో కలిపి పిచికారి చేస్తే అంట్లు త్వరగా చిగురిస్తాయి. రెండో సంవత్సరం నుంచి రెట్టింపు ఎరువులు ఇవ్వాలి. దోర రంగులో ఉన్నప్పుడే కాయలు కోయాలి. 8నుంచి 10 రోజుల్లో పూర్తిగా పండురంగులో వస్తాయి. రవాణకు అనుకూలంగా ఉంటాయి. పూత తర్వాత రెండు నెలల్లో మళ్లీ కాపుకొస్తుంది.

పంటలు- పాటించాల్సిన పద్ధతులు

వ్యవసాయం - వాతావరణం

గడిచిన మూడు రోజులలో రాష్ట్రంలో వాతావరణం పొడిగా ఉంది. పగటి ఉష్ణోగ్రతలు 27 నుంచి 33 డిగ్రీల సెల్సియస్, రాత్రి ఉష్ణోగ్రతలు 08 నుంచి 19 డిగ్రీల సెల్సీయస్‌గా నమోదయ్యాయి. హైదరాబాద్ వాతావరణ కేంద్రం అందించిన సమాచారం ప్రకారం రాబోయే ఐదు రోజుల్లో రాష్ట్రంలో వాతారణం పొడిగా ఉండవచ్చు. పగటి ఉష్ణోగ్రతలు 28 నుంచి 33 డిగ్రీల సెల్సీయస్ మధ్య, రాత్రి ఉష్ణోగ్రతలు 12 నుంచి 18 డిగ్రీల సెల్సియస్ మధ్య నమోదుకావచ్చు.

వరి: తెలంగాణలో రాత్రి ఉష్ణోగ్రతలు తక్కువగా నమోదైనట్టయితే వరి నారుమడిలో చలి ప్రభావం తగ్గించి నారు ఎదుగుదలకు పాలిథీన్ షీట్లతో నారుమడిని రాత్రిపూట కప్పి ఉదయం వేళల్లో తీసేయాలి. ప్రతి రోజు సాయంత్రం నారుమడికి నీరు పెట్టాలి. ఉదయం నీటిని తీసేయాలి. ఎకరం పొలానికి సరిపడే నారుమడికి 2 కిలోల యూరియా పైపాటుగా నారు విత్తిన 10నుంచి 15 రోజుల్లో చల్లాలి. వరిలో నారుమడులలో కార్బోఫ్యూరాన్ 3జి గుళికలను 200 చ.మీ నారు మడికి (5సెంట్లకు) ఒక కిలో చొప్పున నారు పీకడానికి వారం రోజుల ముందు చల్లుకోవాలి.

కంది: కందిలో మారుక మచ్చల పురుగు, శనగపచ్చ పురుగు గమనించడమైంది. నివారణకు మారుక మచ్చల పురుగు 2.5 మి.లీ క్లోరిపైరిఫాస్ లేదా 0.75 మి.లీ. నోవాల్యూరాన్‌తో పాటు 1.0 మి.లీ డైక్లోరోవాస్ మందును లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. శనగపచ్చ పురుగు నివారణకు ఈ కింది యాజమాన్య పద్ధతులను పాటించాలి. శనగపచ్చ పురుగు లార్వాలను తినేందుకు వీలుగా ఎకరానికి 10 నుంచి 15 పక్షి స్థావరాలను ఏర్పాటు చేయాలి. పురుగుల ఉనికిని గమనించేందుకు ఎకరానికి 4 లింగాకర్షక బుట్టలను అమర్చాలి. పురుగు, గుడ్లు, తొలిదశ లార్వాల నివారణకు 5 శాతం వేపగింజల కషాయాన్ని పిచికారి చేయాలి.

మొక్కజొన్న: రబీ మొక్కజొన్నలో కత్తెర పురుగు ఆశించినట్టు గమనించడమైంది. నివారణకు విషపు ఎర తయారు చేసుకోవడానికి గాను 10 కిలోల వరి తవుడులో 2 కిలోల బెల్లంను కలిపి 2నుంచి 3 లీ. నీటిని చేర్చి సుమారు 12 గంటల పాటు పులియనిచ్చి మరుసటి రోజు 100గ్రా. థైడికార్బ్‌ను కలుపుకొని ఈ మిశ్రమాన్ని చిన్నచిన్న ఉండలుగా చేసి మొక్క సుడులలో వేసుకోవాలి. ఎమమేక్టిన్ బెంజోయేట్ 0.4 గ్రా. లేదా థైమేమిథాక్సాన్ 9.5 శాతం, లాను సైహలోత్రిన్ 12 శాతం 0.5 మి.లీ లేదా క్లోరాన్‌ట్రినిలిప్రోల్ 0.3 మి.లీ లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలి. పైరు మొలిచిన 10 నుండి 15 రోజుల మధ్య మొవ్వు పురుగు ఆశించే అవకాశాలున్నాయి. నివారణకు క్లోరోపైరిఫాస్ 2.0 మి.లీ లేదా ఎసిఫేట్ 1.5 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. పైరు 25 నుంచి30 రోజుల దశలో కార్బోఫ్యూరాన్ 3జి గుళికలను ఎకరానికి 3నుంచి 4 కిలోల చొప్పున మొవ్వులో వేయాలి.

ద్రాక్ష: ప్రస్తుత వాతావరణ పరిస్థితులు ద్రాక్షలో పక్షికన్ను తెగులు ఆశించుటకు అనుకూలం. నివారణకు 3 గ్రా. ప్రొఫినెట్ మందును లీటరు నీటిలోకలిపి కత్తిరింపుల తరువాత 20 రోజులలోపు పిచికారి చేయాలి. ద్రాక్షలో పెంకు పురుగు గమనించడమైంది. నివారణకు 2.5 మి.లీ క్లోరి పైరాపాస్ మందును లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలి. ప్రస్తుత పొడి వాతావరణ పరిస్థితులు ద్రాక్షలో తామర పురుగులు ఆశించుటకు అనుకూలం. ఉధృతి గమనించి 2 మి.లీ ఫిప్రోనిల్ మందును లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలి.



మామిడి: ప్రస్తుత వాతావరణ పరిస్థితులు మామిడిలో తేనె మంచు పురుగులు ఆశించుటకు అనుకూలం. నివారణకు 1 మి.లీ డైక్లోరోవాస్, 2.5 మి.లీ వేపనూనె మందును లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

జామ: జామ పండులో ఈగ ఉధృతి గమనించడమైంది. నివారణకు ఎకరానికి 4నుంచి 5 లింగాకర్షక బుట్టలను తోటలో అమర్చాలి.

మిరప: మిరపలో తామర పురుగు, నల్లి ఉధృతి గమనించినట్టయితే నివారణకు 1.5 గ్రా. డిఫెన్‌థయూరాన్ లేదా 2 మి.లీ క్లోర్‌ఫినాపిర్ మందును లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. మిరపలో గుండు ఈగ ఆశించుటకు అనుకూలం. నివారణకు 1.5 మి.లీ ట్రైజోఫోస్ లేదా 2.5 మి.లీ క్లోరి పైరిఫాస్ మందును లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. ఫ్యుజేరియం ఎండు తెగులు సోకే సూచనలున్నాయి. నివారణకు 3 గ్రా. కాపర్‌ఆక్సిక్లోరైడ్ లేదా 1 గ్రా. కర్బెండజిమ్ మందును లీటరు నీటికి కలిపి మొక్క మొదళ్ల దగ్గర నేల తడిచే విధంగా పిచికారి చేయాలి. మిరపలో వైరస్ తెగులు ఉధృతి పెరిగే సూచనలున్నాయి. నివారణకు ఈ వైరస్ వ్యాప్తి వాహకాలైన రసం పీల్చే పురుగులను అదుపు చేయాలి.

కూరగాయలు: ప్రస్తుత పొడి వాతావరణ పరస్థితులలో రసం పీల్చే పురుగుల ఉధృతి పెరిగే సూచనలున్నాయి. నివారణకు ఫిప్రోనిల్ 2మి.లీ లేదా థయోమిథాక్సిమ్ 0.3 గ్రా. మందును లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. ప్రస్తుత వాతావరణ పరిస్థితులు టమాటలో ఆకుమాడు తెగులు సోకుటకు అనుకూలం. తెగులు నివారణకు 2.5 గ్రా. మ్యాంకోజెబ్ లేదా 1మి.లీ ప్రోపికొనజోల్ మందును లీటరు నీటిలో కలిపి 15 రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారి చేయాలి. ఆలస్యంగా నాటిన టమాట పైరులో శనగ పచ్చ పురుగు ఆశించుటకు అనుకూలం. నివారణకు 1.25 మి.లీ నోవాల్యూరాన్ మందును లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. టమాటలో తామర పురుగులు కూడా ఆశించేందుకు అనుకూలం. నివారణకు 2 మి.లీ డైమిథోయేట్ మందును లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

పశుపోషణ: కోళ్లలో కొక్కెర తెగులు, గొర్రెలలో చిటుకు, మశూచి వ్యాధి, ఆవులు, బర్రెలకు గొంతువాపు వ్యాధి, ఆవులు, ఆంబోతులలో జబ్బవాపు వ్యాధి సోకుటకు అనుకూలం. వీటి నివారణకు టీకాలు వేయించాలి.

సేకరణ : మోత్కూరు యాదయ్య



1971లో ఓవల్‌లో ఇంగ్లాండ్‌పై టెస్టు విజయం అనంతరం మైదానంలోకి ప్రవేశించి సంబురాలు చేసుకుంటున్న భారత అభిమానులు

చరిత్ర సృష్టించి.. మరిచారా?

- ఆసీస్‌లో సిరీస్ విజయం చారిత్రాత్మకమే
- కానీ ఇదే అతి పెద్ద విజయం కాదు!


'1983 వరల్డ్‌కప్ విజయాన్ని మించిన గెలుపు ఇది. 1986కు మించిన చిరస్మరణీయ ఏడాది ఇది'.. 71 ఏండ్ల సుదీర్ఘ నిరీక్షణ తర్వాత ఆస్ట్రేలియా గడ్డపై తొలి టెస్టు సిరీస్ విజయం సాధించిన అనంతరం టీమ్ ఇండియా చీఫ్ కోచ్ రవిశాస్త్రి చేసిన వ్యాఖ్యలివి. నిరుడు దక్షిణాఫ్రికా, ఇంగ్లాండ్ పర్యటనల్లో సిరీస్‌లో ఓడినప్పటికీ గత 15-20 ఏండ్లలో కోహ్లిసేననే అత్యుత్తమ భారత పర్యాటక జట్టని సెలవిచ్చిన శాస్త్రికి.. ఇంత గొప్ప విజయం తర్వాత ఇటువంటి వ్యాఖ్యలు సాధారణమే!. దారుణంగా ఓడినా, గొప్పగా ఆడామని కితాబు ఇచ్చుకునే తత్వం శాస్త్రికి కావచ్చు, కానీ నిజంగా ఇదే భారత క్రికెట్ చరిత్రలో అతి పెద్ద విజయమా?

నవతెలంగాణ క్రీడా విభాగం

2018లో విదేశీ గడ్డపై అవకాశాలు జారవిడుచుకున్న కోహ్లిసేన, కొత్త ఏడాదిని గొప్పగా ఆరంభించింది. ఆస్ట్రేలియాలో ఆసీస్‌పై తొలిసారి టెస్టు సిరీస్ నెగ్గి బోర్డర్-గవాస్కర్ ట్రోఫీని 2-1తో స్వదేశానికి తీసుకొస్తున్నారు. భారత్, ఆస్ట్రేలియా ద్వైపాక్షిక క్రికెట్ సంబంధాలు మొదలైన తర్వాత టీమ్ ఇండియా సాధించిన తొలి సిరీస్ విజయమిది. కేవలం భారత జట్టు మాత్రమే కాదు, ఈ 71 ఏండ్లలో మరే ఆసియా జట్టు సైతం (పాకిస్తాన్, శ్రీలంక, బంగ్లాదేశ్) కంగారూ గడ్డపై టెస్టు సిరీస్ విజయాన్ని రుచి చూడలేదు. ఆస్ట్రేలియా బలహీనంగా ఉన్న రోజుల్లో సైతం సొంతగడ్డపై కంగారూను ఓడించటంలో భారత్ సహా ఆసియా జట్లు విఫలమయ్యాయి. కానీ ఏ ఆసియా కెప్టెన్‌కు అందని రికార్డును విరాట్ కోహ్లి సాధించాడు. ఆస్ట్రేలియాను వారి గడ్డపైనే జయించి టెస్టు సిరీస్‌ను అందుకున్నాడు. ఇది కచ్చితంగా గొప్ప విజయమే. కానీ భారత క్రికెట్ చరిత్రలోనే ఇదే గొప్ప విజయమని చీఫ్ కోచ్ రవిశాస్త్రి అనటం అనవసర చర్చకు చోటిస్తోంది. చరిత్రలో నిలిచిపోయే విజయం అందుకున్న కోహ్లిసేనపై ప్రశంసల జల్లు కురిపించకుండా, వారికి చరిత్రను గుర్తు చేసే పని మొదలవ్వటం ఊహించని పరిణామమే!.

ఆధిపత్యానికి తొలి అడుగు! : 1977-78లో అత్యుత్తమ స్పిన్ బౌలర్లు భారత్ సొంతం. అదే సమయంలో ఆస్ట్రేలియా బ్యాటింగ్ లైనప్ ఎన్నడూ చూడనంత బలహీనంగా ఉన్నది. అయినా, అప్పుడు భారత జట్టు ఆస్ట్రేలియా సిరీస్ సాధించలేదు. 2003-04లో భారత్‌కు అత్యుత్తమ బ్యాటింగ్ లైనప్ ఉన్నది. మెల్‌బోర్న్ టెస్టుకు ఆస్ట్రేలియా మ్యాచ్ విన్నింగ్ పేసర్లు దూరమయ్యారు. కానీ అప్పుడూ భారత జట్టు కంగారూ నేలపై సిరీస్ విజయానికి చేరువ కాలేదు. కానీ ఈ సారి భారత్‌కు బెస్ట్ బ్యాటింగ్ లైనప్ లేదు. అత్యుత్తమ (ఆల్‌టైమ్) స్పిన్నర్లూ లేరు. ఉన్నదల్లా పదునైన పేసర్లు. అయితేనేం, కోహ్లిసేన చరిత్ర తిరగరాసింది. ఆడిలైడ్‌లో తొలి రోజు 41/4తో ఉక్కిరి బిక్కిరి అవుతూ మొదలైన బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ వేట సిడ్నీలో వర్షం నడుమ ముగిసింది. ఈ మధ్యలో రెండు జట్లకూ వ్యత్యాసంగా చతేశ్వర పుజార నిలిచాడు. సిరీస్‌లో 1258 బంతులు ఎదుర్కొన్న పుజార మూడు శతకాలు బాదాడు. ఆడిలైడ్ శతకం అదిరే బోణీ ఇవ్వగా, మెల్‌బోర్న్ సెంచరీ సిరీస్‌ను కోల్పోని స్థితిలో నిలిపింది. సిడ్నీ శతకం సైతం గెలుపు దిశగా తీసుకెళ్లినా, వరుణుడి అంతరాయం డ్రాకు తెరలేపింది. బాల్ టాంపరింగ్ వివాదంలో నిషేధంలో ఉన్న స్టీవ్ స్మిత్, డెవిడ్ వార్నర్‌లు ఉండి ఉంటే టెస్టు సిరీస్ మరోలా జరిగి ఉండేదని కొందరు అంటున్నారు. నిజమే, అదే నిజమైతే బలమైన భారత జట్లు గతంలో ఆస్ట్రేలియాకు వెళ్లినప్పుడు వారెన్నడూ సిరీస్ సాధించలేదు. ఇప్పుడూ అంతే. స్మిత్, వార్నర్ లేని లోటు నిజమే అయినా, కోహ్లిసేన జోరు చూస్తే వారున్నా ఫలితంలో మార్పు ఉండేది కాదు అనిపించటంలో పొరపాటు లేదు. క్రికెట్‌లోనే కాదు ఏ క్రీడలోనూ ఏదీ ఊరకే రాదు. ప్రతీ పరుగు కోసం పరుగెత్తాలి, ప్రతీ వికెట్ కోసం చెమటోడ్చాలి, ప్రతీ విజయం కోసం ప్రాణం పెట్టాలి. బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ అంతకుమించి అని చెప్పక తప్పదు. ఆస్ట్రేలియా గడ్డపై తొలి సిరీస్ సాధించిన కోహ్లిసేన వరల్డ్ నం.1గా ఆధిపత్యం చాటేందుకు తొలి అడుగు వేసిందనే చెప్పాలి.

మరువలేని చరిత్ర : 1983 వన్డే వరల్డ్‌కప్ విజయం భారత క్రికెట్‌లో ఓ మైలురాయి మాత్రమే కాదు గట్టి పునాది రాయి అని కూడా చెప్పాలి. ఏ మాత్రం అంచనాల్లేని పరిస్థితుల్లో అరివీర భయంకర విండీస్‌ను ఓడించిన కపిల్‌సేన ప్రపంచకప్‌ను ముద్దాడింది. క్రీడా భారత్ అనగానే క్రికెట్ గుర్తు రావటానికి ఏకైక కారణం 1983 ప్రపంచకప్ విజయమే. అందులో ఎటువంటి సందేహం లేదు. భారత్‌లో క్రికెట్‌ను పాపులర్ చేసినా, ప్రతి చిన్నారీ బ్యాట్ పట్టినా అందుకు కారణమూ కపిల్ సేన విజయమే. బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలు ఆస్ట్రేలియాలో ఇంకెన్ని సాధించినా అది 1983 ప్రపంచకప్ విజయంతో సరితూగదు. అలా పోల్చాలని చూస్తే అది యాపిల్‌ను, ఆరెంజ్‌ను పోలిక చేసిన చూసినట్టే అవుతుంది!.



1986లో ఆస్ట్రేలియాలో టెస్టు సిరీస్ డ్రా చేసుకున్న అనంతరం శివరామకృష్ణన్, సునీల్ గవాస్కర్, కృష్ణమాచారి శ్రీకాంత్

టెస్టు క్రికెట్ పరంగా భారత్‌కు 1971లో మధుర విజయాలున్నాయి. వెస్టిండీస్, ఇంగ్లాండ్‌లపై అప్పట్లోనే భారత జట్టు చారిత్రక విజయాలు సాధించింది. ఇప్పటికీ టీమ్ ఇండియా అత్యుత్తమ టెస్టు విజయాల్లో ఇవి తొలి వరుసలోనే ఉంటాయి. అయితే, 1986 విదేశాల్లో భారత జట్టును సమవుజ్జీగా నిలిపిన ఏడాది. ఈ ఏడాదిలోనే ఇంగ్లాండ్‌లో అదిరే టెస్టు సిరీస్ సాధించిన భారత్, కంగారూ గడ్డపై తృటిలో సిరీస్‌ను చేజార్చుకున్నది. ఇంగ్లాండ్‌లో వన్డే సిరీస్‌ను 1-1తో డ్రా చేసుకున్న భారత్, వరుసగా తొలి రెండు టెస్టుల్లో నెగ్గింది. పేసర్లు ఇంగ్లీష్ పరిస్థితుల్లో రెచ్చిపోగా, వెంగ్ సర్కార్ వరుస సెంచరీలతో చెలరేగాడు. ఇది జరిగిన కొన్ని నెలల తర్వాత ఆస్ట్రేలియాలోనూ భారత్ సిరీస్ నెగ్గే స్థితికి వచ్చింది. కానీ మెల్‌బోర్న్‌లో అలెన్ బోర్డర్ చివరి రెండు వికెట్లకు 103 పరుగులు జోడించటం, 126 పరుగుల ఛేదనలో భారత్ 59/2తో ఉండగా వరుణుడు రంగ ప్రవేశం చేయటం టీమ్ ఇండియాకు శరాఘాతంగా మారాయి. ఆ మెల్‌బోర్న్ టెస్టులో 8 వికెట్లు కూల్చిన ప్రస్తుత చీఫ్ కోచ్ రవిశాస్త్రి టాప్ బౌలర్‌గా నిలిచాడు. భారత క్రికెట్‌ను 1983 విజయం మార్చివేసినా..విదేశీ పర్యటనల్లో భారత్ సత్తా చాటింది, భారత పులుల పంజా పవర్ తెలిసొచ్చింది మాత్రం 1986లోనే. అందుకే 1983 విజయం తర్వాతి స్థానం 1986 టెస్టు విజయాలదే!. ఇక 2007 టీ20 ప్రపంచకప్, 2011 వన్డే వరల్డ్‌కప్ విజయాలు భారత క్రికెట్‌ను మరో స్థాయికి తీసుకెళ్లినా.. నాటి విజేతలు ఎన్నడూ 1983 విజయంతో పోల్చుకోలేదు. ఎందుకంటే 1983 విజయమే లేకుంటే అసలు భారత్‌లో క్రికెట్ స్థితిగతులు ఏ విధంగా ఉండేవో ఊహించజాలం. ఆ సంగతి వారికి తెలుసు!.

ఆధునిక క్రికెట్‌లో పరిమిత ఓవర్ల ఫార్మాట్‌లో భారత్ అన్ని చోట్లా ఇరగదీస్తోంది. అలవోకగా సిరీస్‌లు సాధిస్తోంది. కానీ టెస్టుల్లో అంత గొప్ప రికార్డు లేదు. 1970-71లో వెస్టిండీస్‌పై 1-0తో టెస్టు సిరీస్, 2007లో రాహుల్ సారథ్యంలో 1-0తో ఇంగ్లాండ్‌లో టెస్టు సిరీస్, 1971లో ఓవల్ విజయంతో ఇంగ్లాండ్‌లో తొలి సిరీస్ విజయం, 1986లో ఇంగ్లాండ్‌లోనే 2-0 విజయం, 2008-09లో ధోని సారథ్యంలో న్యూజిలాండ్‌పై 1-0 సిరీస్ విజయం, 2006లో వెస్టిండీస్‌పై 1-0 విజయం సహా పాకిస్తాన్‌లో 2003-04లో 2-1తో టెస్టు సిరీస్ విజయాలు విదేశాల్లో భారత్ సాధించిన గొప్ప ఘనతల కోవలోకే వస్తాయి. అండర్‌డాగ్స్‌గా 1971లో, 1986లో భారత జట్టు సాధించిన సిరీస్ విజయాలతో పోల్చితే వరల్డ్ నం.1 కోహ్లిసేన సాధించిన బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ పెద్ద విషయం కాదు. 71 ఏండ్ల నిరీక్షణకు తెరదించుతూ 2-1 విజయంతో చరిత్ర సృష్టించిన ఆనందంలో రవిశాస్త్రి చరిత్ర మరిచినట్టున్నాడు!. అందుకే 1983 ప్రపంచకప్‌ను మించిన విజయంగా అభివర్ణించాడు. భారత క్రికెట్‌లో ఏది గొప్ప విజయమనే విషయాన్ని అభిమానులు నిర్ణయిస్తారనే సంగతిని రవిశాస్త్రి ఇకనైనా తెలుసుకుంటే మంచిది!.



అగ్రస్థానంలోనే హైదరాబాద్

- సింధు నెగ్గినా, ఓడిన హంటర్స్
- ప్రీమియర్ బ్యాడ్మింటన్ లీగ్



బెంగళూర్ : ఉత్కంఠ మ్యాచ్‌లో మాజీ చాంపియన్ ఢిల్లీ డాషర్స్ 4-3తో నెగ్గినా, పాయింట్ల పట్టికలో హైదరాబాద్ హంటర్స్ అగ్రస్థానంలో కొనసాగుతోంది. గత ఆరు మ్యాచుల్లో తొలి గెలుపు సాధించిన ఢిల్లీ ఎట్టకేలకు ఊరట చెందింది. స్టార్ షట్లర్ పి.వి సింధు 15-11, 15-9తో ట్రంప్ మ్యాచ్‌లో నెగ్గి రెండు పాయింట్లు సాధించినా, హంటర్స్ నెగ్గలేదు. మెన్స్ సింగిల్స్‌లో హెచ్.ఎస్ ప్రణయ్ 15-10, 9-15, 15-12తో నెగ్గి ఢిల్లీకి శుభారంభం అందించాడు. తర్వాతి మ్యాచ్‌లో 8-15, 15-9, 15-8తో ట్రంప్ విజయం సాధించిన ఢిల్లీ 3-0తో నిలిచింది. కానీ సింధు నెగ్గటంతో హంటర్స్ 2-3తో రేసులోకి వచ్చింది. నిర్ణయాత్మక చివరి రెండు మ్యాచుల్లో చెరొకటి నెగ్గాయి. దీంతో 4-3తో ఢిల్లీ గెలుపొందింది. మరో మ్యాచ్‌లో నార్త్ ఈస్టర్న్ వారియర్స్‌పై అవాధె వారియర్స్ అలవోక విజయం సాధించింది. అగ్ర షట్లర్ సైనా నెహ్వాల్ తన ట్రంప్ మ్యాచ్‌లో ఓటమిపాలైంది. అమెరికా అమ్మాయి బీవాన్ జాంగ్ (అవాదె) చేతిలో 15-11, 11-15, 7-15తో ఓటమిపాలైంది.

హరేంద్రపై వేటు

చీఫ్ కోచ్‌ను సాగనంపిన హాకీ సమాఖ్య



న్యూఢిల్లీ : భారత హాకీ కోచ్ హరేంద్ర సింగ్‌పై వేటు పడింది. కామన్‌వెల్త్ క్రీడల్లో పతకం లేకుండా స్వదేశానికి చేరుకున్న హాకీ ఇండియా శిక్షణా పగ్గాలు జూనియర్ వరల్డ్ కప్ విన్నింగ్ కోచ్ హరేంద్ర సింగ్‌కు అప్పగించారు. కానీ హరేంద్ర వచ్చినా హాకీ ఇండియాలో మార్పు రాలేదు. ఆసియా క్రీడల్లో పసిడి అవకాశాన్ని వృథా చేసుకోవటంతో పాటు, భువనేశ్వర్‌లో జరిగిన వరల్డ్‌కప్‌లో పతకం సాధించలేదు. దీంతో హరేంద్ర సింగ్‌ను మళ్లీ జూనియర్ జట్టు కోచ్‌గానే పంపించారు. ఈ మేరకు హాకీ ఫెడరేషన్ బుధవారం వెల్లడించింది. హరేంద్ర సింగ్ హయాంలో హాకీ ఇండియా ఎటాకింగ్‌లో ఎన్నడూ లేని పరిణితి సాధించటమే కాదు ప్రపంచకప్‌లో మెడల్ సాధించేలా కనిపించింది. ఒలింపిక్ మెడల్ సాధించగల సత్తా ఉన్న కోచ్ హరేంద్రను తొలగించటంపై హాకీ వర్గాల్లో విమర్శలు వినిపిస్తున్నాయి.

హార్దిక్, రాహుల్‌లకు షోకాజ్



న్యూఢిల్లీ : ఓ టెలివిజన్ షోలో మాట్లాడుతూ, మహిళలపై వివక్షపూరిత, లైంగిక వ్యాఖ్యలు చేసిన భారత క్రికెటర్లు హార్దిక్ పాండ్య, కెఎల్ రాహుల్‌లకు పాలకుల కమిటీ (సీఓఏ) షోకాజ్ నోటీసు జారీ చేసింది. కరణ్ జోహార్ వ్యాఖ్యాతగా ఉన్న ఆ షోలో పాండ్య, రాహుల్ వ్యక్తిగత అంశాలపై కరణ్ పదే పదే ప్రశ్నించారు. రాహుల్ తొలుత హుందాగా కనిపించినా.. తనూ పాండ్యతో కలిసి మహిళలతో సంబంధాలపై, నైట్ పార్టీలతో అమ్మాయిలతో వ్యవహారాలపై చులకగా మాట్లాడారు. ఇది ప్రసారమైన తర్వాత మహిళలు, నెటిజన్లు పాండ్య, రాహుల్‌పై విరుచుకుపడ్డారు. బీసీసీఐ సంజాయిషీ నోటీసుకు వివరణ ఇచ్చిన పాండ్య, సోషల్ మీడియాలో క్షమాపణలు తెలిపాడు.

వన్డే ప్రాక్టీస మొదలు : భారత జట్టు వన్డే సిరీస్‌పై దృష్టి సారించింది. వరల్డ్‌కప్ నేపథ్యంలో వరుసగా వన్డే మ్యాచులకు సిద్ధమవుతున్న టీమ్ ఇండియా సిడ్నీలో ఆసీస్‌తో తొలి మ్యాచ్‌లో తలపడనున్నది. ఎం.ఎస్ ధోని, శిఖర్ ధావన్, కేదార్ జాదవ్, అంబటి రాయుడులు బుధవారం సిడ్నీ గ్రౌండ్‌లో సాధన మొదలెట్టారు. టెస్టు జట్టులోని ఆటగాళ్లు విశ్రాంతి తీసుకోగా, వన్డే జట్టులోకి వచ్చిన వారు సాధనలో మునిగిపోయారు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State Editor : S.Veeraiah.Tel Tel/2014/59462.